సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 12 వెల: ₹ 5.00

సంపుటి: 13 సంచిక: 7

సోమవారం 30-3-2020

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'నా ప్రస్థానంలో ప్రతి మలుపూ జన జీవితంతో ముడిపడి ఉంది'



**మళ్లీ వేసవిలోనే ఒలింపిక్స్!**

2021 టోక్యో ఒలింపిక్స్ నిర్వహణ తేదీలపై ఐఓసీ –స్పోర్ట్స్‌లో



**బీమా, రాబడి కావాలంటే!**

పన్ను ప్రయోజనాలు.. అవసరాలకు అనుగుణంగా ఎంపికకు వీలు –బిజినెస్‌లో

'సాక్షి' సెల్యూట్

# ప్రజా సైనికులకు వందనం

**కర్కశ రక్కసిపై కఠోర యుద్ధం చేస్తున్న ప్రజాసైనికులు**

**ప్రాణాలు పణంగా పెట్టి అత్యవసర సర్వీసుల సిబ్బంది సేవలు**

**కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నా విధుల్లోనే...**

సాక్షి, హైదరాబాద్



పక్క చిత్రంలో కనిపిస్తున్న పోలీసు అధికారి పేరు డి. రవిరాజ్. వరంగల్ అర్బన్ జిల్లాలోని కమలాపూర్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. పొరుగు రాష్ట్రాలకు పారిపోయిన దొంగలను తీసుకురావడంలో ఈయన స్పెషలిస్ట్. గతంలో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు పనిచేసేవారు. ఇప్పుడు కరోనా నేపథ్యంలో 24 గంటల డ్యూటీ. తన స్టేషన్ పరిధిలోని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ,



జెడ్పీటీసీలతో రోజూ సమావేశాలు... రెవెన్యూ, ఆరోగ్య సిబ్బందితో సభలు.. గ్రామస్తులకు అవగాహన సమావేశాలు... గతంలో స్టేషన్ నుంచి రోజుకు లంచ్‌కు, రాత్రి పూట డ్యూటీ ముగించుకుని రెండుసార్లు ఇంటికి వెళ్లేవాడు. జనతా కర్ఫ్యూ నుంచి నేటి దాకా రోజుకు కేవలం రాత్రిపూట మాత్రమే వెళుతున్నాడు. తాను రోజూ బయట తిరుగుతూ విధులు నిర్వర్తించాల్సిన నేపథ్యంలో వ్యక్తిగతంగా బాగానే జాగ్రత్తలు తీసుకుంటున్నాడు. అయినా.. ఇంటి వారితో మనస్ఫూర్తిగా కలవలేకపోతున్నాడు. తన ద్వారా కుటుంబ సభ్యులకు ఎక్కడ వైరస్ వ్యాప్తి చెందుతుందోనన్న ఆందోళనలో ఉన్నాడు. అందుకే వేరే గదిలో పడుకుంటున్నాడు. తనకు పంచ ప్రాణాలైన ఇద్దరు కూతుళ్లతో కలిసి సమయం గడపలేకపోతున్నాడు. మునుపటిలా కలివిడిగా ఉండలేకపోతున్నాడు. ఉండేది క్వార్టర్స్‌లోనే అయినా టిఫిన్, లంచ్, రాత్రి భోజనం అంతా బయటే చేస్తున్నాడు.

ఒక్క రవిరాజే కాదు... తుమ్ముతూ, దగ్గుతూ తన వద్దకు వస్తున్న వారికి మందులు ఇస్తున్న ఫార్మసిస్టు కోడి శివప్రసాద్, తన తండ్రిని కనీసం చూడలేకపోతున్న పోలీసు అధికారి విశ్వేశ్వర్ కుమార్తె అన్వి... ఎంతో శక్తివంతమైన సోడియం హైపోక్లోరైడ్ ద్రావణం భుజాన వేసుకొని వీపు బొబ్బలెక్కుతున్నా లెక్క చేయకుండా పారిశుద్ధ్య విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుడు యాదయ్య, సిలిండర్ భుజాన వేసుకొని నాలుగు అంతస్తులు ఎక్కి వంట గ్యాస్ అందించే నల్లగొండ రామలింగయ్య, మిగతా 3వ పేజీలో ▶

### పిల్లలు వద్దన్నా డ్యూటీకి...

'అమ్మా... డ్యూటీకొద్దు.. ఇంటి దగ్గరే ఉండమని పిల్లలు అంటున్నా వస్తున్నాను. ప్రస్తుతం కరోనా అంటేనే అంతా భయపడుతున్నారు. అయినప్పటికీ మాది సేవతో కూడిన ఉద్యోగం. పీహెచ్‌సీకి వచ్చిన వారికి కరోనాపై అవగాహన కల్పిస్తున్నాం. జ్వరం, జలుబు లాంటి లక్షణాలుంటే వరంగల్ ఎంజీఎంకు పంపిస్తున్నాం'

– ఎం. సులోచన, స్టాఫ్‌నర్సు, వంగర పీహెచ్‌సీ, వరంగల్ జిల్లా

### ఉద్యోగుల జీతాలపై..

ఈ పాటికి మనకు రూ. 12 వేల కోట్లు రావాలి. మార్చి 15 నుంచి ఆదాయం అంతా సున్నాలా ఉంది. ఎక్సైజ్, పెట్రోల్, జీఎస్టీ అన్నీ బంద్. ఎమ్మెల్యేల జీతాలు కూడా బంద్ పెట్టాల్సి వస్తే బంద్ పెడ్తం. ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు కూడా కోత కోయాల్సి వస్తే కోయాలి కదా. దీనికి ఎవరూ అతీతులు కాదు. ప్రభుత్వ ఉద్యోగులు రాష్ట్రంలో భాగం కదా. కష్టం వస్తే అందరూ పంచుకోవాలి. ఇది లగ్జరీ సమయం కాదు.



ప్రగతిభవన్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

### ధాన్యం కొనుగోలుపై..

ధాన్యం కొనడానికి ప్రభుత్వం వద్ద డబ్బులు లేవు. ఇంత కఠిన పరిస్థితిలో కూడా ధాన్యం సేకరణ కోసం సివిల్ సప్లైస్ కార్పొరేషన్‌కు రూ. 25 వేల కోట్లు సమీకరించినం. కార్పొరేషన్‌కు ఇంత పెద్ద మొత్తంలో డబ్బులు సమీకరించడం చరిత్రలో ఇదే తొలిసారి. మక్కల కొనుగోళ్ల కోసం మార్క్‌ఫెడ్‌కు రూ. 3,200 కోట్లు కలిపి రైతుల కోసం సుమారు రూ. 30 వేల కోట్లను రాష్ట్ర ప్రభుత్వం సమీకరించింది.

# లాక్‌డౌన్ 15న ఎత్తేసే చాన్స్ లేదు

## రాష్ట్రం, దేశం స్థిమితపడాలి: సీఎం కేసీఆర్

సాక్షి, హైదరాబాద్

కరోనా వైరస్ నియంత్రణకు ప్రకటించిన లాక్‌డౌన్‌ను ఏప్రిల్ 15న రాష్ట్రంలో ఎత్తేసే అవకాశం అసలు లేదని సీఎం కె.చంద్రశేఖర్‌రావు స్పష్టం చేశారు. 'నలుగురితో నారాయణ మనం. మనది చాలా పెద్ద దేశం. అంతా మంచిగుందని అనుకున్న తర్వాత ఒకరికి వైరస్ వస్తే పరిస్థితి ఏంటి? మళ్లీ అంటుకొనే ప్రమాదం ఉంటది. ముందు రాష్ట్రం, తర్వాత దేశం స్థిమిత పడాలి. ఆ విషయాన్ని మన వైద్య నిపుణులు చెబు తరు. ఈ విపత్కర పరిస్థితి నుంచి తొందరగా బయటపడాలని అందరికన్నా ఎక్కువగా దేవుణ్ణి ప్రార్థిస్తున్న. బయటపడే వరకు నియంత్రణ పాటించాలి. మనకు మరో గత్యంతరం లేదు' అని ఏప్రిల్ 15న లాక్‌డౌన్ ఎత్తి వేసేం దుకు ఉన్న అవకాశంపై విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. 'కరోనా వైరస్ ఎంత దూరం పోతదో మనకు తెలియదు. ఎప్పుడు విస్ఫోటనం లాగా విజృంభిస్తదో అంతుచిక్కకుండా ఉంది. డాక్టర్లు, నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్ల సేవల కోసం సీఎస్ ప్రకటన జారీ చేశారు. 100 మంది మిగతా 2వ పేజీలో ▶

- లేకుంటే మళ్లీ వైరస్ అంటుకునే ప్రమాదముంటది
- ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇస్తమా? ఎంత ఇస్తం? తెలియని పరిస్థితి
- రెవెన్యూ పూర్తిగా పడకేసింది
- కరోనాపై ఏ రోజుకారోజు బులెటిన్ విడుదల చేస్తున్నం
- విలేకరుల సమావేశంలో సీఎం కేసీఆర్ స్పష్టీకరణ

'గాంధీ' వైద్యులు ధైర్యం చెప్పడం వల్లే..

# కోలుకున్నా..

**'మన్ కీ బాత్'లో తెలంగాణ తొలి కరోనా బాధితుడు గంప రామ్‌తేజ**

**ఫోన్లో పలకరించిన ప్రధాని మోదీకి తన అనుభవాల వివరణ..**

సాక్షి, హైదరాబాద్, న్యూఢిల్లీ

తెలంగాణలో తొలి కరోనా పాజిటివ్ బాధితుడు.. వైరస్ బారి నుంచి విజయవంతంగా కోలుకొని డిశ్చార్జి అయిన హైదరాబాద్‌వాసి గంప రామ్‌తేజ ఆదివారం ప్రధాని మోదీతో 'మన్‌కీ బాత్'లో తన అనుభవాలు, గాంధీ వైద్యులు అందించిన సేవలు, వైరస్‌పై ప్రజల్లో నెలకొన్న అపోహలు, భయాలపై సవివరంగా పంచుకున్నారు. కరోనా వైరస్ సోకిందని తెలియగానే ఆయనకు ఏమనిపించింది? అసలు ఆ వైరస్ ఎక్కడి నుంచి వచ్చింది? గాంధీ ఆస్పత్రిలో చికిత్స ఎలా జరిగింది? కరోనా వైరస్ అనుమానితులు, విదేశాల నుంచి వచ్చిన వారు క్వారంటైన్‌లో ఎందుకు ఉండాలి? క్వారంటైన్‌లో ఉన్నప్పుడు తాను ఎలా ఉన్నాడు? తెలంగాణ సమాజంపై ఉన్న బాధ్యత ఏంటి? ఈ మహమ్మారి దేశం నుంచి వెళ్లిపోతుందని ఆయన నమ్ముతున్నారా? లాంటి అనేక విషయాలపై మనసువిప్పి మోదీతో మాట్లాడారు. కరోనా సోకిన తనకు చికిత్స చేసిన గాంధీ ఆస్పత్రి వైద్యులు, నర్సులు చాలా మంచివాళ్లని, ఈ వైరస్ బారి నుంచి తాను బతికి బయటపడటానికి వారు నూరిపోసిన ధైర్యమే కారణమని చెప్పారు. మోదీ, రామ్‌తేజల మధ్య జరిగిన సంభాషణ వారి మాటల్లోనే...



**మోదీ:** ఎస్.. రామ్

**రామ్‌తేజ:** నమస్కారమండి.

**మోదీ:** ఎవరు? రామ్‌గారేనా మాట్లాడేది.

**రామ్‌తేజ:** అవును సార్, రామ్‌నే..

**మోదీ:** రామ్ నమస్తే.

**రామ్‌తేజ:** నమస్తే.. నమస్తే..

**మోదీ:** మీరు కరోనా వైరస్ పెనుప్రమాదం నుంచి బయటపడ్డారని విన్నా.

**రామ్‌తేజ:** అవును సార్.

**మోదీ:** మీతో ఒక విషయం మాట్లాడాలనుకుంటున్నా. మీరు పెను ప్రమాదం నుంచి ఎలా బయటపడ్డారు? మిగతా 2వ పేజీలో ▶

- ప్రతిరోజూ డాక్టర్లు, నర్సులు నాతో మాట్లాడేవాళ్లు
- క్వారంటైన్ అంటే జైలు జీవితం కాదు.. అది మన కోసమే
- ఇంటికి వచ్చాక 14 రోజులు ఒకే గదిలో మాస్క్‌తో ఉన్నా
- మీ నాయకత్వంలో దేశం ఈ మహమ్మరిని జయిస్తుంది..

**నన్ను క్షమించండి: లాక్‌డౌన్‌పై మోదీ** 8లో

# కొత్తగా 3,350 పడకలు



## 'కరోనా' సేవల్లో 'ప్రైవేటు' బోధనాసుపత్రులు

- ప్రభుత్వ స్వాధీనంలోకి 22 ప్రైవేటు మెడికల్ కాలేజీలు, అనుబంధ ఆసుపత్రులు
- అందుబాటులోకి 236 ఐసీయూలు, 80 వెంటిలేటర్లు
- రూ.30 కోట్లతో అవసరమైన వైద్య పరికరాలన్నీ సరఫరా చేయనున్న ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: ప్రైవేట్ మెడికల్ బోధన ఆసుపత్రులన్నింటినీ ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. 22 ప్రైవేటు మెడికల్ కాలేజీలు, వాటికి అనుబంధంగా ఉన్న ఆసుపత్రులు (ఒకట్రెండు మినహా) సోమవారం నుంచి కరోనా బాధితుల సేవల్లో భాగస్వామ్యం కానున్నాయి. ఇప్పటికే ఆయా మెడికల్ కాలేజీ యాజమాన్యాలతో కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ డాక్టర్ కరుణాకర్‌రెడ్డి చర్చలు జరిపిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ప్రైవేటు బోధనాసుపత్రుల్లో ఉన్న 3,350 పడకలు, 236 ఐసీయూ పడకలు, 80 వెంటిలేటర్లు పూర్తిగా కరోనా బాధితుల కోసమే వినియోగిస్తారు. ప్రస్తుతం ఆయా బోధనాసుపత్రుల్లో ఉన్న రోగులను ప్రత్యామ్నాయ ఆసుపత్రులకు మిగతా 3వ పేజీలో ▶

# సరిహద్దులను మూసేయండి..

**రాష్ట్రాలు, జిల్లాల బోర్డర్లను మూసేయాలని కేంద్రం ఆదేశాలు**

- వలస కూలీల ద్వారా కరోనా వైరస్ వ్యాప్తి జరగకుండా అడ్డుకోవడం కోసం దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, జిల్లాల సరిహద్దులను మూసేయాలని కేంద్రం ఆదివారం ఆదేశాలు జారీ చేసింది. కేంద్రం కఠినమైన ఆదేశాలను జారీ చేసినప్పటికీ.. వేల సంఖ్యలో ఉపాధి కరువైన వలస కూలీలు మూకుమ్మడిగా నగరాల నుంచి తమ స్వస్థలాలకు కాలినడక సహా తమకు వీలైన అన్ని మార్గాల ద్వారా వెళ్లేందుకు ప్రయత్నిస్తూనే ఉండటం గమనార్హం. - వివరాలు 8లో



దేశ వ్యాప్తంగా లాక్‌డౌన్ కారణంగా ఉపాధి లేక ఢిల్లీ నుంచి స్వగ్రామాలకు కాలినడకన వెళ్తున్న వలసదారులు

## 7,00,000

ప్రపంచవ్యాప్తంగా కరోనా కేసుల సంఖ్య (దాదాపు)

## 32,000

ప్రపంచవ్యాప్తంగా కరోనా మృతుల సంఖ్య..

- ఈయూ ఏర్పడిన తర్వాత ఇంతటి ఆర్థిక సంక్షోభ పరిస్థితుల్ని ఎదుర్కోవడం ఇదే తొలిసారి.
- స్పెయిన్‌లో రికార్డు స్థాయిలో ఆదివారం ఒకే రోజు 838 మరణాలు నమోదయ్యాయి. దీంతో మొత్తం మృతుల సంఖ్య 6,528కి చేరుకుంది.
- స్పెయిన్ దేశ యువరాణి మేరీ థెరెసా కరోనా బారిన పడి ప్రాణాలు కోల్పోయారు. ఆమె వయసు 86 ఏళ్లు. యూరప్‌లో రాజ కుటుంబానికి చెందిన వ్యక్తి మరణించడం ఇదే మొదటిసారి.
- అమెరికాలో ఇన్నాళ్లూ న్యూయార్క్, కాలిఫోర్నియాలను అతలాకుతలం చేసిన వైరస్ ఇప్పుడు డెట్రాయిట్, న్యూ ఓర్లీన్స్, చికాగోల్లో తన ప్రతాపాన్ని చూపిస్తోంది.
- అమెరికాలో లక్షా 20 వేలకు పైగా కేసులు నమోదైతే, మృతుల సంఖ్య 2 వేలు దాటిపోయింది.

## 1,024

భారత్‌లో మొత్తం కరోనా కేసుల సంఖ్య

## 27 మొత్తం మృతులు

- వివరాలు 8లో

### ఏపీ బాటలో కేరళ..

- మలయాళీ సీమలో ఏపీ తరహా వలంటీర్ల వ్యవస్థ
- కరోనా కట్టడికి కేరళ సీఎం పినరయి విజయన్ నిర్ణయం - 3లో

సూచించిన నేటి గుడ్లు & చికెన్ హైదరాబాద్ జోన్ ధరలు

Vencobb CHICKEN | NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE

| | | |
|---|---|---|
| గుడ్డ రిటైల్ ధర ₹ 44 డజన్ | ఫారం దగ్గర లైవ్ బర్డ్ 70 కిలో | డ్రెస్డ్ స్కిన్‌తో 133 కిలో |
| | రిటైల్ లైవ్ బర్డ్ 92 కిలో | స్కిన్‌లెస్ 152 కిలో |

వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

ఇదం జగత్





## కరోనా బాధితుల్లో మగవారే ఎక్కువ

- ఇప్పటివరకు నమోదైన కేసుల్లో 71 శాతం పురుషులే
- మహిళలకు రిస్క్ తక్కువ... చిన్న పిల్లలకు రిస్క్ లేనట్లే
- గుండె వ్యాధిగ్రస్తులే కరోనాకు మొదటి శత్రువులు
- పొగతాగే అలవాటున్న వారికి మరింత ప్రమాదం
- చనిపోయిన వారిలో 29.9 శాతం 70 ఏళ్ల పైబడినవారే
- కరోనా అప్‌డేట్స్ ఇచ్చే 'వరల్డో మీటర్'నివేదిక వెల్లడి

-12లో

# లాక్‌డౌన్‌కు నై..

సాక్షి, హైదరాబాద్

'కరోనా దేశాన్ని చుట్టబెట్టేస్తోంటే.. ఇటలీ వాసులు ఎంజాయ్ చేస్తూ కూర్చున్నారు'. చైనాలో కరోనా పంజా విసురుతూ ఇటలీని చేరిన వేళ అక్కడి ప్రజలు దాన్ని పట్టించుకోకుండా విందు వినోదాలతో ఎంజాయ్ చేశారు. ఫలితంగా ఆ దేశం ఇప్పుడు అనుభవిస్తోన్న బాధను ప్రపంచం కళ్లారా చూస్తోంది. కరోనా కోరలు చాస్తూ యూఎస్‌ను చుట్టుముడుతున్న వేళ అమెరికాలోని బీచ్‌లు జనం చిందులతో హోరెత్తాయి. ఇప్పుడా నిర్లక్ష్యం తాలూకు ఫలితాన్ని అమెరికా అనుభవిస్తోంది. రెండు వారాల క్రితం వరకు కరోనా మనల్నేం చేయలేదనే ధీమా.. కానీ మన దగ్గరా ఇప్పుడు పాజిటివ్ కేసులు వేయిని మించాయి. గాంధీ ఆసుపత్రి ప్రత్యేక వార్డు కరోనా బాధితులతో కిక్కిరిసిపోతోంది. మన మధ్య ఎంతమంది వైరస్ సోకిన వారు తిరుగుతున్నారో తెలియని పరి స్థితి. కానీ మన జనం మాత్రం దీన్ని పట్టించుకోవట్లేదు. ఆదివారం కనిపించిన దృశ్యాలే ఇందుకు నిదర్శనం.

- యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన
- కరోనా భయం నిల్.. చిన్నబోయిన లాక్‌డౌన్
- రోడ్లెక్కి నగరవాసుల షికార్లు
- మటన్, చికెన్ కోసం ఎగబడిన జనం



ఆదివారం కరీంనగర్‌లోని కూరగాయల మార్కెట్(బస్టాండ్)లో కిక్కిరిసిన జనం

### మాంసం మళ్లీ దొరకదన్నంతగా..

నిత్యావసర వస్తువుల కొనుగోలుకు ప్రభుత్వం లాక్‌డౌన్ వేళ ఉదయం నుంచి సాయంత్రం ఆరు వరకు బయటకు వచ్చేందుకు అవకాశం కల్పించింది. కానీ సామాజిక దూరాన్ని పాటించాలని ఆదేశించింది. జనం జిహ్వా చాపల్యం ముందు ఈ నిబంధన బలాదూర్ అయింది. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మాంసం మార్కెట్లు, దుకాణాలపైకి ఇక ఇప్పట్లో మాంసం దొరకదేమో అన్నట్టుగా జనం ఎగబడ్డారు. 'దూరం'సంగతి దేవుడెరుగు ఒకరిపై ఒకరు పడిపోతూ, తోసుకుంటూ తండ్లాడారు. గుంపులో ఎవరు తుమ్మినా, దగ్గినా.. ఆ జనం మధ్య కరోనా బాధితులు మిగతా 2వ పేజీలో ▶

## రైల్వే ఆస్పత్రుల్లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకూ చికిత్స

**సాక్షి, హైదరాబాద్:** ఇప్పటి వరకు కేవలం రైల్వే ఉద్యోగులకే పరిమితమైన రైల్వే ఆస్పత్రులు, ఆరోగ్య కేంద్రాలు ఇక నుంచి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులందరూ వినియోగించుకోవచ్చు. ఈ మేరకు రైల్వే శాఖ నిర్ణయం తీసుకుంది. కరోనా వైరస్ వేగంగా విస్తరిస్తున్న తరుణంలో ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమైనా, వీటిని వినియోగించుకోవచ్చని సూచించింది. కరోనా లక్షణాలతో బాధపడే వారే కాకుండా ఇతర ఆరోగ్య సమస్యలకు కూడా చికిత్స పొందటం ఇబ్బందిగా మారడంతో రైల్వే శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. కేంద్రప్రభుత్వ ఉద్యోగులు ఎలాంటి ఆరోగ్య సమస్యలున్నా తమకు సమీపంలోని రైల్వే ఆస్పత్రులకు గాని, రైల్వే ఆరోగ్య కేంద్రాలకు గాని వెళ్లి చికిత్స పొందవచ్చు. వారిలో కరోనా లక్షణాలుంటే మాత్రం వెంటనే గాంధీ ఆస్పత్రికి రిఫర్ చేస్తారు.

## 402 ప్రాంతాల్లో రైతుబజార్లు

### వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి వెల్లడి



**సాక్షి, హైదరాబాద్:** కూరగాయలను ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు మార్కెటింగ్ శాఖ మొబైల్ రైతుబజార్లను నడుపుతోంది. సీఎం కేసీఆర్ ఆదేశాలతో 198 వాహనాలలో ఆదివారం 402 ప్రదేశాలలో మొబైల్ రైతుబజార్లను ఏర్పాటు చేశామని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్ రెడ్డి తెలిపారు. దీంతో వినియోగదారులు సామాజిక దూరం పాటిస్తూ, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు విక్రయాలు జరిపారన్నారు. కూరగాయలను అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం మొబైల్ వాహనాలను అందుబాటులోకి తెచ్చింది.

## ఇంటి గడపే మీకు లక్ష్మణ రేఖ!

### కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి జి.కిషన్‌రెడ్డి



**సాక్షి, న్యూఢిల్లీ:** ఇంటి గడపే లక్ష్మణ రేఖగా భావించి ఎవరూ బయటకు రావొద్దని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి జి. కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన ఒక ఆడియో సందేశాన్ని మీడియాకు పంపారు. 'కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, పారామిలిటరీ బలగాలు, వైద్య సిబ్బంది, నర్సులు, పోలీసులు, డ్రైవర్లు, హోం డెలివరీ ఉద్యోగులు ఎంతో ధైర్యంగా సేవలు అందిస్తున్నారు. అందరూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే ఇంట్లోనే ఉండాలి. కరోనాకు ఔషధం లేదు. అందువల్ల అందరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. కరోనాపై యుద్ధంలో విజయం సాధించాలంటే ఎవరూ బయటకు వెళ్లకూడదు. లక్ష్మణ రేఖ దాటి కరోనాను తెచ్చుకోకూడదు..'అని కోరారు.

## నిమ్స్‌కు 'మేఘా' విరాళం

**సాక్షి, హైదరాబాద్:** నిజాం వైద్య విజ్ఞాన సంస్థ (నిమ్స్)లో అత్యవసర చికిత్స పొందే రోగులకు అవసరమైన వెంటిలేటర్ల ఏర్పాటుకు మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) రూ.41.95 లక్షల విరాళాన్ని అందజేసింది. ఈ మేరకు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పీవీ కృష్ణారెడ్డి..నిమ్స్ డైరెక్టర్ కె.మనోహర్‌కు లేఖతో పాటు విరాళానికి సంబంధించిన చెక్కును పంపించారు. అత్యవసర చికిత్స పొందే రోగులకు అవసరమైన వెంటిలేటర్ల సరఫరాతో పాటు, రవాణా అవసరాలు కూడా తీరుస్తామని ఎండీ కృష్ణారెడ్డి లేఖలో పేర్కొన్నారు.

## కాంట్రాక్ట్ పద్ధతిలో వైద్య సిబ్బంది భర్తీ

### కరోనా నేపథ్యంలో సర్కారు ఉత్తర్వులు

**సాక్షి, హైదరాబాద్:** కాంట్రాక్ట్ పద్ధతిలో డాక్టర్లు, నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్ల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ఏడాది పాసైన వాళ్ల నుంచి, రిటైర్ అయినవాళ్ల వరకూ ఎవరైనా ఈ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశమిచ్చింది. ఆసక్తి ఉన్నవారు ఏప్రిల్ మూడో తేదీ వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. స్పెషలిస్ట్ డాక్టర్లకు రూ.లక్ష, మెడికల్ ఆఫీసర్ (ఎంబీబీఎస్)లకు రూ.40 వేలు, ఆయుష్ మెడికల్ ఆఫీసర్లకు రూ.35 వేలు, స్టాఫ్ నర్సులకు రూ.23 వేలు, ల్యాబ్ టెక్నీషియన్లకు రూ.17 వేల చొప్పున వేతనం ఇవ్వనున్నట్టు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు అనుబంధంగా ఉన్న 18 ఆసుపత్రుల్లో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో 1,645 స్టాఫ్ నర్స్ పోస్టుల భర్తీకి ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేశారు. ఇప్పుడు కాంట్రాక్ట్ రిక్రూట్‌మెంట్‌కు నోటిఫికేషన్ విడుదల చేశారు.

## ఏపీలో మరో రెండు పాజిటివ్ కేసులు

**సాక్షి, అమరావతి/సాక్షి,విశాఖపట్నం:** ఏపీలో ఆదివారం మరో రెండు కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ఈ రెండూ విశాఖలోనే నమోదయ్యాయి. దీంతో రాష్ట్రంలో పాజిటివ్ కేసుల సంఖ్య 21కి చేరింది. విశాఖలో కేసుల సంఖ్య 6కి పెరిగింది. నమోదైన రెండు కేసులూ ఇతర దేశం నుంచి వచ్చిన వారినుంచి సోకినవేనని నిర్ధారిం చారు. బర్మింగ్‌హాం నుంచి ఈనెల 17న విశాఖ వచ్చిన వ్యక్తికి పరీక్షలు జరపగా కరోనా పాజిటివ్ వచ్చింది. అతని బంధువులను ఐసొలేషన్‌లో ఉంచి పరీక్షించగా తండ్రికి పాజిటివ్‌గా వచ్చింది. తాజాగా మరో ఇద్దరు కుటుంబ సభ్యులకు కూడా పాజిటివ్‌గా తేలింది. ఆదివారం 85 నమూనాలను ల్యాబొరేటరీకి పంపించగా, అందులో 83 నమూనాలు నెగిటివ్‌గా తేలగా మిగతా 2 పాజిటివ్‌గా వచ్చాయని వైద్య ఆరోగ్యశాఖ ఆదివారం తెలిపింది.

## లాక్‌డౌన్‌ను పట్టించుకోని కానిస్టేబుల్

**తిరుమలగిరి (తుంగతుర్తి):** కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో బాధ్యతగా ఉండాల్సిన ఓ పోలీస్ కానిస్టేబుల్ నిబంధనలు అతిక్రమించాడు. మాల్దీవుల నుంచి వచ్చిన ముగ్గురికి ఇంట్లో ఆశ్రయం కల్పించడమే కాకుండా వారితో బయట తిరిగి జల్సాలు చేశాడు. సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మున్సిపాలిటీ కేంద్రంలో ఆదివారం ఈ సంఘటన వెలుగు చూసింది. భద్రాద్రి కొత్తగూడేనికి చెందిన ప్రతాప్, నల్లగొండ జిల్లా కట్టంగూర్‌కు చెందిన ప్రదీప్, బి.హరీశ్‌లు మాల్దీవులలోని ఓ రిసార్ట్‌లో ఏడాదిన్నర కాలంగా వెయిటర్‌గా ఉద్యోగం చేస్తున్నారు. ఈ నెల 21న హైదరాబాద్‌కు వచ్చారు. ఐదు రోజులు అక్కడే ఉండి అనంతరం ఈ నెల 26న తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న మాండ్ర శ్రీనివాస్ ఇంటికి వచ్చారు. నిబంధనల ప్రకారం 14 రోజుల పాటు గృహ నిర్బంధంలో ఉండాల్సిన వారు, కానిస్టేబుల్ శ్రీనివాస్‌తో కలసి బయట తిరగడంతో పాటు జల్సాలు చేస్తున్నారని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఆదివారం తహసీల్దార్ హరిశ్చంద్రప్రసాద్, సీఐ శ్రీనివాస్, వైద్యాధికారి ప్రశాంత్‌బాబు కానిస్టేబుల్ ఇంటికి వెళ్లగా శ్రీనివాస్ వారితో దురుసుగా ప్రవర్తించాడు. కాగా, వైద్య శాఖ సిబ్బంది.. మాల్దీవుల నుంచి వచ్చిన ముగ్గురితో పాటు కానిస్టేబుల్‌కు స్టాంపులు వేసి 28 రోజుల పాటు స్వీయ గృహ నిర్బంధంలో ఉండాలని ఆదేశించారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారి వివరాలు తెలియజేయాలని వారు ప్రజలను కోరారు.



శ్రీనివాస్‌తో పాటు మాల్దీవులు నుంచి వచ్చిన ముగ్గురు వ్యక్తులు

# లాక్‌డౌన్ 15న ఎత్తేసే చాన్స్ లేదు

▶ మొదటి పేజీ తరువాయి

అవసరమైతే 130 మందిని సిద్ధం చేసుకోవాలి. వారి సేవలు అవసరమైనప్పుడు వారికి డబ్బులిస్తరు. 60 ఏళ్లలోపు వయసుగల సాంకేతిక అర్హతలున్న వారు అర్హులే. పీజీ చేసిన వారు, రిటైరైన డాక్టర్లు, ఎంబీబీఎస్ పాసైన వారిని తీసుకుంటం. పరిస్థితి ఎంతవరకు వెళ్లినా ఎదుర్కొనే సత్తా మనకు ఉంది. రిటైరైన ఆర్మీ వాళ్లు.. సేవాభావం ఉన్న వాళ్లు రావాలి'అని సీఎం పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కరోనా నియంత్రణ చర్యల గురించి ఆదివారం ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్ విలేకరుల సమావేశంలో తెలిపారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

### ఉద్యోగులకు జీతాలిస్తమా?

ప్రభుత్వ రెవిన్యూ పడిపోయింది. ఉద్యోగులకు జీతాలు ఇస్తమా? ఇస్తే ఎంతిస్తం అన్న పద్ధతి ఉంది. ఈపాటికి మనకు రూ. 12 వేల కోట్లు రావాలి. మార్చి 15 నుంచి ఆదాయం అంతా సున్నాలా ఉంది. ఎక్సైజ్, పెట్రోల్, జీఎస్టీ అన్నీ బంద్. ఎమ్మెల్యేల జీతాలు కూడా బంద్ పెట్టాల్సి వస్తే బంద్ పెడ్తం. ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు కూడా కోత కోయాల్సి వస్తే కోయాలి కదా. దీనికి ఎవరూ అతీతులు కాదు. ప్రభుత్వ ఉద్యోగులు రాష్ట్రంలో భాగం కదా. కష్టం వస్తే అందరూ పంచుకోవాలి. ఇది లగ్జరీ సమయం కాదు. సంక్షోభంలో ఉన్నం. అందరూ తగ్గించుకోవాలి. రెండు బుక్కలకు బదులు ఒక బుక్కనే తినాల. రాష్ట్రంలో బంద్ అయితే కేంద్రానికి కూడా బంద్ అవుతది. ప్రతిదీ నిలిచిపోతుంది. రెండు నెలలో, మూడు నెలలో, నాలుగు నెలలో ఈ గండం గట్టెక్కే దాకా అందరూ ఊపిరి బిగపట్టుకొని కొంచెం నియంత్రణ పాటించాలి. అందరం రాజీపడితే ఈ సమాజం నడుస్తది. విరాళాల కోసం పిలుపు ఇవ్వాల్సిన అవసరం లేదు. గొప్పవాళ్లు వచ్చి ఇస్తున్నరు. వారికి శతకోటి దండాలు.

### దుష్ప్రచారం చేసే వారిని వదలం..

సోషల్ మీడియా, ఇతర మీడియాలో దుర్మార్గమైన ప్రచారాలు చేసే వారిని కఠినంగా శిక్షిస్తం. చాలా భయంకరమైన శిక్షలుంటయి. ఇట్ల ఉంటయి నేను చూపిస్త. ఎంత చేస్తే దానికి 100 రెట్ల శిక్ష అనుభవిస్తరు. ఇలా చేసే వారికి అందరికంటే ముందు కరోనా సోకుతది... సోకాలి కూడా. ఆరోగ్య మంత్రి రోజూ 2–3 సార్లు సమీక్ష చేస్తున్నరు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం అవసరాన్నిబట్టి బులెటిన్ విడుదల చేస్తున్నం. కేసుల వివరాలను ప్రభుత్వమే చెబుతోంది. దాయాల్సిన అవసరం ఏముంది? అందరికీ తెల్వాలి. రెండు సందర్భాల్లో కేసులు పెరిగినయి. ఇండోనేసియా నుంచి 10 మంది వచ్చారు. మరోసారి 10 కేసులు పెరిగినయి. నిన్న ఒక వ్యక్తి చనిపోయిండు. ప్రభుత్వమే అన్నీ బయటపెట్టింది. మరణించిన వ్యక్తి మన కంట్రోల్‌లో చనిపోలేదు. అయినా ప్రభుత్వం సమాచారాన్ని ఆపలేదు. వ్యాప్తి చెందుతుంటే, కంట్రోల్ దాటుతుంటే జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు మనమే చెబుతం. దుర్మార్గులకు ఫస్ట్ కరోనా పట్టుకోవాలని నేను శాపం పెడుతున్న.

### ఢిల్లీ నుంచి వచ్చిన వారందరినీ పట్టుకున్నం..

ఢిల్లీకి వెళ్లి వచ్చిన వారందరినీ పట్టుకొచ్చినం. ఒకచోట 130మందిని, కొత్తగూడెంలో 200 మందిని పట్టుకున్నరు. ఒకరు ఏపీలో పెళ్లికి కూడా వెళ్లి వచ్చిండు. అక్కడ వారికి కూడా సమాచారం ఇచ్చినం.

### 70 పాజిటివ్ కేసులు..

రాష్ట్రంలో కరోనా పాజిటివ్ కేసులు 70కి పెరిగాయి. ఒక వ్యక్తి మొదట్లోనే డిశ్చార్జ్ అయ్యాడు. అతను ఆదివారం ప్రధానితో మాట్లాడిండు. గాంధీ ఆస్పత్రిలో బాగా చూశారు. ఇక్కడ వైద్యులు ఆత్మవిశ్వాసం నింపడంతో బతకడానికి దోహదపడిందని చెప్పాడు. చికిత్స పొందుతున్న రోగుల్లో ఆదివారం 11 మందికి నెగటివ్ రావడం మంచి వార్త. వారికి బీమారీ పోయింది. నిబంధనల ప్రకారం తుది పరీక్షల్లో నెగెటివ్ అని తేలిన తర్వాతే సోమవారం వారిని డిశ్చార్జి చేస్తారు. డిశ్చార్జికి ముందు వారి ఛాతీ ఎక్స్‌రే తీసుకోవాలి. ఈ ప్రక్రియలన్నీ పూర్తయ్యేక మళ్లీ తుది పరీక్షలు నిర్వహించి నెగెటివ్ వస్తే ఇళ్లకు పంపిస్తం. మన దగ్గర ఇక చికిత్సలో 58 మంది మాత్రమే మిగులుతారు. 76 ఏళ్ల ఒక రోగికి కిడ్నీ, ఇతర సమస్యలున్నాయి. ఆయనొక్కడు తప్ప మిగతా వారంతా సక్కగా ఉన్నరు. అందరికందరూ కోలుకొని ఇళ్లకు వెళ్లేలా ఉన్నరు.



ఆదివారం ప్రగతిభవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్. చిత్రంలో ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, డీజీపీ మహేందర్‌రెడ్డి, మంత్రులు ఈటల, నిరంజన్‌రెడ్డి, సీఎస్ సోమేశ్‌కుమార్, వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి

### క్వారంటైన్‌లో 25,937 మంది...

విదేశాల నుంచి వచ్చిన మొత్తం 25,937 మందిపై నిఘా పెట్టుకున్నం. విదేశాల నుంచి కరోనా వ్యాధి మోసుకొచ్చినవారు, విదేశాల నుంచి వచ్చిన వ్యాధి అనుమానితులు, జబ్బు బారినపడినవారు కలిపితే 25,937 మంది అవుతారు. ఇందులో చాలా మంది క్వారంటైన్ గడువు మార్చి 30తో ముగుస్తుంది. ఆ తర్వాత మా పర్యవేక్షణ అవసరం లేదు. వారిలో కరోనా లక్షణాలు కూడా రాలేదు. ఏప్రిల్ 7కు క్వారంటైన్‌లో ఉండే వారి సంఖ్య సున్నా అయ్యే పరిస్థితి ఉంది. మార్చి 30న (నేడు) 1,899 మంది, మార్చి 31న 1,440 మంది, ఏప్రిల్ 1న 1,461 మంది, ఏప్రిల్ 2న 1,887, ఏప్రిల్ 3న 1,476, ఏప్రిల్ 4న 1,453 మంది, ఏప్రిల్ 5న 914, ఏప్రిల్ 6న 454, ఏప్రిల్ 7న 397 మంది క్వారంటైన్ గడువు ముగుస్తుంది. ఏప్రిల్ 7 తర్వాత రాష్ట్రంలో కరోనాకు సంబంధించిన వ్యక్తి ఉండడు. ఆలోగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిలో 35 మందికిపైగానే డిశ్చార్జి అవుతారు. ఇక మన దగ్గర 10 మంది ఉంటరు. అంతర్జాతీయ విమానాలు, పోర్టులు బంద్ అయ్యాయి కాబట్టి అంతర్జాతీయంగా వ్యాధి వచ్చే ప్రమాదం లేదు. లోకల్‌గా వచ్చి అంటించే అవకాశముందని కొత్తగూడెం, కరీంనగర్ కేసుల బాధితులను వివిధ ఆస్పత్రుల్లో పెట్టినం. వారు నిఘాలో ఉన్నరు.

### అంతర్జాతీయంగా ప్రశంసలు...

కరోనాపై పోరులో భారత్ తెలివిగా వ్యవహరించిందని ప్రపంచవ్యాప్తంగా ఉన్న మెడికల్ సైన్స్‌కి సంబంధించిన మేధావులు అంతర్జాతీయ మ్యాగజైన్స్‌లో రాశారు. పేద దేశం, ఇప్పుడే అభివృద్ధి బాటలో పయనిస్తున్న మన దేశంలో ఉండాల్సిన స్థాయిలో పటిష్ట వైద్య సదుపాయాలు లేవు. లాక్‌డౌన్ ఆయుధాన్ని భారత్ కరెక్ట్‌గా ప్రయోగించింది. 130 కోట్ల మంది ఉన్న దేశంలో సమస్య పెరగనివ్వలేదని అంతర్జాతీయ స్థాయిలో మెచ్చుకుంటున్నరు. ఈ గండం నుంచి పూర్తిగా బయటపడే వరకు ప్రజలు గుంపులుగా గుమికూడకపోవడం, స్వీయ నియంత్రణ, లాక్‌డౌన్‌ను పాటించడం, వైద్య, పోలీసు అధికారులకు సహకరించడం చేయాలి. దక్షిణ కొరియాలో ఒకే ఒక వ్యక్తి తనకు తెలియకుండానే 59 వేల మందికి వ్యాధిని అంటించాడు. ఒక సూది మొన మీద కొన్ని కోట్ల కరోనా క్రిములుంటయి. ఇది చాలా ప్రమాదకర వైరస్. ఈ గండం గట్టెక్కే వరకు ప్రజలు బాగున్నమని అనుకోవద్దు. ఏ నిమిషంలో ఏ విధమైన డెవలప్‌మెంట్ ఉంటదో తెల్వదు. తీవ్ర క్రమశిక్షణ అవసరం. ఇప్పటివరకు బాగా సహకరిస్తున్నారు. కదలికలు తగ్గాయి. ప్రజలు సహకరిస్తే తక్కువ నష్టంతో బయటపడవచ్చు.

# ప్రతి గింజనూ కొంటం

### ధాన్యం, మక్కల కొనుగోళ్లకు రూ. 30 వేల కోట్ల సమీకరించాం

- గ్రామాల్లోనే కొనుగోళ్లు
- కూపన్లలో పేర్కొన్న తేదీల్లోనే కొనుగోళ్లు
- దేశంలో ఎక్కడా ఈ ఏర్పాట్లేవు
- మీడియాతో సీఎం కేసీఆర్

**సాక్షి, హైదరాబాద్:** 'తెలంగాణలో ప్రస్తుతం 50 లక్షల ఎకరాల పైచిలుకు పంటలున్నాయి. 40 లక్షల ఎకరాల వరి, 14.50 లక్షల టన్నుల దిగుబడినిచ్చే మొక్కజొన్న పంటలున్నాయి. యాసంగిలో ఇది రికార్డు. ఒక గింజ కూడా రైతులు బయట అమ్ముకోవాల్సిన అవసరం లేదు. అంతా ప్రభుత్వమే కొంటది. ప్రస్తుతం మొక్క జొన్నకు ధరలేదు. బయట అమ్ముకుంటే నష్టపోతారు. దాని దృష్ట్యా ప్రభుత్వమే కొనాలని నిర్ణయించింది. క్వింటాల్ మక్కలకు రూ. 1,200 కూడా కొన్ని చోట్ల ఇస్తలేరు. రూ. 800 అని కొన్నిచోట్ల అంటున్నరు. వరి, మొక్కజొన్న ప్రతి గింజనూ ప్రభుత్వమే 100 శాతం కొంటుంది' అని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు రైతులకు హామీ ఇచ్చారు. వరి, మక్కల కొనుగోళ్లపై ఆదివారం ప్రగతి భవన్ నుంచి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియంత్రిత విధానంలో కూపన్లలో ఇచ్చిన తేదీ రోజుల్లోనే రైతులు ధాన్యం, మక్కలను తీసుకురావాలి. లేకుంటే కొనరు.. వెనక్కి పంపిస్తారు. రవాణా డబ్బులు మీద పడుతాయి అని రైతులను హెచ్చరించారు. ఇతర వివరాలు ఆయన మాటల్లోనే..

### హార్వెస్టర్ల మెకానిక్‌లకు అనుమతి...

వరి పంట కోతకు మన రాష్ట్రంలో 5 వేల హార్వెస్టర్లున్నాయి. తమిళనాడు నుంచి 500–1,500 వరకు వస్తున్నాయి. ట్రాక్టర్ ఆధారిత హార్వేస్టర్లు మనవి. ఒకటే ట్రాక్టర్‌ను రైతులు అనేక పనులకు వాడుతున్నరు. హార్వెస్టర్లన్నీ ట్రాక్టర్ల నుంచి దించి ఉన్నయి. రైతులు ఎవరికి వారు ఎక్కించుకోలేరు. పట్టణాల్లో ఉన్న హార్వెస్టర్ టెక్నీషియన్లకు ప్రత్యేక పాసులు ఇచ్చి గ్రామాలకు అనుమతించాలని ఆదేశించినం. హార్వెస్టర్ల స్పేర్‌పార్ట్స్ కోసం షాపులు తెరిపించి ఇప్పించాలని, స్థానికంగా లభించకపోతే హైదరాబాద్‌లోని పరిశ్రమలు, డీలర్లను సంప్రదించేందుకు సీఎస్‌కు ఫోన్ చేసి చెప్పండి.

### బిహార్ నుంచి హమాలీలను ..

రైస్ మిల్లుల్లో పనిచేసే హమాలీల్లో 95 శాతం బిహార్‌వాళ్లే. హోలీ పండుగకు బిహార్ వెళ్లిన వారు అక్కడే ఉన్నరు. పౌరసరఫరాల శాఖ ధాన్యం సేకరించి కస్టమైజ్డ్ మిల్లింగ్ కోసం మిల్లులకు పంపిస్తది. ఆ మిల్లుల నుంచి బియ్యం ఎఫ్‌సీఐ గోదాములకు వెళ్లాలి. ఈ పనిచేసేటోళ్లు బిహార్ హమాలీలు. వారిని రప్పిస్తున్నాం. అవసరమైతే ప్రత్యేక ట్రైన్స్ పెట్టించి వారిని రప్పిస్తం.

### నేడు రైస్ మిల్లర్లతో సమావేశం..

రైస్ మిల్లర్లు, వ్యాపారస్తులు కొంటామంటే వారిని గ్రామాలకు రానీయాలి. వారు కచ్చితంగా కనీస మద్దతు ధర చెల్లించాలి. సోమవారం ఉదయం 11.30 రైస్ మిల్లర్స్ అసోసియేషన్‌కి చెందిన ఆరుగురు ప్రతినిధులతో సమావేశమై చర్చిస్తా.

### కంచెలు తొలగించాలి

గ్రామాలకు బయటి వారు రాకుండా ముళ్ల కంచెలు, రాళ్ల గోడవు పెట్టారు. కరోనా వరకు మంచిదే. రైతులు వడ్లు అమ్ముకోవాలి. హమాలీ వాళ్లు రావాలి. కూపన్లు ఇచ్చే అధికారి రావాలి. వారిని అనుమతించే విషయంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, రైతు సమితి సభ్యులు సమన్వయం చేసుకోవాలి. వారి కోసం కంచెలను తొలగించాలి. తెల్లకార్డుదారులకు ఒకట్రెండు రోజుల్లో బియ్యం, రూ. 1,500 పంపిణీ ప్రారంభమవుతుంది. బియ్యం వాహనాన్ని గ్రామాల్లో రానివ్వాలి. మీ ఊర్లకు నిత్యవసర సరులకు రానీయండి. గంగాళం, శానిటైజర్, సబ్బులు పెట్టి వచ్చిపోయే వారు కాళ్లు చేతులు కడుక్కోవాలనే నిబంధన పెట్టండి. రోడ్లు మూసేయొద్దు.

### ధాన్యం, మక్కల కొనుగోళ్లకు రూ. 30 వేల కోట్లు..

ధాన్యం కొనడానికి ప్రభుత్వం వద్ద డబ్బులు లేవు. ప్రభుత్వ రెవెన్యూ పడిపోయింది. ఇంత కఠిన పరిస్థితిలో కూడా ధాన్యం సేకరణ కోసం సివిల్ సప్‌లైస్ కార్పొరేషన్‌కు రూ. 25 వేల కోట్లు సమీకరించినం. కార్పొరేషన్‌కు ఇంత పెద్ద మొత్తంలో డబ్బులు సమీకరించడం చరిత్రలో ఇదే తొలిసారి. ఉమ్మడి ఏపీలోనూ ఇన్ని డబ్బులు ఎన్నడూ ఇవ్వలేదు. మక్కల కొనుగోళ్ల కోసం మార్క్‌ఫెడ్‌కు రూ. 3,200 కోట్లు కలిపి రైతుల కోసం సుమారు రూ. 30 వేల కోట్లను ప్రభుత్వం సమీకరించింది. ఏ రాష్ట్రంలోనూ ఇన్ని ఏర్పాట్లు లేవు. ప్రతి గింజా కొంటామనిది డైలాగ్ కాదు. ప్రతి కిలో వరి, మక్కలను కొంటామని సీఎంగా చెబుతున్న. ఒక కోటీ 5 లక్షల టన్నుల వరి వచ్చే అవకాశముంది. ఒక్క కేజీ మిగలకుండా ప్రభుత్వమే కొంటది. ఆన్‌లైన్‌లో డబ్బులు వేస్తది. రైతులకు ఆందోళన వద్దు. 2, 3 రోజుల్లో జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులు సమన్వయం చేసుకుని కూపన్లు ఇస్తరు. రైతులు వచ్చేటప్పుడు ఖాతా నంబర్, పాస్‌బుక్ తీసుకుని రావాలి.

# ..కోలుకున్నా..

▶ మొదటి పేజీ తరువాయి

మీ అనుభవాలు వినాలనుకుంటున్నాను.

**రామ్‌తేజ:** నేను ఐటీ రంగంలో పని చేసే ఉద్యోగిని. పనిలో భాగంగా మీటింగ్స్ కోసం దుబాయ్ వెళ్లాల్సి వచ్చింది. అక్కడ అనుకోకుండానే అలా జరిగిపోయింది. తిరిగి రాగానే జ్వరం లాంటివి మొదలయ్యాయి సార్. ఆ తర్వాత ఐదారు రోజులకు డాక్టర్లు కరోనా వైరస్ పరీక్షలు జరిపారు. అప్పుడు పాజిటివ్ వచ్చింది. వెంటనే హైదరాబాద్‌లోని గాంధీ ప్రభుత్వ ఆస్పత్రిలో నన్ను చేర్చారు. ఆ తర్వాత 14 రోజులకు నాకు నయమైంది. నన్ను డిశ్చార్జి చేశారు. నిజంగా అదంతా తలుచుకుంటే భయంకరంగా ఉంటుంది.

**మోదీ:** మీకు కరోనా వైరస్ సోకిందన్న విషయం తెలిసిందన్నమాట.

**రామ్‌తేజ:** అవును సార్.

**మోదీ:** మీకు ఈ వైరస్ ఎంతో భయంకరమైనదన్న విషయం ముందే తెలుసు కదా.

**రామ్‌తేజ:** తెలుసు సార్.

**మోదీ:** అయితే వైరస్ సోకిన విషయం తెలియగానే ఏమనిపించింది?

**రామ్‌తేజ:** ఒక్కసారిగా భయం వేసింది. ముందయితే నేను నమ్మలేకపోయా. అలా ఎలా జరిగిందో అర్థం కాలేదు. ఎందుకంటే అప్పుడు మన దేశంలో కేవలం ఇద్దరు, ముగ్గురికే ఈ వ్యాధి సోకింది. నాకేమీ అర్థం కాలేదు. ఆస్పత్రిలో చేరిన తర్వాత నన్ను క్వారంటైన్‌లో ఉంచారు. రెండు, మూడు రోజులు అలాగే గడిచిపోయాయి. అక్కడ ఉన్న డాక్టర్లు.. నర్సులు...

**మోదీ:** ఆ ఇంకా...

**రామ్‌తేజ:** వాళ్లు ఎంతో మంచివాళ్లు. ప్రతిరోజూ నాకు ఫోన్ చేసి మాట్లాడేవాళ్లు. నాలో ఆత్మవిశ్వాసాన్ని పెంచేవాళ్లు. నాకు ఏమీ కాదన్న నమ్మకాన్ని కలిగించే వాళ్లు. నేను తొందరగా కోలుకుంటానంటూ ధైర్యం చెప్పేవారు. పగలు ఇద్దరు, ముగ్గురు డాక్టర్లు మాట్లాడేవాళ్లు. నర్సులు కూడా మాట్లాడేవాళ్లు. మొదట్లో భయం వేసింది. కానీ క్రమంగా ఇంత మంది మంచివాళ్ల మధ్య ఉన్న నాకేమీ కాదన్న నమ్మకం కుదిరింది. ఏం చేయాలో వాళ్లకు తెలుసు. తప్పనిసరిగా నాకు మెరుగవుతుందన్న విశ్వాసం పెరిగింది.

**మోదీ:** మీ కుటుంబ సభ్యుల మానసిక స్థితి ఎలా ఉండేది?

**రామ్‌తేజ:** నేను ఆస్పత్రిలో చేరిన మొదట్లో వాళ్లు ఎంతో ఆందోళనకు గురయ్యారు. ఇక్కడ మీడియా కూడా కొంత సమస్యాత్మకంగా మారింది. ఆ తర్వాత మా కుటుంబ సభ్యులకు కూడా పరీక్షలు చేశారు. నెగటివ్ వచ్చింది. నాకూ, నా కుటుంబ సభ్యులకూ, చుట్టుపక్కల వారికి కూడా అది ఎంతో ఊరటనిచ్చింది. ఆ తర్వాత రోజురోజుకూ నా పరిస్థితిలో మెరుగుదల కన్పించింది. డాక్టర్లు మాతో మాట్లాడేవారు. కుటుంబ సభ్యులకు కూడా అన్ని విషయాలు చెప్పేవారు. వారు ఏయే జాగ్రత్తలు తీసుకుంటున్నారో, ఏవిధంగా చికిత్స చేస్తున్నారో అన్ని విషయాలు కుటుంబ సభ్యులకు చెప్పేవారు.

**మోదీ:** మీరు స్వయంగా ఎటువంటి జాగ్రత్తలు తీసుకునేవారు? మీ కుటుంబ సభ్యులు ఏయే జాగ్రత్తలు తీసుకునేవారు?

**రామ్‌తేజ:** నేను క్వారంటైన్‌లోకి వెళ్లిన తర్వాతే ఈ విషయం తెలిసింది. అయితే క్వారంటైన్ తర్వాత కూడా మరో 14 రోజులు పడుతుందని డాక్టర్లు చెప్పారు. ఆ 14 రోజులు ఇంటి దగ్గరే ఒక గదిలో ఉండాలని చెప్పారు. ఇంట్లో తమకు తాముగా క్వారంటైన్‌లో ఉండాలని మా కుటుంబ సభ్యులకు చెప్పారు. నేను ఆస్పత్రి నుంచి వచ్చిన తర్వాత కూడా ఇంట్లోనే ఒక గదిలో ఉండేవాడిని. దాదాపుగా రోజంతా మాస్క్ తగిలించుకొనే వాడిని. తినడానికి గదిలోంచి బయటకు వచ్చే ముందు చేతులను శుభ్రంగా కడుక్కునేవాడిని. ఇది ఎంతో ముఖ్యం.

**మోదీ:** సరే రామ్.. మీరు పుంజుకొని బయటకు వచ్చారు. మీకు, మీ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు.

**రామ్‌తేజ:** ధన్యవాదాలు సార్.

**మోదీ** : మీరు ఐటీ ప్రొఫెషన్‌లో ఉన్నారు కదా... మీ అనుభవంపై ఆడియో తయారు చేసి...

**రామ్‌తేజ:** ఆ సార్...

**మోదీ:** ఇతరులతో పంచుకోండి. ప్రజలతో పంచుకోండి. దీనిని సామాజిక మాధ్యమంలో వైరల్ చేయండి. ఈ విధంగా చేస్తే ప్రజలు భయాందోళనలకు గురికాకుండా ఉంటారు. ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలో కూడా తెలుస్తుంది. ఈ ప్రాణాంతక వ్యాధి నుంచి దూరంగా ఉండటానికి తమను తాము కాపాడుకోవడానికి ప్రయత్నిస్తారు.

రామ్‌తేజ: అవును సార్. బయటకు వచ్చాక చూస్తున్నాను. క్వారంటైన్ అంటే తమను తాము జైలులో ఉన్నట్లుగా భావిస్తున్నారు. ఇది నిజంగా అలాంటిది కాదు. అందరూ అర్థం చేసుకోవాలి. ప్రభుత్వం చెబుతున్న క్వారంటైన్ కేవలం వారికే కాదు, వారి కుటుంబ సభ్యులకు కూడా మంచిది. అందుకే ఎంతో మందికి ఈ విషయాలను చెప్పాలనుకుంటున్నాను. పరీక్షలు చేయించుకోండి. క్వారంటైన్ అంటే భయపడకండి. క్వారంటైన్ అంటే అదేదో మచ్చ లాంటిది అనుకోకండి.

**మోదీ:** మంచిది రామ్. మీకు ఎన్నెన్నో శుభాకాంక్షలు.

**రామ్‌తేజ:** ధన్యవాదాలు.. ధన్యవాదాలు. సార్ ఇంకో విషయం చెప్పాలనుకుంటున్నా.

**మోదీ:** ఆ చెప్పండి... చెప్పండి.

**రామ్‌తేజ:** నాకు చాలా సంతోషంగా ఉంది సార్. మీరు తీసుకున్న చర్యలు ప్రపంచంలో ఏ దేశం కూడా తమ పౌరుల కోసం తీసుకోలేదు. అంతేకాదు.. మీ కారణంగా మేమందరం కూడా క్షేమంగా బయటపడగలమని ఆశిస్తున్నా.

**మోదీ:** ఈ వైపరీత్యం నుంచి దేశం బయటపడాలి. ఇది ఎంతో భయానకమైన పరిస్థితి. ఎప్పుడు ఏమవుతుందో తెలియని స్థితి.

**రామ్‌తేజ:** ఏమీ కాదు సార్. మొదట్లో నాకు భయం వేసింది. మీరు లాక్‌డౌన్ లాంటి చర్యలు తీసుకున్నప్పుడు నాలో నమ్మకం పెరుగుతోంది. మనందరం మీ సహాయంతో బయటపడతాం సార్. ధన్యవాదాలు.

**మోదీ:** ధన్యవాదాలు సోదరా... కృతజ్ఞతలు.

**రామ్‌తేజ:** ధన్యవాదాలు సార్.

ఆ తర్వాత ప్రధాని మోదీ మాట్లాడుతూ దేశవాసులారా... రామ్‌తేజ చెప్పినట్లు ఆయనకు కరోనా సోకిన విషయం తెలిసిన తర్వాత డాక్టర్లు ఇచ్చిన ఆదేశాలను తూ.చ. తప్పకుండా పాటించారు. ఆ కారణంగానే ఆయన ఆరోగ్యవంతుడై మళ్లీ సాధారణ జీవితాన్ని గడపగలుగుతున్నారు' అని పేర్కొన్నారు. అనంతరం ఆగ్రాకు చెందిన అశోక్ కపూర్, వైద్య నిపుణుడు, ఢిల్లీకి చెందిన డాక్టర్ నీతేశ్ గుప్తా, పుణేలోని డాక్టర్ బోర్సేలతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా వైద్య నిపుణులకు ధన్యవాదాలు తెలిపారు. నిత్యావసర సేవలు అందిస్తున్న రవాణా, బ్యాంకింగ్ వంటి రంగాల సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

### గాంధీలో వైద్య సేవలు బాగున్నాయి

గాంధీ ఆస్పత్రిలోని కరోనా ఐసోలేషన్ వార్డులో చికిత్స పొందుతున్న మరో వ్యక్తి తన అనుభవాలను సామాజిక మాధ్యమాల ద్వారా పంచుకున్నాడు. తాను యుకే నుంచి వచ్చానని, కరోనా లక్షణాలు కనిపించడంతో 104కి కాల్ చేసి గాంధీ ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యానని చెప్పాడు. నిర్ధారణ పరీక్షల్లో పాజిటివ్ రావడంతో ఐసోలేషన్ వార్డులో చేరి ఆదివారం నాటికి 13 రోజులు అయిందని పేర్కొన్నాడు. గాంధీ ఆస్పత్రి ఐసోలేషన్ వార్డులో వైద్యసేవలు, వసతి సౌకర్యాలు చాలా బాగున్నాయని, వైద్యులు చాలా కేర్ తీసుకుంటున్నారని వివరించాడు.

*– వీడియో సందేశంలో మరో కరోనా బాధితుడు*

## సూర్యాపేట జిల్లాలో మళ్లీ భూకంపం

**చింతలపాలెం (హుజూర్‌నగర్):** సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలోని పలు గ్రామాల్లో మళ్లీ భూ కంపం వచ్చింది. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాతనుంచి ఆదివారం తెల్లవారు జాము వరకు ఐదు సార్లు భూమి కంపించింది. అర్ధరాత్రి దాటిన తర్వాత రావడంతో గాఢనిద్రలో ఉన్న ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడి లేచారు. భూ ప్రకంపనలపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. తహసీల్దార్ కమలాకర్ మాట్లాడుతూ చింతలపాలెం మండలంలో ఐదు సార్లు భూమి కంపించిందని ఇందులో కొన్ని ప్రకంపనల తీవ్రత రిక్టర్‌స్కేల్‌పై 2.7 నమోదయ్యాయని తెలిపారు.

## లాక్‌డౌన్‌కు నై..

▶ మొదటి పేజీ తరువాయి

ఉంటారేమోనన్న కనీస అనుమానం, దాని నుంచి ఉత్పన్నమయ్యే భయం ఎవరిలోనూ కనిపించలేదు. సాధారణ ఆదివారాల్లో కనిపించే రద్దీ కంటే ఈ ఆదివారం జనం దూకుడు ఎక్కువ ఉండటం ఆశ్చర్యపరిచింది. అధికారులు, పోలీసులు ప్రేక్షకపాత్రకే పరిమితమయ్యారు. 'నిత్యావసర వస్తువుల కొనుగోలుకు ప్రభుత్వమే అనుమతించినందున మేమెలా నియంత్రించగలం?''అని ఓ పోలీసు అధికారి పేర్కొన్నారు. మనుషుల మధ్య మీటరు దూరం ఉండేలా మార్కింగ్ చేసినా జనం దాన్ని 'చెరిపేశారు'. రాష్ట్రం మొత్తం ఇవే దృశ్యాలు కనిపించాయి. చికెన్, మటన్, చేపలు అమ్మేందుకు కొత్త దుకాణాలు కూడా వెలియడం విశేషం.

### ఆసుపత్రి పేరుతో రోడ్లపైకి..

లాక్‌డౌన్ సందర్భంగా ఒకరిళ్లకు ఒకరు వెళ్లటం తగ్గింది. ఆదివారం ఆ లోటునూ పూడ్చేసుకున్నారు. పోలీసులు అడ్డుకోకుండా ఆసుపత్రి పాత రిపోర్టులు, మందులు పట్టుకుని రోడ్డెక్కారు. ఎక్కడైనా పోలీసులు ఆపితే ఆసుపత్రులకు వెళ్తున్నామనో, మందులు కొనుక్కుని ఇళ్లకు వెళ్తున్నామనో చెప్పి షికార్లు కొట్టారు. ద్విచక్ర వాహనాలపై ఒక్కరే వెళ్లాలన్న నిబంధన అమలు కాలేదు. లాక్‌డౌన్‌లో వెసులుబాటు సమయాన్ని ప్రజలు దుర్వినియోగం చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఆంక్షలను కఠినతరం చేయాలని భావిస్తోంది.

# ప్రజా సైనికులకు వందనం

▶ మొదటి పేజీ తరువాయి

ఖమ్మం ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, పిల్లలు వద్దంటున్నా డ్యూటీకి వెళ్తున్న నర్సు సులోచన... ఇలా చెప్పుకుంటూ పోతే రాష్ట్రంలో ప్రస్తుతం అత్యవసర సేవల కింద విధులు నిర్వహిస్తున్న లక్షలాది మంది ప్రజాసైనికులది ఇదే పరిస్థితి.

దేశం, రాష్ట్రం ఎదుర్కొంటున్న గడ్డు పరిస్థితులను దీటుగా ఎదుర్కొని ఊపిరి బిగబట్టయినా తన విధులు నిర్వహించి ప్రజలకు ఎలాంటి కష్టం రాకుండా కరోనా మహమ్మారిని పారదోలేందుకు కృషి చేస్తున్న అందరిదీ ఇదే వ్యథ... కాదు... ఇదే కష్టం. తమకు ఎదురయ్యే కష్టాలను దిగమింగుకుంటూ 4 కోట్ల మంది తెలంగాణ ప్రజలను కాపాడేందుకు అహర్నిశలు శ్రమిస్తున్న వారి వీర గాథ ఇది. సాధారణ పరిస్థితుల్లో సమాజం చిన్నచూపు చూసే కార్మికుల ఆసరా, వైద్యో నారాయణో హరి అని చెప్పుకొనే వైద్యుల భరోసా, కనిపించని నాలుగో సింహమేరా ఈ పోలీస్ అని గర్వపడే మన పోలీసు సిబ్బంది రక్షణ.. ఇలా చెప్పుకుంటూ పోతే మున్సిపల్, గ్రామ పంచాయతీ, విద్యుత్, ఫార్మా, గ్యాస్ ఏజెన్సీ, పెట్రోల్ బంకుల సిబ్బంది, రైతులు, బ్యాంకు సిబ్బంది... ఈ ప్రజాసైనికుల కష్టమే ఇప్పుడు మనల్ని కరోనా కష్టాల కడలి నుంచి తీరాన్ని చేర్చే ప్రయత్నం చేస్తోంది. డ్యూటీకి వెళ్లి ఇంటికి వచ్చేంత వరకు వారి కుటుంబ సభ్యుల్లో ఉత్కంఠ, ఆందోళన నెలకొన్నా దాన్ని ఈ సైనికులు ఖాతరు చేయడం లేదు. కష్టకాలంలో తమ వారిని ఇబ్బంది పెట్టయినా సరే సమాజం కోసం పనిచేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనలకు అనుగుణంగా కరోనా కర్కశ రక్కసిపై కఠోర యుద్ధం చేస్తున్నారు. అందుకే విపత్కాలంలో సమాజానికి అండగా నిలుస్తున్న మానవ రూపంలోని దేవుళ్లందరికీ 'సాక్షి'సెల్యూట్ చేస్తోంది.



## మేం లేకపోతే వంట ఎలా?

కరోనా వస్తుందని మేం భయపడి ఇళ్లలో కూర్చుంటే అందరి ఇళ్లలో పొయ్యిలు ఎలా వెలుగుతాయి? గ్యాస్ లేకపోతే ఈ రోజుల్లో ఒక్క క్షణం కూడా గడవదు. మామూలు రోజుల్లోనే గ్యాస్ రావడం ఆలస్యమైతే 100 సార్లు ఫోన్లు చేస్తారు. మరి ఇలాంటి పరిస్థితుల్లో మేం లేకపోతే ఎలా? నిత్యం ప్రమాదం పొంచి ఉన్నా గ్యాస్ సిలిండర్లను మోసుకొని వెళ్లే మమ్మల్ని కరోనా ఏం చేస్తుంది? గ్యాస్ పేలిన దానికన్నా ప్రమాదం కాదు కదా. అందుకే మా కుటుంబ సభ్యులు వద్దన్నా ధైర్యంగా విధులకు వెళుతున్నాం... వెళ్తాం కూడా.

– కె. రామలింగయ్య,
శ్రీసాయిదుర్గా గ్యాస్ ఏజెన్సీ,
నల్లగొండ

## ఐ లవ్ మై డాడీ...

గతంలో డాడీ రోజుకు 2-3 సార్లు ఇంటికి వచ్చేవారు. కానీ కరోనా కారణంగా డాడీ ఇంటికి సరిగ్గా రావట్లేదు. నాతో టైమ్ స్పెండ్ చేయట్లేదు. నేను నిద్రపోయాక వస్తున్నాడు. లేచేలోగా మళ్లీ డ్యూటీకి వెళ్లిపోతున్నాడు. ముఖానికి మాస్కుతోనే వీడియో కాల్ చేస్తున్నాడు. ఒక్కోసారి అసలు నా ఫోన్ కూడా తీయడం లేదు. డాడీని చాలా మిస్సవుతున్నా. కరోనా రాకుండా చేతులకు శానిటైజర్ వాడాలని మా టీచర్ చెప్పింది.. అదే విషయాన్ని డాడీకి కూడా చెబుతున్నా. మా డాడీ గ్రేట్. జనాలకు కరోనా రాకుండా చేసేందుకు రోజంతా వారి కోసమే డ్యూటీ చేస్తున్నాడు.

ఐ లవ్ మై డాడీ. బట్ ఐ మిస్ యూ డాడీ.. టేక్ కేర్.

– అన్వి విశ్వేశ్వర్, వరంగల్ కమిషనరేట్
ఇన్‌స్పెక్టర్ కుమార్తె



## అంకితభావంతో పనిచేస్తున్నాం



ప్రతి ఒక్కరి సహకారంతో, అంకితభావంతో కరోనా రోగులకు వైద్యం అందిస్తున్నాం. వ్యాధిపట్ల అవగాహన కల్పిస్తూనే వైరస్ సోకకుండా తీసుకోవాల్సిన అంశాలను వివరిస్తున్నాం. కరోనా అనుమానితులు ఆందోళన చెందకుండా వారికి మనోధైర్యం కల్పిస్తున్నాం. సహచర వైద్య సిబ్బంది సహకారం మరువలేనిది. మా కుటుంబ సభ్యులు కూడా ఆందోళన చెందుతున్నా సేవ చేయడమే వృత్తి ధర్మంగా మమ్మల్ని ప్రోత్సహిస్తున్నారు. వారికి నిజంగా రుణపడి ఉంటాం. వైద్య సిబ్బంది సేవలను అందరూ గుర్తించాలి.

– బి. వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్,
ఖమ్మం జిల్లా ఆసుపత్రి

కరోనా రక్కసి నుంచి మనల్ని కాపాడేందుకు వైద్య, పోలీసు, మున్సిపల్, గ్రామ పంచాయతీ, విద్యుత్, ఫార్మా, గ్యాస్ ఏజెన్సీ, పెట్రోల్ బంకుల సిబ్బంది, కూరగాయల రైతులు, బ్యాంకు సిబ్బంది కీలకంగా వ్యవహరిస్తున్నారు. దైనందిన జీవితంలో మనకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పనిచేస్తున్నారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, ఇతర మున్సిపల్, అంగన్‌వాడీ సిబ్బంది కూడా తమ వంతు పాత్ర పోషిస్తున్నారు. వారిలో వైద్య సిబ్బందే 50 వేల వరకు ఉన్నారు. అధికారిక లెక్కల ప్రకారం రాష్ట్రంలోని 2,556 మంది ప్రభుత్వ వైద్యులు (ఎంబీబీఎస్), 3,796 మంది స్పెషలిస్టులు, 10,900 మంది స్టాఫ్ నర్సులు, 11,886 మంది పారామెడికల్ సిబ్బందితో

## ప్రజా సైనికులు వీరే...

కలిపి 49,709 మంది వైద్య సిబ్బంది పనిచేస్తున్నారు. వారితోపాటు డీజీపీ నుంచి హోంగార్డు వరకు 53 వేల మంది పోలీసు సిబ్బంది 24 గంటలూ రోడ్లపైనే ఉంటున్నారు. 12,751 గ్రామ పంచాయతీలు, 140 వరకు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో దాదాపు 70 వేల మంది పారిశుద్ధ్య కార్మికులు, 30 వేల మంది పెట్రోలు బంక్ సిబ్బంది, 10 వేల మంది వరకు వంట గ్యాస్ డెలివరీ బాయ్స్, వేలాది మంది ఫార్మసిస్టులు, కూరగాయల రైతులు, బ్యాంకు సిబ్బంది, విద్యుత్, మీడియా రంగంలో పనిచేస్తున్న వారు ఇప్పుడు కరోనా నివారణ మహా క్రతువులో పాలుపంచుకుంటున్నారు. వాళ్లందరి సహకారం, ప్రజల నిబద్ధత, చిత్తశుద్ధితో కరోనా భూతంపై తెలంగాణ అప్రతిహత విజయాన్ని సాధించాలని ఆశిద్దాం.

**చివరిగా వారందరి పక్షాన మూడు మాటలు....**

**ఈ నెల 14 వరకు ఇళ్లు వదిలి అనవసరంగా బయటకు రాకండి..**
**20 నిమిషాలకోసారి చేతులు కడుక్కోండి..**
**సామాజిక దూరాన్ని పాటించండి.**



## శానిటైజేషన్ తర్వాతే పెట్రోల్ పోస్తున్నాం..



మాది హన్మకొండ మండలంలోని భట్టుపల్లి గ్రామం. గత కొన్నేళ్లుగా పెట్రోల్ బంకులో పనిచేస్తున్నా. కరోనా వ్యాప్తి గురించి తెలిసి గత 15 రోజులుగా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. వైరస్ ప్రభావం ఎంతగా ఉందో టీవీలు, పత్రికల ద్వారా తెలుసుకుంటున్నాం. మా యాజమాన్యం సైతం మమ్మల్ని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తోంది. ప్రతి ఒక్కరికీ శానిటైజర్ బాటిల్‌తో పాటు మాస్కులు ఇచ్చింది. వాహనానికి పెట్రోల్ పోసే ప్రతిసారీ చేతులను శానిటైజర్‌తో శుభ్రం చేసుకుంటున్నాం. ఆ తర్వాతే పెట్రోల్ పోస్తున్నాం. మాస్కులు ఇబ్బందిగా ఉన్నప్పుడు చేతి రుమాలు కట్టుకుంటున్నాం. వాహనదారుడికి వీలైనంత దూరంగా ఉంటున్నాం.

– సురేష్,
పబ్లిక్ గార్డెన్ పెట్రోల్ పంపు,
హన్మకొండ

## ప్రజల కోసం పనిచేస్తున్నాం...



కరోనా మహమ్మారి అందరినీ ఉక్కిరిబిక్కిరి చేస్తుండంతో బిక్కుబిక్కుమంటూ శానిటేషన్ పనులు చేస్తున్నా. నాకు భార్య, కుమార్తె, కుమారుడున్నారు. విధులకు వచ్చే ముందు వాళ్ల జాగ్రత్తలు చెపుతుంటారు. జీవనాధారం ఇదే కావడంతో విధులకు హాజరవుతూ ప్రజల కోసం పనిచేస్తున్నా. పవర్‌ఫుల్‌గా ఉండే సోడియం హైపో క్లోరైడ్ ద్రావణంతో కూడిన డబ్బాను భుజానికి తగిలించుకొని పిచికారీ చేస్తుండటంతో వీపుకు బొబ్బలు వస్తున్నాయి. చెత్తా చెదారాన్ని ఎత్తిపోయడమేగాక, అంటువ్యాధులతో పనిచేస్తున్న మాకు తక్కువ జీతభత్యాలు ఇస్తుండడమే బాధనిపిస్తుంది. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో అయినా మా విలువ ఏంటో అందరికీ అర్థం అయితే అదే సంతోషం.

– ఎ. యాదయ్య, పారిశుద్ధ్య కార్మికుడు,
ఇబ్రహీంపట్నం, మున్సిపాలిటీ

## ఇబ్బందిగానే ఉంది...

మాది చివ్వెంల మండలం ఉనికి తండా. మాకున్న 10 గుంటల భూమిలో కూరగాయలు సాగు చేస్తున్నా. మార్కెట్‌కు తీసుకెళ్తే కరోనా ఉన్న కారణంగా వ్యాపారులు తక్కువ రేటుకు అడిగారు. అందుకే మేమే అమ్ముకుంటున్నాం. రావడం, పోవడం ఇబ్బందిగానే ఉంది. కరోనా భయంతోనే కాయకష్టం చేసి పండించిన పంటను భర్తతో కలిసి అమ్ముకుంటున్నా.

– రోజా, రైతు, సూర్యాపేట కొత్త బస్టాండ్



## ఫార్మసిస్టుగా నా బాధ్యత



మెడికల్ షాపులో పనిచేయడం ప్రస్తుత పరిస్థితుల్లో కత్తిమీద సామే. అవగాహన ఉన్నవారు షాపులకు మాస్కులతో వస్తున్నారు కానీ లేనివారు మాత్రం తుమ్ముతూ, దగ్గుతూ వస్తున్నారు. వారికి ఏం ఉందో లేదో కూడా తెలియని పరిస్థితి. అయినా సామాజిక దూరాన్ని పాటిస్తూనే మందులిచ్చి పంపిస్తున్నాం. పారామెడికల్ అత్యవసర సేవలు కనుక మేం పనిచేయాల్సిందే... చేస్తాం కూడా. దేశానికి సేవ చేయడం ఓ యువకుడిగా, ఫార్మసిస్టుగా నా బాధ్యత. అందరం కలసి ఈ మహమ్మారిని పారదోలే వరకు పోరాడుదాం.

– కోడి శివప్రసాద్, రిజిస్టర్డ్ ఫార్మసిస్టు, జ్యూపిటర్ ఫార్మసీ, తూప్రాన్, మెదక్ జిల్లా

# 'కరోనా' కట్టడికి.. గ్రామీణ దళాలు

సాక్షి, హైదరాబాద్

గ్రామ పంచాయతీల్లో కరోనా మహమ్మారిని ఎదుర్కొనేందుకు పంచాయతీ రాజ్‌శాఖ పకడ్బందీ చర్యలు తీసుకుంది. ప్రతి పంచాయతీలో 'కరోనా నిరోధక దళం'పేరిట సైన్యాన్ని ఏర్పాటు చేస్తోంది. ఈ సైన్యం పల్లెలో కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా ప్రజలను చైతన్యపరచనుంది. గ్రామ సర్పంచ్ సారథ్యం వహించే ఈ దళం సభ్యులుగా ప్రతి వార్డు నుంచి సేవాభావం కలిగిన యువకులను ఎంపిక చేస్తారు. ఎంపీటీసీ, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, కో–ఆప్షన్ సభ్యులు, సింగిల్ విండో డైరెక్టర్లు, ఇతర ప్రజాప్రతినిధులు సభ్యులుగా ఉంటారు. ఉదయం, మధ్యాహ్నం, రాత్రి వేళల్లో షిఫ్టులవారీగా ఈ బృందాలు బాధ్యతలు నిర్వర్తించనున్నాయి. కరోనా వైరస్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్రామాల్లో మైకుల ద్వారా ఎప్పటికప్పుడు తెలియజేస్తాయి. జిల్లా స్థాయిలో అత్యుత్తమ సేవలందించిన మూడు కరోనా నిరోధక దళాలకు అవార్డులు అందజేయనున్నారు.

# కొత్తగా 3,350 పడకలు

▶ మొదటి పేజీ తరువాయి

తరలించారు. కొన్ని ప్రైవేటు మెడికల్ కాలేజీలకు రెండు మూడు అనుబంధ ఆసుపత్రులున్నాయి. వాటిలో ఒక దానిలోకి రోగులను తరలించారు. కొన్ని కాలేజీలకు ఒకటి చొప్పున మాత్రమే అనుబంధ ఆసుపత్రులున్నాయి. అలాంటిచోట్ల ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న సమీప జిల్లా ఆసుపత్రులకు రోగులను తరలిస్తున్నారు. కరోనా బాధితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. కరోనా 3వ దశకు చేరుకుంటే కేసులు పెరిగే అవకాశాలున్నాయి. ముందు జాగ్రత్తగా సర్కారు వీటిని స్వాధీనం చేసుకుంది.

**ఉచితంగానే ప్రైవేట్ డాక్టర్లు, సిబ్బంది సేవలు:** ప్రైవేటు బోధనాసుపత్రుల్లోని వసతులను, డాక్టర్లను, సిబ్బందిని ప్రభుత్వం ఉచితంగానే ఉపయోగించుకోనుంది. సిబ్బంది జీతాలను ప్రైవేటు వారే ఇచ్చుకోవాలి. యాజమాన్యాలకు సర్కారు నయాపైసా చెల్లించదు. అయితే కరోనా బాధితులకు సేవచేసే వైద్యులకు, నర్సులకు, ఇతరత్రా సిబ్బందికి అవసరమైన పర్సనల్ ప్రొటెక్ట్ ఎక్విప్‌మెంట్స్, సర్జికల్ ఐటమ్స్, మాస్కులు, శానిటైజర్లు, ఇతర పరికరాలను ప్రభుత్వమే రూ.30 కోట్ల మేర వెచ్చించి ప్రైవేట్ మెడికల్ బోధనాసుపత్రులకు అందచేస్తుంది. అంతేతప్ప ఈ నిధులను ప్రైవేటు ఆసుపత్రులకు నేరుగా ఇవ్వదు. దీనివల్ల నిధులు దుర్వినియోగం కావని సర్కారు భావిస్తోంది.

**ఎంబీబీఎస్ విద్యార్థులకు సెలవులు:** మొత్తం ప్రైవేటు మెడికల్ కాలేజీలు, బోధనాసుపత్రులను ఖాళీచేసి సర్కారుకు అప్పగించడంతో వాటిల్లోని ఎంబీబీఎస్ విద్యార్థులకు సెలవులు ఇచ్చారు. ముఖ్యంగా మొదటి, రెండు, మూడో సంవత్సరం విద్యార్థులకు సెలవులు ఇచ్చారని, మిగిలిన తరగతుల, పీజీ విద్యార్థులు మాత్రం కరోనా సేవల్లో ఉంటారని వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు తెలిపాయి.

**దక్షిణమధ్య రైల్వేలో క్వారంటైన్ సదుపాయం!**

కరోనా వైరస్ బారిన పడిన వారి కోసం దక్షిణమధ్య రైల్వే సుమారు 1000 కి పైగా పడకలతో క్వారంటైన్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఒక్క హైదరాబాద్‌లోనే 350 పడకలను అందుబాటులోకి తెచ్చినట్లు అధికారులు తెలిపారు. అవసరమైతే 500 వరకు పడకలను క్వారెంటైన్‌లుగా మార్చేందుకు రైల్వేకు చెందిన పలు శిక్షణా సంస్థలను సైతం ఖాళీ చేయిస్తున్నారు. లాలాగూడలోని రైల్వే జూనియర్ కాలేజీ ఖాళీగా ఉంది. ప్రస్తుతం ఆ కళాశాలను రసాయనాలతో శుద్ధి చేశారు. గదులన్నింటినీ శానిటైజ్ చేసి 85 పడకలను ఏర్పాటు చేశారు. రైల్వే ఉద్యోగుల సభలు, పెళ్లిళ్లు, వేడుకల కోసం వినియోగించే ఫంక్షన్ హాల్ రైల్ కళా రంగ్‌ను కూడా క్వారంటైన్‌గా మార్చారు.

# ఏపీ బాటలో కేరళ

**మలయాళీ సీమలో ఏపీ తరహా వలంటీర్ల వ్యవస్థ**
**కరోనా కట్టడికి కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ నిర్ణయం**

**సాక్షి, అమరావతి:** కరోనా వైరస్ కట్టడిలో కీలక పాత్ర పోషిస్తున్న ఏపీలోని వలంటీర్ల వ్యవస్థను కేరళలోనూ ఏర్పాటు చేయాలని అక్కడి ప్రభుత్వం నిర్ణయించింది. బ్రిటన్ కూడా ఇదే తరహా వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించడం గమనార్హం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు ప్రవేశపెట్టిన విప్లవాత్మక విధాన నిర్ణయాలు జాతీయ స్థాయిలో ఆదర్శంగా నిలుస్తున్న విషయం విదితమే. ప్రభుత్వ పథకాల అమలుతోపాటు అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వానికి చేదోడు వాదోడుగా ఉండేలా ఏపీలో ఏర్పాటైన వలంటీర్ల వ్యవస్థ సత్ఫలితాలిస్తోంది. దీనిని గమనించిన కేరళ ప్రభుత్వం ఇదే విధానాన్ని అనుసరిస్తోంది.

**వలంటీర్ల నియామకానికి కేరళ నిర్ణయం**



- ఏపీలో 4 లక్షల మందికి పైగా వలంటీర్లు పింఛన్ల పంపిణీ వంటి ప్రభుత్వ పథకాలను సక్రమంగా అమలు చేస్తున్నారు. కరోనా కట్టడిలో సైతం కీలక పాత్ర పోషిస్తున్నారు.
- విదేశాల నుంచి వచ్చిన దాదాపు 30 వేల మందిని ఇంటింట సర్వే ద్వారా గుర్తించి వారందరినీ ఇళ్లలోనే ఐసోలేషన్‌లో ఉండేలా చూస్తూ క్షేత్రస్థాయిలో పరిస్థితులను ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు నివేదిస్తున్నారు.
- ఇంతటి బృహత్తర బాధ్యత నెరవేరుస్తున్న ఏపీ తరహా వలంటీర్ల వ్యవస్థను కేరళలోనూ ఏర్పాటు చేయాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ నిర్ణయించారు. అక్కడ తక్షణమే 2,36,200 మంది వలంటీర్లను నియామకానికి నోటిఫికేషన్ జారీ చేశారు.
- ఆ రాష్ట్రంలో 941 పంచాయతీలు, 87 మున్సిపాలిటీలు, 6 నగరపాలక సంస్థలు ఉన్నాయి. ప్రతి పంచాయతీకి 200 మంది, మున్సిపాలిటీకి 500 మంది, కార్పొరేషన్‌కు 750 మంది చొప్పున వలంటీర్లను నియమిస్తున్నారు.
- 22 నుంచి 40 ఏళ్ల లోపు వారు ఈ పోస్టులకు అర్హులుగా నిర్ణయించారు. అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించి.. వెంటనే శిక్షణ పూర్తిచేసి విధుల్లోకి తీసుకోనున్నారు.

## భద్రాద్రిలో బ్రహ్మోత్సవాలు



శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో వసంత పక్ష ప్రయుక్త నవాహ్నిక తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. లాక్‌డౌన్ నేపథ్యంలో ఈ కార్యక్రమాలను భక్తులు లేకుండానే నిర్వహించారు.

## మృత్యుంజయ హోమం



కొమురవెల్లి(సిద్దిపేట): కరోనా నియంత్రణ కోసం కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో గణపతి, మృత్యుంజయ, ధన్వంతరి హోమాలను నిర్వహించారు. రాష్ట్రంలోని ప్రజలు సుభిక్షంగా, ఆయురారోగ్యాలతో ఉండేందుకు హోమాలను నిర్వహించినట్లు అర్చకులు తెలిపారు.





కరోనా భూతం గురించి, ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కరీంనగర్ ఆర్టీసీ ఉద్యోగి కరుణాకర్ స్వచ్ఛందంగా అవగాహన కల్పిస్తున్నారు. ఆదివారం ఆయన భూతం వేషధారణలో పట్టణంలోని ప్రధాన రోడ్ల వెంట తిరుగుతూ సూచనలు చేశారు.
- సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

# ఢిల్లీ నుంచి ప్రబలుతున్న వైరస్

**తాజాగా నమోదైన ముగ్గురిలో ఇద్దరు అక్కడికి వెళ్లొచ్చినవారే**

**వారి ద్వారా కాంటాక్ట్ అయిన మరో వ్యక్తికి పాజిటివ్**
**దీంతో రాష్ట్రంలో మొత్తం 70కు చేరిన కరోనా కేసుల సంఖ్య**
**అందులో తాజాగా కోలుకున్న 11 మంది.. వారిలో 9 మంది ఇండోనేసియన్లు**
**ఢిల్లీ నుంచి వచ్చిన వారిపై నిఘా పెట్టిన వైద్య ఆరోగ్య శాఖ**

సాక్షి, హైదరాబాద్

ఇతర దేశాల నుంచి ఇప్పటివరకు కొందరు కరోనా వైరస్‌ను తీసుకురాగా, తాజాగా ఢిల్లీ నుంచి వస్తున్న వారి నుంచి కరోనా వ్యాపిస్తోందని గుర్తించారు. ఆదివారం మూడు కరోనా పాజిటివ్ కేసులు నమోదు కాగా, వారిలో ఇద్దరు ఇటీవల ఢిల్లీ వెళ్లొచ్చారు. వారికి సంబంధించిన మరో వ్యక్తికి కూడా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. మొత్తంగా రాష్ట్రంలో ఇప్పటివరకు 70 మందికి కరోనా పాజిటివ్ నిర్ధారణ అయింది. ప్రార్థనల కోసం ఇటీవల ఢిల్లీకి తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు 5 వేల మంది వెళ్లొచ్చినట్లు అంచనా వేశారు. వారిలో ఇప్పటివరకు తెలంగాణకు సుమారు ఆరుగురు కరోనా మోసుకురాగా, అందులో ఒకరు చనిపోయిన సంగతి తెలిసిందే. మరోవైపు పాజిటివ్‌గా నిర్ధారించిన 70 మందిలో మొట్టమొదట కరోనా సోకిన వ్యక్తికి గతంలోనే నయం కాగా, తాజాగా 11 మందికి కూడా నెగెటివ్ వచ్చినట్లు సర్కారు ప్రకటించింది. వారిని సోమవారం ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేస్తారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా ప్రకటించగా, ఐటీ మంత్రి కేటీఆర్ కూడా తన ట్విట్టర్ ద్వారా ఈ విషయాన్ని వెల్లడించారు. కరోనా వైద్య నిర్ధారణ పరీక్షల్లో వారందరికీ నెగెటివ్ వచ్చిందనీ, ఇది ఎంతో సంతోషకరమైన విషయమని కేటీఆర్ పేర్కొన్నారు. నెగెటివ్ వచ్చిన 11 మందిలో ఇండోనేసియాకు చెందిన 9 మంది బృందం, వారికి తోడుగా వచ్చిన మరో ఇద్దరు యూపీ, ఢిల్లీకి చెందినవారున్నారని వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు తెలిపాయి. వీరందరినీ సోమవారం డిశ్చార్జి చేస్తారు. వీరుగాక మరో 58 మందికి ఆసుపత్రిలో చికిత్స అందజేస్తారు. వారికి నయం అయ్యాక విడతల వారీగా డిశ్చార్జి చేస్తారు.

**ఢిల్లీ నుంచి వచ్చిన వారిపై నిఘా...**

రాష్ట్రంలో కరోనా కేసుల సంఖ్య పెరుగుతోన్న దృష్ట్యా నిఘా వర్గాలు డేగ కన్నేశాయి. క్వారంటైన్‌లో ఉన్న వారి పరిస్థితిని రోజువారీ అంచనా వేస్తూనే, మరోవైపు ఢిల్లీ నుంచి వచ్చిన వారిపైనా వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. అసలు ఢిల్లీ నుంచి వచ్చిన వారికి కరోనా పాజిటివ్ రావడానికి ప్రధాన కారణమేంటో అధ్యయనం చేస్తున్నాయి. ఎవరి ద్వారా వైరస్ వచ్చిందనేది అంతుబట్టడంలేదు. ఢిల్లీలో ఒక ప్రార్థనా మందిరానికి ప్రతి ఏటా తెలుగు రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో వెళ్తుంటారు. అక్కడికి తీసుకెళ్లేందుకు కొందరు ఏజెంట్లు కూడా పనిజేస్తున్నారు. ఇటీవల రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ఆ ప్రార్థనా మందిరానికి వెళ్లినట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. ఇప్పటికే అక్కడికి వెళ్లొచ్చిన వారిలో కొందరికి పాజిటివ్ రాగా, వారి కుటుంబ సభ్యులు ఎక్కడెక్కడికి వెళ్లారు.. ఎంతమందిని కలిశారన్న దానిపై కొంత సమాచారం సేకరించారని తెలిసింది. వందల సంఖ్యలో వారితో కాంటాక్టు అయినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు తెలిసింది. అంతేకాకుండా ఢిల్లీకి తీసుకెళ్లిన ఏజెంట్‌ను కూడా ఇప్పటికే పోలీసులు అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది. అతని నుంచి మరింత సమాచారాన్ని రాబడుతున్నట్లు సమాచారం. అక్కడికి వెళ్లొచ్చిన ఒక వ్యక్తి కుటుంబంలో ఇప్పటికే ముగ్గురికి కరోనా పాజిటివ్ నిర్ధారణ అయిన సంగతి తెలిసిందే.

# కల్లుకు బానిసై నలుగురు మృతి

**సాక్షి, నెట్‌వర్క్:** లాక్‌డౌన్ నేపథ్యంలో మద్యం, కల్లు విక్రయాలు నిలిచిపోవడంతో వాటికి బానిసైన నలుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో రాజు (40) కల్లు కోసం వెళ్లి అది దొరక్క శనివారం రాత్రి ఫిట్స్‌తో మృతిచెందాడు. ఇంద్రేశం గ్రామానికి చెందిన లక్ష్మయ్య(65) వారం నుంచి మద్యం తాగక పిచ్చిగా ప్రవర్తిస్తూ శనివారం ఫిట్స్‌తో మృతిచెందాడు. పటాన్‌చెరులోనే మొగలయ్య (38) అనే వ్యక్తి వారం రోజులుగా కల్లు దొరక్క ట్రాన్స్‌ఫార్మర్ పట్టుకొని శనివారం రాత్రి మృతి చెందాడు. మెదక్ జిల్లా రామాయంపేట మండలంలోని బచ్చురాజ్‌పల్లి గ్రామానికి చెందిన కళ్ల కిష్టయ్య(40) కల్లు దొరకక చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. నిజామాబాద్ జిల్లా బోధన్‌లో సయ్యద్ ఎజాజ్ కల్లు దొరక్క బ్లేడ్‌తో కడుపుపై కోసుకున్నాడు. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

సాక్షి
సాహిత్యం



నల్లగొండ | సోమవారం
మార్చి | 30 | 2020
sakshisahityam@gmail.com

## గ్రహం అనుగ్రహం

శ్రీశార్వరినామ సంవత్సరం. ఉత్తరాయణం, వసంత ఋతువు. చైత్ర మాసం. తిథి శు.షష్ఠి రా.10.34 వరకు. తదుపరి సప్తమి. నక్షత్రం రోహిణి ప.1.26 వరకు, తదుపరి మృగశిర. వర్జ్యం రా.7.15 నుంచి 8.54 వరకు. దుర్ముహూర్తం ప.12.26 నుంచి 1.15 వరకు, తదుపరి ప.2.54 నుంచి 3.44 వరకు. అమృత ఘడియలు ఉ.10.03 నుంచి 11.55 వరకు

**సూర్యోదయం:** 6.00 **సూర్యాస్తమయం:** 6.08 ;
**రాహుకాలం :** ఉ.7.30 నుంచి 9.00 వరకు.
**యమగండం :** ఉ.10.30 నుంచి 12.00 వరకు

# ఇదేమీ ప్రపంచానికి అంతం కాదు

● ప్రత్యేక వ్యాసం



లాక్‌డౌన్ నేపథ్యంలో ఇటలీ రాజధాని రోమ్‌లో నిర్మానుష్యంగా ఉన్న ఒక ప్రధాన వీధి.

■ **ప్రతి చర్యా, ఏమాత్రం ప్రత్యేకత లేనిది కూడా ఒక కొత్త విలువను సంతరించుకుంది. నాకు తెలుసు, ఈ త్యాగం అవసరమేననీ, వివిధ స్థాయిల్లో ఇది మంచికే దారితీస్తుందనీ. కాకపోతే ఇప్పుడున్న పరిస్థితి అంతా దాటిపోయాక, మనం ప్రాథమికంగా దుర్బలులమనీ మన చర్యలకు పర్యవసానాలుంటాయనీ మనం మరచిపోనప్పుడు మాత్రమే.**

''మీకు వీలైతే ఇంట్లోనే ఉండండి'' వాళ్ళు మొదట్లో చెప్పిందిదే. నేను ఉండగలిగాను. ఇంటి నుండే ఒక చిన్న ప్రచురణ సంస్థని నడుపుతున్నాను కాబట్టి ఇంట్లోనే ఎక్కువ సమయం గడుపుతాను. నేనేం భయపడలేదు. నేనిది చేయగలనని నాకు నేనే చెప్పుకున్నాను. ఇది దేన్నీ మార్చదు. తర్వాత ఆ సలహా ఒక ఆజ్ఞ అయింది. 'ఇంట్లోనే ఉండండి!' అని వాళ్ళు చెప్పారు. మొత్తం మారిపోయింది.

ఇంటిబయటేదో జంతువు వేటకోసం తిరుగుతున్నట్లుగా మేం జీవిస్తున్నాం. ఎప్పుడది వేటలో అలసిపోయి వెనుతిరిగిపోతుందో ఎవరికీ తెలియదు. ప్రపంచం నలుమూలల నుండి వచ్చే పర్యాటకులతో ఎప్పుడూ రద్దీగా ఉండే మా ప్రియమైన ఫ్లోరెన్స్ నగర వీధులు ఇప్పుడు పూర్తి ఖాళీగా ఉన్నాయి. ఈ హఠాత్ నిశ్శబ్దానికి ఖంగుతిన్న పావురాలు, గువ్వపిట్టలు, కారునల్లని కాకులు, నమ్మలేనట్టుగా ఒకదాన్నొకటి చూసుకుంటున్నాయి. వసంతకాలం వస్తోంది కాని, దాన్ని ఆస్వాదించే స్థితిలో లేమని మాకు తెలుసు. పార్కులో నడవడమో స్నేహితులింటికి వెళ్ళిరావడమో వంటి ఇంతకు ముందు పెద్దగా విలువనివ్వని పనులన్నీ ఇప్పుడు మాకందుబాటులో లేనంతటి విలాసవంతమైనవిగా తోస్తున్నాయి. నిజానికిది సమావేశాలను స్వాగతించే సమయం; కానీ మనం ఒకరికొకరు దూరంగా ఉండాలనీ, దగ్గరగా వచ్చేవారిపట్ల మరింత జాగ్రత్తగా ఉండాలనీ చెప్తున్నారు. ఇదంతా ఎప్పుడు ముగుస్తుందో, మనం మళ్ళీ సురక్షితంగా ఉన్నామని భావించేందుకూ, చెంప మీద ముద్దుపెట్టుకొని ఒకరినొకరం పలకరించుకోవడానికీ ఎంత సమయం పడుతుందో? ఇంట్లో ఉండటం విసుగు పుట్టిస్తోందంటూ మనం గులుగుతున్నప్పుడు నిరాశ్రయులైన జనమంతా ఎక్కడికి వెళ్ళుంటారు?

రోజురోజుకీ ఎంతగా మరింతగా బిగిసిపోతున్నట్టు అనిపిస్తున్నప్పటికీ కనీసం మాకు ఇల్లంటూ ఒకటుంది. ఆ వారానికవసరమైన ఆహార పదార్థాల్ని పక్కకు తీస్తూ నాతో నేనే చెప్పుకున్నాను: సూపర్ మార్కెట్ల వంటి రద్దీగా ఉండే ప్రదేశాల్లో ఎంత తక్కువ సమయం గడిపితే అంతమంచిదని, ఎట్టి పరిస్థితులలోనూ కుటుంబం నించి ఒక్క సమయంలో ఒక్క సభ్యుడు మాత్రమే ఆహార పదార్థాలను కొనేందుకు అనుమతించబడాలని, అలా వెళ్ళేవారు తాము బయటకు వచ్చిన కారణాన్ని తెలిపే పత్రాన్ని తప్పకుండా తమతో తీసుకెళ్లాలనీ, ఆ కారణం తప్పుగా తేలితే వారిపై చర్యలు తప్పవనీ.

మేమేమీ యుద్ధకాలంలో జీవించడంలేదు, మాకు అవసరమైనవన్నీ– ఆహారం, ఆటవిడుపులు, పుస్తకాలు, సంగీతం, ప్రపంచంలోని ఇతర ప్రాంతాలతో కమ్యూనికేట్ చేయడానికి సాంకేతిక పరిజ్ఞానం– ఉన్నాయి. కానీ గత కొన్ని రోజులుగా నేను చెవుల్లో ఏదో బయ్యిమంటున్న శబ్దంతో మేల్కొంటున్నాను. నిద్రలేస్తాను, కాఫీ తాగుతాను, కంప్యూటర్ వద్ద కూర్చుంటాను, నా భర్తతో పిచ్చాపాటీ మాట్లాడతాను, లంచ్ తయారు చేస్తాను, ఇంకాస్త ఎక్కువ పని చేస్తాను, రాత్రి భోజనం ముగిస్తాను– ఇన్ని వేళల్లోనూ ఆ బయ్యిమనే శబ్దం అలాగే ఉంటుంది– నేనింకా చూడగలిగిన తాకగలిగిన వాటిని నా నుంచి వేరుచేసే ఒక సన్నని తెరలాగా. నాకోసమని నిర్దేశించిన ఒక నిర్దిష్ట ప్రణాళికను అమలు చేస్తున్న మరమనిషిని నేను. నా మనస్సు ఒక క్రొత్త, చలనం లేని శరీరంతో – మాకిప్పుడు ఇంట్లోంచి బయటకొచ్చి ఇంటికి మరీ దూరంపోకుండా ఒంటరిగా నడిచేందుకు అనుమతి ఉంది – తాను ఒకప్పుడు చేసిన పనులేవీ ఇప్పుడు చేయలేని స్థితిలోవున్న ఒక శరీరంతో– సంబంధాన్ని ఏర్పరచుకోవడానికి ప్రయత్నిస్తోంది. ఇది ఒంటరితనం, నాలో నేననుకున్నాను. రేపటి గురించిన అనిశ్చితి. ఆక్సిజన్ లేకపోవడం.

వాస్తవమేమిటంటే, ఈ శ్మశాన నిశ్శబ్దంలో –నగర ధ్వనులు సద్దుమణిగిపోయాయి, శాన్తా క్రోచె కొట్టే గంటలు మాత్రమే నా రోజులను వినిపిస్తాయి – ఇప్పుడు మనం మన ఆలోచనల పూర్తి బరువును అనుభూతి చెందుతున్నాము. 'నాకింక వేరే మార్గం లేదు, నేను నిన్ను ఆపవలసి వచ్చింది' అని చెప్తోన్న ఒక స్వరం నా వెనుకనేవుంది. ఇదీ దాటిపోతుంది, కానీ దీన్ని మర్చిపోవద్దు. అందువల్లనే నేను అనారోగ్యం వల్లనో, ఆర్థిక సంక్షోభం వల్లనో, నిర్దేశిత సూచనలను కోల్పోవడం ద్వారా కలిగే భయంవల్లనో మరణించను. ఆ స్వరం నిజమే చెప్తుందని నాకు తెలుసు, ఈ త్యాగం అవసరమేననీ, వివిధ స్థాయిల్లో ఇది మంచికే దారితీస్తుందనీ. అదెలాగంటే, ఇప్పుడున్న పరిస్థితి అంతా దాటిపోయాక, మనం ప్రాథమికంగా దుర్బలులమనీ మన చర్యలకు పర్యవసానాలుంటాయనీ మనం మరచిపోనప్పుడు మాత్రమే.

బహుశా నేను అదృష్టవంతురాలినవడం వల్లనే నేనిలా మాట్లాడుతున్నాను: మొదటి సంగతి, నాకో ఇల్లుంది. రోజంతా నా డెస్క్ ముందు కూర్చొని ప్రచురించాల్సిన కథలను అధ్యయనం చేస్తాను. ఇది నా పని. కథలు. ఇప్పటికే నేను వాటిని చదివే విధానానికి ఈ వైరస్ సోకింది. రాబోయే సంవత్సరంలో, నా పాఠకులు ఈ అఘాతాన్నుండి కోలుకొని ముందుకు సాగిపోవడం అవసరమయినప్పుడు, ఏ కథలు ప్రచురించాలో అది నాకు చెప్పింది. శుభ్రమైన లినెన్ వస్త్రాన్ని అసాధరణమైన జాగ్రత్తతో శ్రద్ధగా మడతపెడుతూ – ఇదేమీ ప్రపంచానికి అంతం కాదు– అనుకున్నాను. ఎందుకంటే ఇది మరొక ఊహించని పరిణామం: ప్రతి చర్యా, ఏమాత్రం ప్రత్యేకత లేనిది కూడా ఒక కొత్త విలువను సంతరించుకుంది. నేను పిల్లికి ఇచ్చే ప్రతి కౌగిలింతనీ నాకు నేను ఇచ్చుకుంటాను. ప్రతి శుభరాత్రి సందేశాన్నీ కూడా ఇప్పటికే మనం జీవిస్తున్న పీడకలల రాత్రిలాంటిది కాకూడదనే హృదయపూర్వకమైన ఆశతోనే చెప్పుకుంటాను.

తెల్లవారుఝామున కొన్నిసార్లు నా కళ్ళింకా మూసుకునీ, శరీరం విశ్రాంతిగా, మనసు అప్పటికే అలసిపోయి ఉన్నప్పుడు, వైరస్ మనకు నేర్పిస్తున్న ఈ కొత్త నెమ్మదితనం బాగుందనీ, సహనానికి సంబంధించిన ఈ పాఠం కూడా ఆరోగ్యకరంగా ఉందనీ అనుకుంటాను. అంతకుముందున్న – మన ఊపిరి తీసేసి, మనల్ని ఎన్నడూ దేన్నీ ఆస్వాదించనివ్వని – ఆ వెర్రి బలం – ఆ శక్తంతా ఇప్పుడు సోషల్ మీడియాలోకి ప్రవహించి, మనల్ని మాటలు కలబోసుకునేలా, ఒకరినొకరు హెచ్చరించుకునేలా, సంఘీభావాన్ని తెలుపుకునేలాంటి శక్తిగా రూపాంతరం చెందింది. మనం ఒకరిలోనొకరిగా చుట్టుకుపోయాం. ఈ నిశ్శబ్దం కేవలం ఒక అద్దంలా మారకుండా ఆపేందుకు మనం శబ్దాలు చేద్దాం. వైరస్ మనల్ని ఒంటరులం కావాలని కోరుకునివుంటే, అందుకో కారణం ఉంది. మన జీవనశైలిని ఎలా మారాల్సివుందో ప్రతిబింబించేలా మనం ఎందుకు నిశ్శబ్దంగా ఉంటూ, నిశ్శబ్దాన్ని హత్తుకోగూడదూ?

ఇంట్లోనే ఉండండి, పుస్తకం చదవండి! ప్రతి ఒక్కరూ ఇలా ఎలుగెత్తి చెప్తారు. కానీ, తమ స్వంత గుర్తింపునూ అభిరుచులనూ వేరెవరిపైనో రుద్దడానికి చేసే మరో ప్రయత్నంలా అనిపిస్తూండే ఈ సూచనల అరుపుల మధ్యనుంచి నాకు ఏ పుస్తకం అవసరమో తెలుసుకోవడం ఎలా? నేను చేసే పనిని పరిగణనలోకి తీసుకుని ఒక నిబిడాశ్చర్యంతో ఇలా చెప్తున్నాను, ఈసారి కేవలం పుస్తకాలు సరిపోవు. మీ చుట్టూ ఉన్న ప్రపంచం కంపించిపోతూన్నప్పుడు చదవడంపై దృష్టి పెట్టడం అంత సులభం కాదు. బహుశా మార్పుకు మనం పూర్తిగా అలవాటుపడిన తర్వాత తిరిగి మనకు అవసరమైన ప్రశాంతతను కనుక్కోగలుగుతాము. కాని ఇదింకా ప్రారంభమే. మనకు ఉపశమనం కలిగించేందుకు సంగీతమే ఇప్పటి అవసరం.

అహంభావం ఇంకా పుష్కలంగానే ఉంది, కానీ ఇక్కడ కూడా మనకు నేర్పేందుకు వైరస్‌కు ఒక పాఠం ఉంది. తగిన కారణం లేకుండా ఇంట్లోంచి బయటకు వెళ్ళేవారెవరైనా ఇప్పుడు తమ పొరుగువారిని కేవలం దగ్గుతోనే చంపేసే ప్రమాదం ఉంది. కొంతమంది భయపడతారు, స్పృహలోకి వస్తారు– లేదా శిక్ష పడుతుందని భయపడతారు. ఇంకొందరిలో మాత్రం చలనముండదు. అయితే మనిషి ఎప్పుడూ మనిషే. అదంతా మరో కథ.

నేను నా తల్లిదండ్రులను చూసి ఇప్పటికి నెలలు గడిచాయి. వారు ఇప్పటికీ నేను పుట్టిపెరిగిన మార్చెలోని పెసారో నగరంలోనే నివసిస్తున్నారు. అంటువ్యాధి అత్యధికంగా ఉన్న ప్రాంతాలలో అదీ ఒకటి. కాని మనం ఒక్క రోజులో ఇప్పుడు మాట్లాడుతున్నన్ని సార్లు ఇంతకుముందెన్నడూ మాట్లాడి ఎరుగం. వారికి 70 సంవత్సరాల వయసు. ఇలాంటివి అనుభవంలోకి వస్తాయని వారెన్నడూ ఊహించలేదు. 'నేనేం భయపడటంలేదు,' అంది మా అమ్మ రాత్రి నాతో. 'నేను చలించని తేనెటీగలా ఉన్నాను, కాని నేను భయపడను.' చలించని తేనెటీగ! అయితే అదన్నమాట నా తలలో ఉన్న బయ్యిమనే శబ్దం. నేనింకా పాత నేనుగానే ఉన్నాను, పరిస్థితులకు అనుగుణంగా గట్టిపడకుండా. కానీ అలా ఉండే ప్రయత్నంచేస్తే ఎలా ఉంటుంది?



సారా రెజ్జియాని

సారా రెజ్జియాని రాసిన 'స్టే హోమ్, దే టోల్డ్ అజ్' వ్యాసానికి అనువాదం ఇది. సౌజన్యం: lithub.com. సారా సంపాదకురాలు, ఆంగ్లం నుంచి ఇటాలియన్ అనువాదకురాలు. ఎదిత్సియోని బ్లాక్ కాఫీ(బ్లాక్ కాఫీ ఎడిషన్స్) సహ సంపాదకురాలిగా కొత్త రచయితల పుస్తకాలను ప్రచురించారు. ప్రత్యేకించి లిటెరరీ నాన్ ఫిక్షన్ ఆమెకు మక్కువ. ప్రయాణాలను ఇష్టపడతారు. ఆమె ఇటాలియన్‌లో రాసిన ఈ వ్యాసాన్ని శామ్ గ్రిస్‌వాల్డ్ ఇంగ్లిష్‌లోకి అనువదించారు. తెలుగు: కృష్ణకాంత్ శ్రీరామ్.

● రీవిజిట్



'ఎన్నాళ్ళయినా ఏం మారిందని మనం కవిత్వం రాయకుండా ఉండాలి?' అని అడుగుతాడు అనిల్ డ్యానీ, తను ఎందుకు రాస్తున్నాడో ఒకే వాక్యంతో జవాబు చెప్పేస్తూ. 'పీకనొక్కబడిన సహజమైన ఫీలింగ్స్‌కి తనదైన కొత్త గొంతుతో డబ్బింగ్' చెప్తున్న అనిల్ మొదటి కవితా సంపుటి 'ఎనిమిదో రంగు' తర్వాత వచ్చిన రెండో పుస్తకం ఈ స్పెల్లింగ్ మిస్టేక్. అందులోంచి ఒక కవిత:

**స్పెల్లింగ్ మిస్టేక్ (కవిత్వం)**
రచన: అనిల్ డ్యానీ; పేజీలు: 96;
వెల: 100; ప్రచురణ: సాహితీ మిత్రులు,
విజయవాడ–2; కవి ఫోన్: 9703336688

## మరోమాట

**తే**నె బాణం
ఒక్క మాట
ఉబుసుపోని కబురు చివర
ఊరిస్తూ ఒక్కోపదం
ఉక్కపోతగది
గోడవారగా కిటికీ పక్కన
కుబుసం విడుస్తున్న
గోధుమరంగు ఛాయదేహం
రంగురంగుల మోహపువనం
గగనందాకా వ్యాపించిన
నీ అంగవస్త్రం చివరి అంచు మీద
రాస్తున్న ప్రేమలేఖ నా ఆఖరిమాట
నూనె నిండిన దీపంలా ఉన్నా
ఒక్కసారి వత్తి వెలిగించి
దీపపు వాసనై పోవూ!

◆ అనిల్ డ్యానీ

● కొత్త బంగారం

# జీవిత చిత్రంలో ఖాళీలు

''**మ**ళ్లీ ఒంటరితనం– వింతగా ఉందిప్పుడు. నా మధ్యాహ్నాలన్నీ నాక్కావలసిన దానికంటే ఎక్కువ విస్తారంగా ఉన్నాయి. నాతో నాకు కావలసినంత ఏకాంత సమయం, తోడుగా ఉన్న రచనాన్వేషణలో నాలో నన్ను కనుక్కుంటూ నేను...'' మనిషి తన చేతనతో మమేకమవడానికీ, తన అస్తిత్వాన్ని గుర్తెరగడానికీ చేసే ప్రయత్నాన్నీ, ప్రయాణాన్నీ ఒక కవితాత్మక కథగా చెప్పగలగటం అమెరికన్ రచయిత్రి అమీనా కెయిన్ రాసిన తొలి నవల 'ఇన్‌డెలికసీ'లో సాధించడం చూస్తాం. గత నెలలోఎఫ్.ఎస్.జి. ద్వారా ప్రచురింపబడిందీ పుస్తకం.



■ నవల: ఇన్‌డెలికసీ
రచన: అమీనా కెయిన్

ఒక మ్యూజియమ్‌లోని ఆర్ట్ గాలరీలో పెయింటింగ్స్, గదులూ శుభ్రం చేసే చిరుద్యోగి విటోరియా. గతకాలాల ఇరుకుదనాన్ని పట్టించుకోకుండా, ఉన్నంతలో ఒంటరిగా ధైర్యంగా హాయిగా బ్రతుకుతున్న వ్యక్తి. ఉద్యోగమూ, సంపాదనా తృప్తినివ్వకపోయినా జీవితంలోని స్వేచ్ఛని ఆస్వాదిస్తూ ఉంటుంది. రచయిత్రి కావాలన్న కోరికకు డబ్బూ సమయమూ రెండూ కరువైనా, ప్రతిరోజూ చూసినవాటి గురించి రాసుకుంటూ ఏనాటికైనా ఒక పుస్తకం ప్రచురించాలన్న ఆశతో ఉంటుంది. ఇంతలో, ఆర్ట్ గాలరీ చూడటానికి వచ్చిన ఒక సంపన్నుడు విటోరియాని పెళ్లిచేసుకుంటాడు. వివాహమైన తరవాత విటోరియాకి ప్రేమగా చూసుకునే భర్తతో పాటు తనకంటూ గదీ, రాసుకోవటానికి సమయం, స్వేచ్ఛ దొరుకుతాయి. ఈత కొట్టడం, బాలేరీనాలు చూడటం నేర్చుకోవటం వగైరాలు చేస్తూంటుందామె. కళల పట్ల ఆసక్తీ, తనకేం కావాలో తెలుసుకోవాలన్న తపనా, చూసిన విషయాల గురించి రాసే అలవాటూ ఆమెని వదిలిపెట్టవు.

ఇవన్నీ ఉన్నప్పటికీ, ఏదో అసంతృప్తికి లోనవుతుంటుంది. రచయిత్రులంటేనే చిన్నచూపు ఉన్న భర్తకు తన రాతలపట్ల కూడా గౌరవం లేదని ఆమెకు తెలుసు. దీనికితోడు ఇంటి మెయిడ్ అయిన సొలాంజ్‌తో ఆమెకు సఖ్యత ఏర్పడదు. తనకున్న తపనకు ఇంటి బాధ్యతలు, భర్త స్నేహితులూ, వాళ్లతో పార్టీలూ అడ్డుగా ఉన్నట్టు అనిపిస్తుంది ఆమెకు. ఇవన్నీ అర్థం చేసుకోని భర్త వల్ల విటోరియా ఒంటరితనానికి గురై, సంసార జీవితానికి కూడా దూరంగా ఉంటూ, భర్తనుంచి విడిపోవాలని అనుకుంటుంది. విడిపోయినా, మళ్లీ ఉద్యోగం చేసే అవసరం లేకుండా ఉంటే బావుండునని అనుకుంటున్నప్పుడే, భర్తకూ సొలాంజ్‌కూ మధ్య ఉన్న సంబంధం బయటపడుతుంది. వారి బంధానికి పరోక్షంగా కారణం తనే అయినా, భర్తనుంచి విడిపోవడానికే సుముఖత చూపిస్తుంది. మళ్లీ ఒంటరి జీవితం– కానీ, ఈసారి చాలినంత డబ్బు, రాసుకునే తీరికా, ఇతర బాధ్యతలేమీ లేని జీవితం మొదలవడంతో కథ ముగుస్తుంది.

విటోరియా ఉద్యోగస్తురాలైనప్పుడూ, వివాహమైనప్పుడూ, భర్తనుంచి విడిపోయిన తరువాతా– ఎప్పుడూ తనదైన పద్ధతిలోనే స్వేచ్ఛామార్గంలో ప్రయాణిస్తూ ఉంటుంది. పెయింటింగ్స్ పరిశీలించటం, వాటిలో తన ఆలోచనలనూ ఆశలనూ వెతుక్కోవడం విటోరియాకి ఇష్టమైన వ్యాపకం. ''నేను మ్యూజియంలో పనిచేస్తున్నప్పుడు ఒకోసారి కిటికీలోంచి బయటకి చూస్తూ నిలబడిపోయేదాన్ని. కిటికీ అద్దాల్లో నా వెనక ఉన్న పెయింటింగ్స్ ప్రతిఫలించేవి– నాతో సహా. వాటితోపాటు నన్నలా చూసుకోవటం ప్రత్యేకంగా అనిపించేది. ఇంకోలా ఎలా ఉండాలో నేర్చుకుంటున్నట్టు, నన్ను నేను సరికొత్తగా చూసుకుంటున్నట్టు,'' అంటుంది విటోరియా. పెయింటింగ్స్‌లో చిత్రంతో బాటు పక్కనే ఉన్న ఖాళీలూ, ఆ ఖాళీలను నింపిన వర్ణాలు కూడా ఏదో చెప్తున్నట్టే తోచేదామెకు. విటోరియా జీవిత చిత్రంలో పెయింటింగ్స్ ఒక వర్ణంలా కలిసిపోతే, రచనా జీవితంలోని పదాలు అంతరంగపుటావిష్కరణలు.

తనలో ఉన్న అసంపూర్ణతల గురించి విటోరియాకి స్పృహ లేకపోలేదు. ఏకపక్షపు నిర్ణయాలతో భర్తని దూరం చేసుకోవడం, వివాహం అక్కర్లేకపోయినా దాన్నుంచి వచ్చే భరణాన్ని మాత్రం ఆశించడం లాంటివి విటోరియాని మరీ ఎక్కువగా ఆదర్శవంతం చేయకుండా, సగటు వ్యక్తి స్థాయిలో నిలిపే వాస్తవ ప్రయత్నం చేస్తుంది నవల. సౌజన్యం కొంతమేరకు కొరవడిన పాత్రతో నవలకి 'ఇన్‌డెలికసీ' అన్న పేరూ, వ్యక్తిత్వపు ఛాయల సమతూకం సాధించిందన్న పేరుకి నవలా ఒకదానికొకటి సరిపోయాయి!

◆ పద్మప్రియ

● సాహిత్య మరమరాలు

## బహుమతులు



**ఆం**ధ్రా షేక్‌స్పియర్‌గా, అభినవ కాళిదాసుగా ఎనలేని గుర్తింపు పొందిన సాక్షి వ్యాసాల రచయిత పానుగంటి లక్ష్మీనరసింహారావు చక్కటి హాస్య ప్రియులు. ఆయన జీవిత చరమాంకంలో జరిగిన ఉదంతం ఇది. ఆ సమయంలో వృద్ధాప్య సమస్యలు ఆయన్ని వెంటాడుతున్నాయి. అలాంటి రోజుల్లో– ఓ సాహిత్య సమాజం వారు పానుగంటి వారికి భారీ ఎత్తున సత్కారం చేశారు. సభకు అధ్యక్షత వహించిన ఆ సమాజ నిర్వాహకుడు, చంద్రునికో నూలుపోగులా పానుగంటి వారికి బహుమతులు అందజేస్తున్నామని ఉత్సాహంతో ప్రకటించారు. దానికి పానుగంటి స్పందిస్తూ, 'ఉన్న ఒక్క మతి పోయింది. దానికే ఇబ్బంది పడుతుంటే నాకు బహుమతులేల?' అనేసరికి సభ కరతాళ ధ్వనులతో మార్మోగింది.

◆ వాండ్రంగి కొండలరావు

# అరబిక్ సాహిత్యంలో ధ్రువతార

● గ్రేట్ రైటర్



నాగీబ్ మహఫూజ్

**నా**గిబ్ మహఫూజ్ (1911–2006) ఈజిప్ట్ దేశానికి చెందిన రచయిత. 22 సంవత్సరాల వయసులోనే రాయడం మొదలుపెట్టాడు. మొదట్లో దేశభక్తితో కైరో గురించి మూడు చారిత్రక నవలలు రాశాడు. నిజానికి భాషా సాహిత్యం చదువుకోవాలి అనుకున్న మహఫూజ్ పెద్దల బలవంతం వల్ల సామాజిక శాస్త్రం చదవవలసి వచ్చింది. ప్రభుత్వ ఉద్యోగం సంపాదించుకున్నాడు. గుమస్తాగా చేరిన అతను చివరకు తమ దేశపు సాంస్కృతిక శాఖకు సలహాదారుగా రిటైర్ అయ్యాడు. 70 ఏళ్ల రచనా వ్యాసంగంలో 34 నవలలు రాశాడు. 350 దాకా కథలు రాశాడు. చాలా సినిమాలకు స్క్రిప్టు రాశాడు.

ఈజిప్టులోనూ, మొత్తం అరబ్బు ప్రపంచంలోనూ ఈయన రచనలు ఆధునిక క్లాసిక్స్‌గా గుర్తింపబడ్డాయి. ఆయన రచనల ఆధారంగానే ప్రస్తుత కాలపు అరబిక్ సాహిత్యం నిలబడిందని చెప్పవచ్చు. 1988లో మహఫూజ్ కు నోబెల్ బహుమతి ఇచ్చారు. 'అరబిక్ సాహిత్యంలో నవల అన్నది 20వ శతాబ్దంలోనే మొదలైంది. అంటే ఇంచుమించు నాగిబ్ మహఫూజ్‌తోనే మొదలయింది అనవచ్చు. అంతకుముందు ఒకరిద్దరు మాత్రమే రచయితలు ఉన్నారు. మహఫూజ్ ఈ రచనా ధోరణిని ప్రామాణికంగా మార్చాడు' అని ఈ సందర్భంగా స్వీడిష్ అకాడమీ వ్యాఖ్యానించింది.

మొదట్లో చారిత్రక, పౌరాణిక నవలలు రాసిన మహఫూజ్ సమాజాన్ని బాగా పరిశీలించడం నేర్చుకున్నాడు. త్వరలోనే తన రచనా పద్ధతి మార్చుకున్నాడు. నవలలు, కథలు అన్నింటిలోనూ తన చుట్టూ కనిపించే మనుషులు, మనస్తత్వాలు, ప్రదేశాలు మొదలైన వాటి గురించి సూటిగా రాయడం మొదలు పెట్టాడు. ఆయన నవలలు చదువుతుంటే ఒక విచిత్రమైన పరిచిత ధోరణి కనపడుతుంది. మధ్య తరగతి మనుషులు, వాళ్ల మామూలు వాతావరణం కూడా కళ్ళకు కట్టినట్లు కనబడుతుంది. ఖాన్ అల్ ఖలీలీ, మిదాఖ్ అలీ లాంటి నవలలు అన్నీ ఈ ధోరణిలోనే సాగుతాయి. సన్నివేశాలలో మనం ఉన్నామన్న భావన కలుగుతుంది. మామూలు మనుషుల సాయంతో అతను ప్రపంచం మొత్తం గురించి చెపుతాడు. సంప్రదాయంలో పాతుకుపోయిన అరబ్ సమాజానికి, ముఖ్యంగా రచయితలకు సమకాలీన సమాజం మీద ప్రగతి మార్గంలో చర్చించడం, పాలకులకు ధిక్కార స్వరం వినిపించడం నేర్పిన రచయిత మహఫూజ్.

సల్మాన్ రష్దీ విషయంగా ఇతను అనుసరించిన ధోరణి అప్పటికే అతని రచనలతో విసిగిన ఛాందసవాదులకు నచ్చలేదు. మహఫూజ్ మీద హత్యా ప్రయత్నం జరిగింది. దేశంలోని పరిస్థితులను విమర్శిస్తూ వ్యాసాలు మాత్రమే కాక, అదే అంశంతో కథలు, నవలలు కూడా రాశాడు. చివరికి ఇతడిని రాజకీయాల గురించి రాస్తాడు, అనే దాకా పరిస్థితి వచ్చింది.

మహఫూజ్ సుమారు 94 సంవత్సరాలు బతికాడు. మరణానంతరం కూడా ఆయన రచనలు అయిదు అచ్చయ్యాయి. వాటిలో ద క్వార్టర్ అన్నది మరీ ప్రత్యేకమైన రచన. అది 18 చిన్న కథానికల సంకలనం. 1994లో అచ్చు కావాలి అని మహఫూజ్ దాన్ని దాచుకున్నాడు. కానీ ఆ పని జరగలేదు. అరబ్ భాషలోనే ఆ రచన అతని మరణం తరువాత అచ్చయింది.

◆ డాక్టర్ కె.బి.గోపాలం

## రారండోయ్

● ప్రస్తుత కరోనా వైరస్ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఆటా (అమెరికా తెలుగు అసోసియేషన్) నిర్వహించ తలపెట్టిన నవలల పోటీ గడువును జూన్ 30 వరకు పెంచుతున్నట్టు నిర్వాహకులు తెలియజేస్తున్నారు. వివరాలకు: atanovels2020@gmail.com

● పాతూరి మాణిక్యమ్మ పురస్కారం కోసం 2019లో ప్రచురించిన వచన కవితా సంపుటాల 2 ప్రతులను ఏప్రిల్ 30లోగా పంపాలని పాతూరి అన్నపూర్ణ(1156/28–1, ప్రశాంతి నగర్, నవలాకుల తోట, నెల్లూరు–2) కోరుతున్నారు. నగదు: ఐదు వేలు.

## ట్రోల్ ప్రపంచం

కరోనా మీద కవిత్వం రాస్తున్నావా?
నువ్వు చాలా గ్రేట్ బ్రో!
నేనింకా కాగితం మీదే రాస్తున్నా.



## ఈవారం పుస్తకాలు



**స్రగ్ధర**
(కళాప్రపూర్ణ మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి ఖండకావ్య రచనల సమాహారం)
పేజీలు: 304 ; వెల: 250
ప్రతులకు: మధునామూర్తి, గణేష్ హైట్స్–3, 504, చినముషిడివాడ, విశాఖపట్నం–531173 ; ఫోన్: 9398040740



**నూరు శరత్తుల మధునాపంతుల**
**శతజయంతి (1920-2020) సాహిత్య సంచిక**
ప్రధాన సంపాదకుడు: డాక్టర్ శిఖామణి ; పేజీలు: 400 ; వెల: 300 ;
ప్రతులకు: ఆంధ్రీ కుటీరం, పల్లిపాలెం, వయా యానాం, తూర్పు గోదావరి ; ఫోన్: 9704186544



**ఆదిలాబాద్ జిల్లా సాహిత్య చరిత్ర**
రచన: ఉదారి నారాయణ ; పేజీలు: 100 ; వెల: 40 ; ప్రతులకు: తెలంగాణ సాహిత్య అకాడమి, కళాభవన్, రవీంద్రభారతి ప్రాంగణం, హైదరాబాద్–500004. ఫోన్: 040–29703142



**పరాధీన** (కవిత్వం)
రచన: నందకిశోర్ ; పేజీలు: 40 ; వెల: 50 ;
ప్రచురణ: వాకిలి,
అపర్ణ హిల్‌పార్క్ గార్డెనియా, విల్లా 38,
చందానగర్, హైదరాబాద్.
కవి ఫోన్: 9515881085



**తెలివాహ**
రచన: దామెర రాములు ; పేజీలు: 40 ; వెల: 40 ;
ప్రతులకు: స్పృహ సాహితీ సంస్థ, ఎమ్ఎస్‌కె టవర్స్, ప్లాట్ నం. 410, స్ట్రీట్ నం. 11, హిమాయత్‌నగర్, హైదరాబాద్–26.



**రత్న గీతికలు**
రచన: డాక్టర్ ఉందేకోడు రత్నయ్య ; పేజీలు: 172 ;
వెల: 100 ; ప్రతులకు: రచయిత, 1-4-134/ఏ/5/2, బాయమ్మ తోట, మహబూబ్ నగర్–509001. ఫోన్: 9440660632

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

సాక్షి
# ఫ్యామిలీ
నల్లగొండ
సోమవారం ॥ 30-3-2020



అంతా బాగానే ఉంది
– లోపలి పేజీలో

కరోనా హీరో | సి.ఈ. చక్కున్ని

## అద్దె మాఫీ

**మనిషి జీవితం సంక్షోభంలో పడినప్పుడు మానవత్వం పరిమళిస్తుంది. వ్యాపారికి డబ్బే ప్రధానం అని మనందరిలో ఒక అభిప్రాయం కరడుగట్టి పోయి ఉంటుంది. అలాంటిది ఓ వ్యాపారి చిరు వ్యాపారుల కోసం ఉదారమైన నిర్ణయాన్ని తీసుకున్నారు. కరోనా వ్యాప్తిని అరికట్టడానికి దేశం లాక్‌డౌన్‌లోకి వెళ్లిపోయిన నేపథ్యంలో దుకాణాలన్నీ మూతపడ్డాయి. వ్యాపారమే జరగనప్పుడు దుకాణం అద్దెలు చెల్లించడం కూడా బరువే. అందుకే వాళ్లకు ఒక నెల రోజులపాటు షాపుల అద్దె మాఫీ చేశాడు కేరళ, కోళికోద్‌లోని సి.ఈ. చక్కున్ని.**



**సి.**ఈ చక్కున్నికి దాదాపు అరవై ఏళ్ల వ్యాపార అనుభవం ఉంది. పాలక్కాడ్‌కు చెందిన చక్కున్ని ఎస్‌ఎస్‌ఎల్‌సి చదివిన తర్వాత కోళికోద్‌లోని విజయ ట్రేడర్స్‌లో సేల్స్‌బాయ్‌గా ఉద్యోగంలో చేరాడు. పనిలో మెలకువలు నేర్చుకున్న తర్వాత 1968లో ‘చక్కున్ని అండ్ కంపెనీ’ పేరుతో సొంత వ్యాపారాన్ని ప్రారంభించాడు. వ్యాపారం విస్తరించింది. క్రమంగా చక్కున్ని షాపింగ్ కాంప్లెక్స్‌ల మీద దృష్టి పెట్టాడు. ఇప్పుడు కోళికోద్ పట్టణంలో ప్రముఖ వాణిజ్య సముదాయాల్లో సింహభాగం ఆయనదే. అన్నింటిలో కలిపి చక్కున్నికి వంద దుకాణాలున్నాయి.

కష్టం తెలిసిన మనిషి

చక్కున్ని ఇప్పటి దుర్భర పరిస్థితులను వివరిస్తూ ‘‘నేను సేల్స్‌బాయ్‌గా జీవితాన్ని ప్రారంభించి, క్రమంగా సొంత వ్యాపారం మొదలుపెట్టాను. వ్యాపారి కష్టాలు ఎలా ఉంటాయో నాకు తెలుసు. ఈ మధ్య మా భవనాల్లో దుకాణాలను అద్దెకు తీసుకుని వ్యాపారాలు చేసుకుంటున్న మా అద్దెదారులు కొందరు... ఫోన్ చేసి పరిస్థితి గడ్డుగా ఉందని అద్దె మాఫీ చేయమని కోరారు. మా అబ్బాయిని పిలిచి బయట ఎలా ఉందని అడిగితే... దుకాణాలన్నీ ఖాళీగా ఉన్నాయి. అద్దె కట్టడం కష్టంగానే ఉందని, కొంతమంది వాయిదా అడుగుతున్నారని చెప్పాడు. ఆ తర్వాత రోజు నేనే స్వయంగా వెళ్లాను. ఒక దుకాణానికి రోజంతా తెరిచినా ఒక్క కస్టమర్ మాత్రమే వచ్చాడని తెలిసింది. కొందరికి అసలే బేరం జరగలేదు. వాళ్ల దుకాణంలో పని చేసేసేల్స్‌బాయ్‌లకు జీతాలివ్వడానికే కష్టంగా ఉంది. నాకు అద్దె కూడా చెల్లిస్తే... ఇక ఇంటికి పట్టుకెళ్లడానికి వాళ్లకేమీ మిగలదు. ఇంటికి వచ్చి నా భార్య, పిల్లలతో మాట్లాడి... ఒక నెల అద్దె మాఫీ చేశాను. ఒక నెల అద్దె పన్నెండు లక్షలు. భగవంతుని దయ వల్ల ఒక నెల అద్దెలు రాకపోయినా ఇబ్బంది కలగని స్థితిలోనే ఉన్నాను. ఈ కరోనా ఉత్పాతం... దేశ ఆర్థిక పరిస్థితినే సంక్షోభంలోకి నెట్టి వేస్తోంది. అలాంటిది ఈ చిన్న దుకాణదారులైతే చిగురుటాకుల్లా వణికిపోవాల్సిందే. అందుకే చేయగలిగిన సహాయం చేశాను’’ అన్నారాయన.

తోటి మనిషి కష్టాన్ని అర్థం చేసుకునే మనసున్న మనిషి ఉంటే ఎడారిలోనైనా సరే జీవితం మీద ఆశ చిగురిస్తుంది. ఎదుటి వాళ్ల కష్టాన్ని అర్థం చేసుకోవడానికి పెద్ద చదువులు అవసరం లేదు. జీవితాన్ని చదివిన అనుభవం, ఎదుటి వాళ్ల ఇబ్బందికి స్పందించే ఆర్ద్రమైన మనసు ఉంటే చాలని నిరూపించాడు ఈ కరోనా హీరో.

– మంజీర



# నాట్యప్రియ

**‘‘మా** అమ్మాయికి పుట్టుకతోనే నాట్యం వచ్చింది’’ అంటున్నారు మద్దిపట్ల కృష్ణవేణి, సత్యకుమార్ దంపతులు. ఇది వింత కాదు, విచిత్రం అంతకంటే కాదు... నెలల పాపాయిగా ఉయ్యాలలో ఉన్నప్పుడే తల్లి జోలపాటకు అనుగుణంగా కాళ్లు చేతులను కదిలిస్తూ కేరింతలు కొట్టేది. ‘‘నా గొంతు పలికే స్వరానికి అనుగుణంగా లయబద్ధంగా కాళ్లు కదుపుతోంది. పాపాయికి నాట్యం నేర్పిద్దాం’’ అన్నారు కృష్ణవేణి. గోదావరి తీరం, రాజమండ్రి నగరం, రాఘవేంద్రస్వామి మఠం వెనుక ఉన్న వారి ఇంటి గోడలే ఇందుకు సాక్ష్యాలు. ఆ రోజు వాళ్లు అలా అనుకున్నారు... పదిహేనేళ్లలోపే వారి కలల పంట పరిమళ హరిప్రియ ఆ అమ్మానాన్నలు ఊహించనంత ఎత్తుకు ఎదిగింది. ఏడు కొండల మీద తిరుమల మాడవీథుల్లో వేంకటేశ్వరుని సన్నిధిలో నాట్య ప్రదర్శన ఇచ్చింది.

### తిరుమలలో నాట్యప్రదర్శన

మూడో ఏట నాట్యసాధన ప్రారంభించిన హరిప్రియ ఇప్పటి వరకు ఐదువందలకు పైగా నాట్య ప్రదర్శనలు ఇచ్చింది. జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. అంతర్జాతీయ వేదికల ఆహ్వానాలు అందుకుంటోంది. నాట్యాన్ని ఎన్ని వేదికల మీద ప్రదర్శించినప్పటికీ పుణ్యక్షేత్రాలలో నాట్యం చేసినప్పుడే పరిపూర్ణత చేకూరుతుందని నమ్మేది హరిప్రియ. ‘‘2018లో ఓ సారి మేమంతా వేంకటేశ్వరుని దర్శనానికి వెళ్లాం. దేవుని ఎదుట నాట్యం చేయాలనే కోరిక అంత బలంగా ఉండడమే కారణం కావచ్చు. వరాహస్వామి దర్శనం చేసుకుని బయటకు రాగానే తదాత్మ్యంతో హరిప్రియ పాదాలు వాటంతట అవే కదలసాగాయి. తమాయించుకోలేకపోయింది. ఆ క్షణంలో అక్కడే నాట్యం చేసింది. అలాగే ఈ ఏడాది మరో సారి దర్శనానికి వెళ్లాం. అప్పుడు కూడా వరాహస్వామి ఆలయం సమీపంలోని మాడవీధిలో సూరదాస్, కబీర్‌దాస్ అభంగాలకు స్వామివారి ఊరేగింపులో నాట్యం చేసింది. ఆ దేవునికి ఆమె సమర్పించిన నాట్యాంజలి అది’’ అన్నారు హరిప్రియ తల్లిదండ్రులు.

### శృంగేరీ పీఠాధిపతి రచనకు నృత్యాభినయనం

శృంగేరీ పీఠాధిపతి భారతీతీర్థస్వామి రచించిన ‘గరుడగమన తవ చరణకమల’ గీతం పరిమళ హరిప్రియను అమితంగా ఆకట్టుకుంది. ఈ గీతానికి స్వయంగా నాట్యరీతిని కంపోజ్ చేసిందామె. ఆ నర్తనాన్ని యూట్యూబ్‌లో సుమారు ఆరు లక్షల మంది వీక్షించారు. మీరాబాయి ‘గిరిధర గోపాల’ రచనకు కూడా హరిప్రియ స్వయంగా కంపోజ్ చేసిన ప్రదర్శన కూడా వేలాదిమంది కళాభిమానుల ప్రశంసలు అందుకుంది.

### నాట్యమయూరి

శ్రీహరికోటలో ఇస్రో 2018లో నిర్వహించిన కార్యక్రమం, ఉడిపి రాఘవేంద్రస్వామి మఠం ఆధ్వర్యంలో జరిగిన నృత్యోత్సవంలో ఈ తెలుగింటి చిన్నారి నృత్యాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. తమిళనాడు, హోసూరు మాధవ మహాసభ ఆధ్వర్యంలోనూ, బెంగళూరులో కూచిపూడి నాట్యపరంపర ఫౌండేషన్ ఆధ్వర్యంలో, మంత్రాలయం, పుట్టపర్తి తదితర క్షేత్రాలలో నాట్యప్రదర్శనలు ఆమెకు ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చాయి. తెలంగాణ రాష్ట్రం, శంషాబాద్‌లో చిన్నజీయరు స్వామి ట్రస్టు ఆధ్వర్యంలో నాట్యం చేసి జీయరు ఆశీస్సులు అందుకుంది. గుంటూరులో 2015లో జాతీయ స్థాయి పోటీలలో హరిప్రియ ‘నాట్యమయూరి’ పురస్కారాన్ని, వివిధ సాంస్కృతిక సంస్థల నుండి ‘నర్తన బాల, నాట్యపరిమళ’ పురస్కారాలను అందుకుంది.

### చదువుకు నాట్యం అడ్డంకి కాదు

‘నాట్యం చదువులో ఒక భాగం అని అనుకుంటున్నప్పుడు, నాట్యం చదువుకు అడ్డంకి ఎలా అవుతుంది?’ అంటోంది హరిప్రియ. ‘‘నాట్య సాధనను నేను నా కోసమే కొనసాగిస్తున్నాను. భావవ్యక్తీకరణకు, నన్ను నేను ఆవిష్కరించుకోవడానికి నాట్యం ఒక సాధన. తిరుమల మాడ వీధిలో నా నాట్యం చూసి, ప్రముఖ సంగీత విద్వాంసురాలు ద్వారం లక్ష్మి ఫోను చేసి అభినందనలు తెలిపారు. అదో తీయని అనుభూతి’’ అన్నారు హరిప్రియ. ప్రస్తుతం ప్రపంచాన్ని వణికిస్తోన్న కరోనా ప్రభావం హరిప్రియ నాట్య ప్రదర్శనల మీద కూడా ప్రభావాన్ని చూపించింది. ఈ ఏడాది తొమ్మిదో తరగతి పరీక్షలు రాసిన హరిప్రియ వేసవి సెలవుల్లో మస్కట్‌లో నాట్య ప్రదర్శన ఇవ్వాల్సి ఉంది. ఆ ప్రదర్శన కరోనా వైరస్ కారణంగా వాయిదా పడింది.

– వారణాసి సుబ్రహ్మణ్యం, సాక్షి, రాజమండ్రి
ఫొటోలు : గరగ ప్రసాద్



### ఆన్‌లైన్ నాట్య శిక్షణ

**మొ**దట చింతలూరి శ్రీలక్ష్మిగారి వద్ద మూడు సంవత్సరాలపాటు కూచిపూడి నాట్యం నేర్చుకున్నాను. తరువాత ఘంటసాల పవన్‌కుమార్ వద్ద శిక్షణ తీసుకున్నాను. కేరళ రాష్ట్రం, కొచ్చిన్‌కు చెందిన హేమంత్ లక్ష్మణ్ నుండి ఆన్‌లైన్‌లో భరతనాట్యం నేర్చుకున్నాను. ఈ రోజుల్లో నాట్యసాధన కూడా ఖర్చుతో కూడిన కళగా మారిపోయింది. చాలా కోచింగ్ సెంటర్లు నాట్యాన్ని వ్యాపారాత్మకం చేస్తున్నాయి. నాట్యం చేయగలిగిన ప్రతిభ ఉండి, శిక్షణ తీసుకోవడానికి ఆర్థిక స్థోమత లేనివారి కోసం... నేను పెద్దయ్యాక ఫైన్ ఆర్ట్స్ అకాడమీ స్థాపించాలన్నదే నాధ్యేయం.

– పరిమళ హరిప్రియ, శాస్త్రీయ నాట్యకారిణి

మన శోధన



● మినల్ దఖావె భోశాలే

# తొలి గెలుపు

‘**భో**శాలే.. టెస్ట్‌కిట్‌తో ఈ దేశానికి ఒక నమ్మకాన్ని, భరోసాను ఇచ్చారు. సెల్యూట్స్’
– ఆనంద్ మహీంద్రా

‘**మ**హిళలమంతా గర్వపడేలా చేశారు భోశాలే. ఎక్కడైనా ఆడవాళ్లే ముందుంటారు అని నిరూపించారు’
– కిరణ్ మజుందార్ షా.

**క**రోనా.. ఎంత వేగంగా వ్యాప్తి చెందుతుందో దాన్ని అరికట్టే వైజ్ఞానిక ప్రయోగాలూ అంతే త్వరితంగా జరుగుతున్నాయి. ఈ ప్రయత్నాల్లో మన దేశం వెనకబడిపోయిందనే కామెంట్‌ను మోస్తూ వచ్చాం ఇన్నాళ్లూ. ఇప్పుడు ఆ మాటకు చెక్ పెట్టారు వైరాలజిస్ట్ మినల్ దఖావె భోశాలే పుణెలోని ‘మైల్యాబ్ డిస్కవరీ’ అనే డయాగ్నస్టిక్ కంపెనీలో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ చీఫ్‌గా పనిచేస్తున్న ఆమె కేవలం ఆరు వారాల్లోనే ‘కరోనా’ వ్యాధి నిర్ధారణ కిట్‌ను కనిపెట్టారు. దానిపేరు ‘పాథో డిటెక్ట్’. వ్యాధి నిర్ధారణా పరికరాన్ని కనుగొనే వరకు వైరస్ ఆగదు కదా.. ‘అందుకే ఆరువారాలు రికార్డ్ టైమ్. ఆ ఘనత మినల్‌కే దక్కుతుంది’ అన్నారు ‘మైల్యాబ్ డిస్కవరీ’ డైరెక్టర్ డాక్టర్ గౌతమ్ వాంఖడే. మన దగ్గర నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ చేత ఆమోదం పొందిన మొట్టమొదటి కరోనా నిర్ధారణా పరీక్షా పరికరం ఇదే.

అయితే.. ఇది దేశానికే కాదు... మినల్‌కూ కష్టకాలమే. ఈ ప్రయోగం చేస్తున్నప్పుడు ఆమె నిండు చూలాలు. పైగా ఆరోగ్యపరంగా కొన్ని సమస్యలు ఎదురై ఆసుపత్రిలో చేరింది కూడా. అప్పుడే మైల్యాబ్స్ డిస్కవరీ కరోనా టెస్టింగ్ కిట్స్ ప్రాజెక్ట్‌ను మినల్‌కు అప్పగించింది. క్లిష్టపరిస్థితుల్లో తనకు చేతనైన దేశసేవ చేయడానికి ఇంతకు మించిన అవకాశం ఏం ఉంటుంది అని ఈ ప్రయోగాన్ని ఛాలెంజింగ్‌గా తీసుకుంది మినల్. ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన వెంటనే పదిమంది టీమ్‌తో టెస్టింగ్ కిట్ ప్రయోగం మొదలుపెట్టింది. కేవలం నెలా పదిహేనురోజుల్లో విజయం సాధించింది. ఈ కిట్‌కు సంబంధించిన ఫార్ములాను మొన్న పద్దెనిమిదో తేదీన (మార్చి నెల) నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి సమర్పించింది. ఆ తర్వాత రోజే అంటే మార్చి 19న పండంటి పాపాయికి జన్మనిచ్చింది మినల్. ప్రస్తుతం ఈ రెండు శుభసందర్భాలనూ ఆమె ఆస్వాదిస్తోంది.

**ఈ కిట్ సామర్థ్యం..**

ఇప్పటి వరకు మనం ఈ కిట్స్‌ను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటూ వస్తున్నాం. అందుకే ప్రతి ఒక్కరినీ పరీక్షించే వీలు లేకపోయింది. కేవలం విదేశాల నుంచి వచ్చిన వాళ్లను.. వాళ్లతో కలిసి వాళ్లను, దగ్గు, జలుబు, జ్వరం మొదలైన లక్షణాలు కలిగిన వాళ్లను మాత్రమే పరీక్షిస్తున్నారు. ఇప్పుడు ఈ కిట్‌తో ఆ సమస్య తీరిపోనుంది. ఇప్పటిదాకా మనం దిగుమతి చేసుకుంటున్న వ్యాధి నిర్ధారణా విదేశీ కిట్స్ ఒక్కోటి 4,500 రూపాయలు. పాథో డిటెక్ట్ కిట్ వెల పన్నెండు వందల రూపాయలు మాత్రమే. అదీగాక విదేశీ కిట్‌లో ఫలితం రావడానికి ఆరు నుంచి ఏడు గంటల సమయం పడితే ఈ స్వదేశీ కిట్‌తో కేవలం రెండున్నర గంటల్లోనే ఫలితం వస్తుంది. ఒక్కో కిట్‌తో వంద శాంపుల్స్‌ను పరీక్షించొచ్చు అని చెప్తున్నారు నిపుణులు.

- తొలి విడతగా 150 ‘పాథో డిటెక్ట్’ కిట్‌లను తయారు చేశారు. వీటిని పుణెతోపాటు ముంబై. ఢిల్లీ, గోవా, బెంగళూరు నగరాలకు పంపుతున్నారు. తర్వాత మరిన్నిటిని మిగిలిన నగరాలకు సరఫరా చేస్తారు.
- దీన్ని మన దేశంలో కరోనా మీద తొలి గెలుపుగా భావించొచ్చు. ఈ యుద్ధంలో మహిళ మేధోశక్తి విజయం సాధించడం భారతీయులందరికీ గర్వకారణమే!
- ‘ఈ అత్యవసర పరిస్థితి దేశానికే కాదు నాకూ సవాలుగానే అనిపించింది. అందుకే ఈ అసైన్‌మెంట్ తీసుకున్నాను’ అంటుంది మినల్.
- మినల్ ఈ ప్రయత్నం పలువురి ప్రశంసలు అందుకుంటోంది. వాళ్లలో మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా , బయోకాన్ చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ కిరణ్ మజుందార్ షా కూడా ఉన్నారు.

డ్యూటీ



● తెల్లవారు జామున వీథులు శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

# ఆరోగ్య వెలుగులు

**క**రోనా లాక్‌డౌన్‌తో... పొరుగు దేశాల సరిహద్దు దాటి ఎవరూ దేశంలోకి అడుగుపెట్టకూడదని తలుపులు మూసుకుంది దేశం. రాష్ట్రాలు కూడా ‘మా రాష్ట్రంలోకి ఎవరూ రావద్దు’ అని నిర్బంధనం విధించుకున్నాయి. స్కూళ్లు లేవు, ఆఫీసులు లేవు. వ్యాపారాలు లేవు. అన్నీ బంద్ అయిపోయాయి. మనదేశం ఎలా ఉందో చెప్పడానికి ఇటీవల సోషల్ మీడియాలో తిరుగుతున్న ఒక చిత్రమే నిదర్శనం. అందులో ప్రధాన మంత్రి మోదీ... భారతదేశం తలుపులు మూసి, తాళం వేసి, తాళం చేతిని తన చేతిలో పట్టుకుని కూర్చుని ఉంటాడు. కరోనా మహమ్మారిని తరిమి కొట్టడానికి ఎవరికి వాళ్లు తమంతట తాముగా పనులన్నీ మానుకుని ఇళ్లలో ఉంటున్నారు. దేశమంతా సెలవు తీసుకున్న ప్రస్తుత నేపథ్యంలో రేయింబవళ్లు పని చేస్తున్నది వైద్యసిబ్బంది. వారితోపాటుగా పనికి సెలవు అనే మాటకు తావు లేకుండా పని చేస్తున్న మరొకరు పారిశుద్ధ కార్మికులు. డాక్టర్‌లు వ్యాధి బారిన పడిన వారికి వైద్యం చేస్తారు. నిజానికి ఆరోగ్యపరిరక్షణలో తొలి అడుగు పారిశుద్ధ్య కార్మికులదే. ఉదయం ఐదు గంటల నుంచి పది గంటల వరకు, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు డ్యూటీ చేస్తుంటారు.

### సమాజ హితమే ప్రధానం

‘అందరూ మంచిగుండాలని మేము పని చేస్తున్నాం’ అన్నది జగిత్యాల జిల్లా, ధర్మపురి మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికురాలు ఆశమ్మ. మేము పనులకు వెళ్తుంటే మా ఇంట్లో వాళ్లు భయపడుతున్నారు, కానీ మేము పని చేయకపోతే ఊరంతా చెత్త పేరుకుపోతుంది. ఇంకా పెద్ద రోగాలు ప్రబలిపోతాయి’ అన్నది బడుగు లక్ష్మి. ‘ఎంతమంది పని చేయకుండా ఇళ్లలో ఉన్నా సరే... మేము పని చేయడానికి వీథుల్లోకి వస్తాం. మాకు ఎలాంటి భయమూ లేదు. ఇప్పుడంటే కరోనా రోగమొస్తదని చెప్తున్నరు. కానీ ఏ చెత్తలో ఏముందో తెల్వదు. చెత్తను చేత్తో ముట్టుకుంటే ఏ రోగాలొస్తయో తెల్వదు. మాకు మాస్క్‌లు, గ్లవ్‌జ్‌లు, శానిటైజర్‌లు, బూట్లు ఇస్తే బాగుంటుంది. అవేవీ లేకపోయినా డ్యూటీ చేయడానికి వెనుకడుగు వేస్తలేదు మేము’ అంటున్నారు దూడ శారద, మసీదు లక్ష్మి. ‘సమాజం బాగుండాలి, ఆ సమాజంలో మేముండాలి’ అనే విశాలమనసుతో పని చేస్తున్న పారిశుద్ధ్య సిబ్బందికి సాక్షి సలామ్.

విరాళం

# 501... తక్కువేమీ కాదు

**ఎం**తిచ్చావనేది కాదన్నయ్యా! ఇవ్వాలనుకోవడమే పెద్ద బహుమానం. ఇవ్వాలనే మనసు ఉండడమే గొప్ప వరం.

దేశం మొత్తం చేస్తున్న ఇప్పుడు ఒక యజ్ఞం చేస్తోంది. అది ఆరోగ్యం కోసం చేస్తున్న యజ్ఞం. ఆ యజ్ఞంలో ఒక ఔషధ సమిధను అందించావు. సందేహం లేదు, నీ స్ఫూర్తితో మరెందరో ముందుకు వస్తారు. విరాళం అంటే భూరి విరాళం అయి ఉండాలనే నియమం ఎక్కడా లేదు. ఉండదు కూడా. పెద్ద పెద్ద స్టార్‌లు, పారిశ్రామికవేత్తలు లక్షలు, కోట్ల రూపాయలను విరాళంగా ఇస్తుండవచ్చు. నిజమే వాళ్లు దేశం మొత్తం మీద ఎంతమంది ఉంటారు? ఆ నంబరు వందకు మించదు.

### అ‘సామాన్య’ విరాళం

నీలాగ ఐదొందల ఒక్క రూపాయి ఇవ్వగలిగిన వాళ్లు కోట్లలో ఉన్నారు. అనుమానం లేదు, వాళ్లంతా నీలో తమను చూసుకుంటారు. నిన్నే స్ఫూర్తిగా తీసుకుంటారు. వాళ్లలో కనీసం సగం మంది నీలాగ ఐదొందల ఒక్క రూపాయి విరాళం ఇచ్చినా చాలు. మనిషి జీవితాన్ని అష్టదిగ్బంధనం చేస్తున్న కరోనా భూతాన్ని తరిమి కొట్టడంలో మీ భాగస్వామ్యయే పెద్దదిగా ఉంటుంది. లాక్‌డౌన్ పీరియడ్‌లో ఆకలితో ఉన్న మనతోటి మనిషికి పిడికెడు అన్నం పెట్టడానికి నీలాంటి ఎందరో ఇచ్చే ఈ ఉడుత సాయమే చాలు. కొండంత దేవుడికి కొండంత పత్రి తెచ్చి పూజించలేం. మనకు చేతనైంత పత్రితో పూజిస్తాం. ఇదీ అంతే.





### చిన్న మొత్తం - గొప్ప ప్రయోజనం

కరోనా వైరస్‌ను తరిమికొట్టడానికి దేశం చేస్తున్న యుద్ధానికి విరాళం ఇవ్వవలసిందిగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం నాడు దేశ ప్రజలను కోరిన నేపథ్యంలో ‘పీఎం కేర్స్ ఫండ్’కు ఒక సామాన్య పౌరుడు 501 రూపాయి విరాళమిచ్చారు. తాను ప్రకటించిన విరాళం చూసిన వాళ్లు తేలిగ్గా తీసిపారేస్తారేమోనని అని కొంచెం బిడియపడినట్లున్నాడు. ‘ఇది చాలా చిన్న మొత్తం’ అని కూడా ట్విటర్‌లో రాశాడు. అందుకు బదులుగా మోదీ ‘విరాళం విరాళమే. పెద్ద మొత్తం– చిన్న మొత్తం అని ఉండదు. గొప్ప ఫలితాన్ని సాధించడంలో ప్రతి చిన్న మొత్తమూ తనవంతు బాధ్యత నెరవేరుస్తుంది’ అని ట్వీట్ చేశారు.

### భవిష్యత్తు భద్రం

‘పీఎం కేర్స్ ఫండ్’కు ఒక స్టూడెంట్ ఇచ్చిన వెయ్యి రూపాయల విరాళానికి కృతజ్ఞతలు తెలుపుతూ... భావి పౌరుల చేతుల్లో దేశం భవిష్యత్తు భద్రంగా ఉంటుంది’ అన్నారు. టాటా ఇచ్చినంత విరాళం మనం ఇవ్వలేం. అలాగని ఏమీ ఇవ్వకుండా ఉండనూ లేము. దేశం చేస్తున్న ఆరోగ్యయజ్ఞంలో మనవంతుగా ఎంతో కొంత ఇవ్వాలని ఉన్న వాళ్లందరికీ ఈ ఐదొందల ఒక్క రూపాయి ఒక ధైర్యం. మనచేత విరాళం ఇప్పించగలిగిన భరోసా.

కరోనా కథ



## నాన్నా! మాస్క్ వేసుకున్నావా?

**క**రోనా కరోనా క రోనా... సోకితే దీనికి సరైన మందు లేదు కాబట్టి రాకుండా జాగ్రత్త పడటం మంచిదని ప్రతి ఒక్కరూ చెబుతున్నారు... ముఖానికి మాస్కులు ధరించడం, చేతులు శుభ్రం చేసుకోవటం, కాళ్లు కడుక్కోవటం వంటివి ఆ జాగ్రత్తలలో ప్రధానమైనవి. అయితే ఇలాంటి విషయాలలో పెద్దవాళ్లకంటే పిల్లలే ఒక అడుగు ముందున్నారేమో అనిపిస్తుంది. అందరి ఇళ్లల్లో సంగతి నాకు తెలియదు కానీ, మా ఇంట్లో మాత్రం నా భార్య, పిల్లలు ఇంటి దగ్గర ఉన్నంతసేపూ రోజూ హ్యాండ్ వాష్‌తో చేతులు కడిగించటం, బయటికి వెళ్లేటప్పుడు మాస్క్ తగిలించటం, ఆఫీసులో ఉన్నప్పుడు కూడా ఫోన్ చేసి మరీ నాన్నా మాస్క్ వేసుకుంటున్నావా అని అడగటం, నా బ్యాగ్‌లో హ్యాండ్ శానిటైజర్ పెట్టి అది నేను వాడానా లేదా అని చెక్ చేయటం చూస్తుంటే ముచ్చటేస్తోంది. అంతకుముందు నేను వాళ్లని స్కూల్ నుంచి రాగానే కాళ్లూ చేతులు కడుక్కునేదాకా ఇంటిలో ఏ వస్తువూ తాకనిచ్చేవాడిని కాదు. ఇప్పుడు కరోనా సెలవుల సందర్భంగా వాళ్లు ఇంట్లో ఉంటూ నా చేత ఆ పనులు చేయిస్తూ కసి తీర్చుకుంటున్నారు... అంటే సీన్ రివర్స్ అయిందన్నమాట! పోనీలే కరోనా పాపమా (పుణ్యమే అనాలేమో) ప్రతి ఒక్కరికీ శుచీశుభ్రతల గురించి అవగాహన కలిగింది.

– బాచి

epaper.sakshi.com

సాక్షి
# స్పోర్ట్స్
సోమవారం
30-3-2020

# మళ్లీ వేసవిలోనే ఒలింపిక్స్!

## నిర్వహణ తేదీలపై పలు అవకాశాలను పరిశీలిస్తోన్న ఐఓసీ




**టోక్యో:** వాయిదా పడిన టోక్యో ఒలింపిక్స్ 2021 వేసవి సీజన్‌లోనే జరిగే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. టోక్యో ఒలింపిక్స్ కార్యనిర్వాహక కమిటీ అధ్యక్షుడు యోషిరో మోరీ తాజాగా చేసిన వ్యాఖ్యలు ఇందుకు ఊతమిస్తున్నాయి. రాబోయే విశ్వక్రీడల షెడ్యూల్... 2020 గేమ్స్ కోసం చేసిన షెడ్యూల్ కన్నా భిన్నంగా ఏమీ ఉండబోదు అని మోరీ పేర్కొన్నారు. 'అందరూ ఒలింపిక్స్ వేసవి (జూన్–ఆగస్టు)లోనే జరగాలని కోరుకుంటారు. అందుకే మేం కూడా జూన్ నుంచి సెప్టెంబర్ మధ్యే విశ్వక్రీడల షెడ్యూల్ రూపొందించాలని ఆలోచిస్తున్నాం' అని మోరీ పేర్కొన్నట్లు స్థానిక న్యూస్ ఏజెన్సీ 'క్యోడో' ప్రకటించింది. ఈ ఏడాది జూలై 24 నుంచి ఆగస్టు 9 మధ్య జరగాల్సిన టోక్యో ఒలింపిక్స్ కరోనా కారణంగా వచ్చే ఏడాదికి వాయిదా పడ్డాయి. అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) అధ్యక్షుడు థామస్ బాచ్ మంగళవారం గేమ్స్ వాయిదా వేస్తున్నట్లు ప్రకటించిన సమయంలోనే... ఈ క్రీడల్ని వచ్చే ఏడాది మార్చి–మేలో నిర్వహించే అవకాశాలున్నట్లు సూచనప్రాయంగా పేర్కొన్నాడు. అయితే ఈ వారంలో భేటీ కానున్న 'ఒలింపిక్స్ కార్యనిర్వాహక కమిటీ' ఎగ్జిక్యూటివ్ సమావేశంలో క్రీడల నిర్వహణ తేదీలపై స్పష్టత వస్తుందని మోరీ స్పష్టం చేశారు. ఐఓసీ, స్థానిక నిర్వాహకులు, వందలాది స్పాన్సర్లు, క్రీడా సమాఖ్యలు, బ్రాడ్‌కాస్టర్లు అందరితో సంప్రదించి తుది నిర్ణయం తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. విశ్వ క్రీడల నిర్వహణ ఖర్చు గతంతో పోలిస్తే విపరీతంగా పెరుగుతుందని కమిటీ సీఈవో తోషిరో అన్నారు.

# వైద్య సహాయకురాలిగా హెథర్ నైట్

## ఎన్‌హెచ్‌ఎస్‌లో వలంటీర్‌గా చేరిన ఇంగ్లండ్ మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్




**లండన్:** ప్రపంచాన్ని విలవిల్లాడిస్తోన్న కరోనా వైరస్‌ను కట్టడి చేసేందుకు ప్రపంచవ్యాప్తంగా క్రీడా ప్రముఖులు విరాళాలు ఇచ్చేందుకు ముందుకు వస్తుంటే ఇంగ్లండ్ మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ హెథర్ నైట్ మరో అడుగు ముందుకు వేసి సేవ మార్గాన్ని ఎంచుకుంది. తమ దేశ 'జాతీయ ఆరోగ్య సేవా సంస్థ' (ఎన్‌హెచ్‌ఎస్)లో వలంటీర్‌గా సేవలందించేందుకు తన సభ్యత్వాన్ని నమోదు చేసుకున్నట్లు ఆమె తెలిపింది. యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే)లో ప్రాణాంతక వైరస్‌ను అరికట్టేందుకు నిరంతరం శ్రమిస్తోన్న వైద్య వ్యవస్థకు తన సహాయాన్ని అందించనున్నట్లు 29 ఏళ్ల హెథర్ నైట్ పేర్కొంది. ఇందులో భాగంగా ఆమె చికిత్సకు అవసరమైన మందుల రవాణా చేయడంతోపాటు కరోనా వైరస్ గురించి ప్రజల్లో అవగాహన కల్పించనుంది. 'ఎన్‌హెచ్‌ఎస్ వలంటీర్ పథకంలో నేను చేరాను. ప్రస్తుతం ఏ పనీ లేకుండా ఉన్నాను. నా దగ్గర బోలెడంత ఖాళీ సమయం ఉంది. సాధ్యమైనంత వరకు సేవ చేస్తా. నా సోదరుడు, అతని భార్య ఇద్దరూ డాక్టర్లే. ఇంకా నాకు ఎన్‌హెచ్‌ఎస్‌లో పనిచేసే స్నేహితులు కూడా ఉన్నారు. ఈ కఠిన పరిస్థితుల్లో రోగుల కోసం వైద్యులు ఎంత కష్టపడుతున్నారో చూస్తున్నాను. అందుకే వారికి సహాయపడాలని ఈ నిర్ణయం తీసుకున్నా' అని ప్రస్తుతం స్వీయ నిర్బంధంలో ఉన్న హెథర్ నైట్ వివరించింది. ఇటీవల ఆస్ట్రేలియాలో జరిగిన మహిళల టి20 ప్రపంచ కప్‌లో ఇంగ్లండ్ సెమీస్‌లో ఓడిపోయి ఇంటిదారి పట్టింది. అనంతరం హెథర్ యూకే నిబంధనల ప్రకారం ఐసోలేషన్‌లోకి వెళ్లింది. ప్రస్తుతం యూకేలో 14,543కి పైగా కోవిడ్–19 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో బుధవారం వలంటీర్ పథకాన్ని ప్రవేశపెట్టగా... 5 లక్షల మంది ఇందులో సభ్యత్వం కోసం దరఖాస్తు చేసుకున్నారు.

# ఈ విరామం ఊహించలేదు

**సాక్షి, హైదరాబాద్:** కరోనాతో ప్రస్తుతం ఏర్పడిన కల్లోల వాతావరణం త్వరలోనే తగ్గుముఖం పడుతుందని... పరిస్థితులు చక్కబడతాయని ఆంధ్రప్రదేశ్ చెస్ గ్రాండ్‌మాస్టర్, ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్ ద్రోణవల్లి హారిక అభిప్రాయపడింది. క్రీడాకారుల కెరీర్‌లో ఖాళీ సమయం చాలా తక్కువ సందర్భాల్లో దొరుకుతుందని... ఊహించని విధంగా లభించిన విరామ సమయాన్ని ప్రణాళికతో సద్వినియోగం చేసుకుంటున్నానని ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో మూడుసార్లు కాంస్య పతకాలు నెగ్గిన హారిక తెలిపింది. స్విట్జర్లాండ్‌లో జరిగిన 'ఫిడే' మహిళల గ్రాండ్‌ప్రి చెస్ టోర్నీలో పాల్గొని తిరిగొచ్చిన హారిక హోం క్వారంటైన్‌లోకి వెళ్లింది. ఆదివారంతో స్వీయ నిర్బంధం పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా 'సాక్షి'తో పంచుకున్న అభిప్రాయాలు ఆమె మాటల్లోనే...


స్విట్జర్లాండ్ గ్రాండ్‌ప్రి టోర్నీ సందర్భంగా...

"స్విట్జర్లాండ్‌లోని లుసానేలో మార్చి 1 నుంచి 13 వరకు జరిగిన 'ఫిడే' మహిళల గ్రాండ్‌ప్రి చెస్ టోర్నమెంట్‌లో పాల్గొన్నాను. 14వ తేదీన స్విట్జర్లాండ్ నుంచి హైదరాబాద్‌కు తిరిగి వచ్చాను. కరోనా కట్టడికి ప్రభుత్వం రూపొందించిన నిబంధనల ప్రకారం నేను విదేశం నుంచి రావడంతో స్వీయ నిర్బంధంలోకి వెళ్లిపోయాను. ఆదివారంతో అధికారికంగా నా సెల్ఫ్ క్వారంటైన్ గడువు పూర్తయింది. అంతా సవ్యంగా ఉందని జీహెచ్‌ఎంసీ అధికారులు స్వయంగా వచ్చి ధ్రువీకరించారు. స్వీయ నిర్బంధం ముగిసినా నేను ఇంట్లోనే ఉంటున్నాను. లాక్‌డౌన్‌ను పాటిస్తున్నాను. కొంతకాలం నుంచి విరామం లేకుండా టోర్నమెంట్‌లు ఆడుతున్నాను. స్విట్జర్లాండ్ నుంచి వచ్చాక నాలుగైదు రోజులపాటు ఒకే గదికి పరిమితమయ్యాను. ఆటకు వారం రోజులపాటు బ్రేక్ ఇచ్చాను. క్వారంటైన్ పూర్తవ్వడంతో మళ్లీ చెస్‌పై దృష్టి పెట్టాను. అయితే అంత సీరియస్‌గా ప్రాక్టీస్ చేయడంలేదు. శారీరకంగా, మానసికంగా ఫిట్‌గా ఉండటం కోసం వ్యాయామం, యోగా చేస్తున్నాను. ఆగస్టులో మాస్కోలో జరగాల్సిన ప్రతిష్టాత్మక చెస్ ఒలింపియాడ్ వచ్చే ఏడాదికి వాయిదా పడింది. ప్రపంచ వ్యాప్తంగా కరోనా కల్లోలం కారణంగా దాదాపు అన్ని క్రీడాంశాల్లో టోర్నీలు రద్దు కావడం లేదంటే వాయిదా పడటం జరిగింది. ఈ ఏడాది నా తదుపరి టోర్నీ ఏంటనే విషయం ప్రస్తుతం నాకే తెలియదు. ఒక్కసారిగా ఊహించని విధంగా ఇంత సమయం విరామం లభిస్తుందని ఊహించలేదు. పెళ్లయ్యాక నేను తొలిసారి నాలుగైదు నెలలు ఇంటివద్దే ఉండే పరిస్థితులు ఏర్పడ్డాయి. అంతర్జాతీయ స్థాయిలో కొన్నాళ్లపాటు చాలా గందరగోళ పరిస్థితులు ఉంటాయి. కరోనా కట్టడి అయ్యాక అంతా సర్దుకోవడానికి కొంత సమయం పడుతుంది. ఆ తర్వాత అంతా సాఫీగా సాగిపోతుందని ఆశాభావంతో ఉన్నాను. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో మనమందరం మంచే జరుగుతుందనే ఆశావహ దృక్పథంతో ఉండాలి. అయితే కరోనా సృష్టించిన భయం కారణంగా కొన్నాళ్లపాటు విదేశీ ప్రయాణాలు చేయడానికి అందరూ ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తారు. నేను స్విట్జర్లాండ్ వెళ్లినపుడు అక్కడ కరోనా సీరియస్‌గా లేదు. తిరిగి వచ్చాక పరిస్థితి తీవ్రరూపం దాల్చింది. టోర్నీ జరుగుతున్న సమయంలో కుటుంబసభ్యులు, శ్రేయోభిలాషులు ఫోన్ చేసి జాగ్రత్తగా ఉండమని సూచించారు. టోర్నీ జరుగుతున్న సమయంలో నేను కూడా వేదిక వద్దకు వెళ్లడం, గేమ్ పూర్తికాగానే వెంటనే హోటల్ గదికి చేరుకోవడం చేశాను. ప్రపంచ వ్యాప్తంగా క్రీడా పోటీలు నిలిచిపోయిన దశలో మాస్కోలో క్యాండిడేట్స్ చెస్ టోర్నీని నిర్వహించడం వివాదాస్పదమైంది. అయితే రష్యాలో కరోనా మరీ తీవ్రంగా లేకపోవడంతో అప్పటి పరిస్థితులనుబట్టి 'ఫిడే' ఈ నిర్ణయం తీసుకుందని భావిస్తున్నాను. అయితే ఏడు రౌండ్లు ముగిశాక రష్యా ప్రభుత్వం అంతర్జాతీయ విమానాల రాకపోకలను నిషేధిస్తున్నట్లు ప్రకటించడంతో టోర్నీని మధ్యలో నిలిపేశారు. కరోనా విలయతాండవం చేస్తున్న చైనా, ఇటలీ దేశాలకు సంబంధించి నాకు మంచి జ్ఞాపకాలు ఉన్నాయి. చైనాలోనే నేను గ్రాండ్‌మాస్టర్ హోదా సంపాదించాను. ఐదేళ్ల క్రితం రోమ్‌లో వరల్డ్ బ్లిట్జ్ ఆన్‌లైన్ చాంపియన్ షిప్ టైటిల్ గెల్చుకున్నాను. అయితే ఇటలీలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు కలచివేస్తున్నాయి. అన్ని చోట్లా అందరూ కరోనా నుంచి తొందరగానే కోలుకోవాలని, అంతటా సాధారణ పరిస్థితులు నెలకొనాలని కోరుకుంటున్నాను."


హైదరాబాద్‌లో భర్త కార్తీక్ చంద్రతో హారిక

- కొన్నాళ్లు క్రీడారంగంపై ప్రభావం
- ఆలస్యమైనా పరిస్థితులు చక్కబడతాయి
- చెస్ గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక

# వేతనం వదులుకునేందుకు రొనాల్డో సై



**రోమ్:** కరోనా సంక్షోభంతో ప్రపంచమే స్తంభించిపోయింది. ఆర్థికం, వర్తకం, వాణిజ్యం, క్రీడా రంగం ఇలా ఏ రంగాన్ని మహమ్మారి వదల్లేదు. ఈ నేపథ్యంలో సాకర్ లీగ్‌లు జరగకపోవడంతో ఇటలీలోని విఖ్యాత క్లబ్ యువెంటస్ ఆర్థిక ఇబ్బందులను గుర్తించిన సాకర్ స్టార్లు తమ వేతనాల కోతకు అంగీకరించారు. అత్యధిక పారితోషికం అందుకున్న పోర్చుగల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డో అధిక మొత్తం కోతకు సిద్ధపడ్డాడు. కోటీ 10 లక్షల డాలర్లు (రూ. 83 కోట్లు) వదులుకునేందుకు అతను అంగీకరించాడు. అతనితో మిగతా ఆటగాళ్లు, కోచ్ మారిజియో సారి కూడా కోతకు సమ్మతించారు. దీంతో మొత్తంమీద 100 మిలియన్ డాలర్లు (రూ.754 కోట్లు) మేర క్లబ్‌కు ఆదా కానుంది. ఇది యువెంటస్ క్లబ్‌కు లభించిన పెద్ద మొత్తం ఊరట. కష్టకాలంలో తమ ఆటగాళ్లు వేతనాల కోతతో క్లబ్‌కు అండగా నిలిచారని యువెంటస్ క్లబ్ హర్షం వెలిబుచ్చింది.

# కరోనాపై పోరుకు రహానే విరాళం

**ముంబై:** 'కరోనా' సృష్టించిన విపత్కర పరిస్థితులను దేశం సమర్థంగా ఎదుర్కొనేందుకు క్రీడా లోకం బాసటగా నిలుస్తోంది. భారత టెస్టు జట్టు వైస్ కెప్టెన్ అజింక్య రహానే మహారాష్ట్ర ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ కోసం ఆదివారం రూ. 10 లక్షలు విరాళమిచ్చాడు. మరోవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెరో రూ. 50 లక్షలు ఇవ్వనున్నట్లు కర్ణాటక రాష్ట్ర క్రికెట్‌సంఘం (కేఎస్‌సీఏ) ప్రకటించింది. స్టార్ ప్లేయర్లకు దీటుగా వర్ధమాన క్రీడాకారులు తమ ఉదారతను చాటుకున్నారు. 16 ఏళ్ల భారత మహిళా క్రికెటర్ రిచా ఘోష్... బెంగాల్ ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం లక్ష రూపాయల విరాళమిచ్చింది. మరోవైపు హైదరాబాద్ టీనేజ్ షూటర్, 15 ఏళ్ల ఇషా సింగ్ ప్రధానమంత్రి సహాయ నిధికి తన సేవింగ్స్ నుంచి రూ. 30 వేలు విరాళంగా ఇచ్చింది. వీరితో పాటు రెండు సార్లు ఆసియా పారా గేమ్స్ హైజంప్ చాంపియన్ శరద్ పవార్ (రూ. 1 లక్ష), మొహమ్మదాన్ స్పోర్టింగ్ క్లబ్ ప్రతినిధి దీపక్ సింగ్ (రూ. 2 లక్షలు), మాజీ టెస్టు క్రికెటర్ మితు ముఖర్జీ (రూ. 25,000), బెంగాల్ మహిళల కోచ్ జయంత ఘోష్ (రూ. 10,000) విరాళం ఇచ్చారు.


రూ. 10 లక్షలు కేటాయించిన భారత క్రికెటర్
ముందుకొచ్చిన పలువురు క్రీడాకారులు

# కరోనా విరాళం

**కరోనా వైరస్ విజృంభిస్తున్న నేపథ్యంలో సినిమా తారలు సహాయం చేయడానికి ముందుకు వస్తున్నారు, సినిమా కార్మికుల కోసం ఇటీవలే "సీసీసీ మన కోసం" (కరోనా క్రైసిస్ చారిటి మనకోసం) ఏర్పాటు చేశారు ఇండస్ట్రీ ప్రముఖులు. ఇప్పటికే పలువురు తారలు విరాళాలిచ్చారు. ఆదివారం విరాళం ప్రకటించిన వారి వివరాలు.**






- రవితేజ (20 లక్షలు)
- వరుణ్ తేజ్ (20 లక్షలు)
- 'దిల్' రాజు, శిరీష్ (10 లక్షలు)
- శర్వానంద్ (15 లక్షలు)
- సాయిధరమ్ తేజ్ (10 లక్షలు)
- విశ్వక్ సేన్ (5 లక్షలు)
- 'వెన్నెల' కిశోర్ (2 లక్షలు)
- సంజయ్ (25 వేలు)

## సినిమా


కీర్తి సురేశ్, నితిన్

# అర్జున్.. అను వచ్చేశారు

'భీష్మ' వంటి హిట్ చిత్రం తర్వాత నితిన్ హీరోగా నటిస్తున్న తాజా సినిమా 'రంగ్ దే'. కీర్తి సురేశ్ కథానాయికగా నటిస్తున్నారు. వెంకీ అట్లూరి దర్శకత్వంలో పీడీవీ ప్రసాద్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. నేడు నితిన్ పుట్టినరోజు సందర్భంగా మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ చిత్రంలో అర్జున్ పాత్రలో నితిన్, అను పాత్రలో కీర్తి సురేశ్ నటిస్తున్నారు. ఈ పాత్రలను పరిచయం చేస్తూ మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ చిత్రానికి కెమెరా: పి.సి. శ్రీరామ్, సంగీతం: దేవిశ్రీ ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్. వెంకటరత్నం (వెంకట్).

## పుట్టినరోజు వేడుకల్లేవ్.. పెళ్లి వాయిదా

కరోనా వైరస్ ప్రభావం నేపథ్యంలో నేడు తన పుట్టినరోజు వేడుకల్ని జరుపుకోవడం లేదని, ఏప్రిల్ 16న దుబాయ్‌లో జరగాల్సిన పెళ్లిని కూడా వాయిదా వేశానని నితిన్ తెలిపారు. ఇంకా ఆయన మాట్లాడుతూ– ''ప్రస్తుతం దేశంలో ఎలాంటి ఆందోళనకర పరిస్థితులున్నాయో మీకు తెలుసు. లాక్‌డౌన్ కొనసాగుతుండటంతో నేడు నా పుట్టినరోజుని జరుపుకోకూడదని నిర్ణయించుకున్నాను. ఎక్కడా కూడా నా జన్మదిన వేడుకలు జరపవద్దు. నా పెళ్లిని కూడా వాయిదా వేసుకుంటున్నాను. ఈ సంక్షోభ సమయంలో మనం ఇళ్లల్లో కాలు మీద కాలేసుకొని కూర్చొని, మన కుటుంబంతో గడుపుతూ బయటకు రాకుండా ఉండటమే దేశానికి సేవ చేసినట్లు'' అన్నారు.

# ప్రపంచంలో ఎన్నో కష్టాలున్నాయి


పూరి జగన్నాథ్

''ఈ లాక్‌డౌన్ పీరియడ్ చాలా కష్టంగా ఉంది. స్వతంత్రం పోయింది. బయటికెళదామంటే పోలీసులు లాఠీలతో కొడుతున్నారు. తెచ్చిన సరుకులు ఎన్ని రోజులు వస్తాయో తెలీదు.. చాలా కష్టాలు పడుతున్నాం. మనలాంటి కష్టాలు ప్రపంచంలో చాలా ఉన్నాయి.. కొన్ని చెబుతా'' అంటున్నారు పూరి జగన్నాథ్. ఆయన చెప్పిన విషయాలు ఈ విధంగా...

- 2011లో ప్రారంభమైన సిరియా యుద్ధం 2019 వరకూ సాగింది. సిరియా మొత్తం నాశనం అయింది.. లక్షల మంది చచ్చిపోయారు. ఎక్కడికి వెళ్లాలో తెలియక ఆ శిథిలాల మధ్య పెళ్లాం పిల్లలతో బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు.
- నైజీరియాలో ఓ టెర్రరిస్ట్ గ్రూప్ 2009లో ఓ యుద్ధం ప్రారంభించింది.. అక్కడ కూడా లక్షల మంది చచ్చిపోయారు. 2014లో ఒక స్కూల్ నుంచి 300 మంది అమ్మాయిల్ని కిడ్నాప్ చేశారు. ప్రపంచంలోనే అతి పెద్ద కిడ్నాప్ అది. చాలా మందిని మానభంగం చేశారు. తప్పించుకోవాలని చూసినవాళ్లని చంపేశారు. మిగిలిన వాళ్లు 2019లో వారి ఇంటికి చేరారు. ఇన్నేళ్లు ఆ అమ్మాయిలు కానీ వారి ఇంట్లో వాళ్లు కానీ ఎంత ఏడ్చి ఉంటారు.
- బంగ్లాదేశ్ నుంచి ఇండియాకి బతకాలనే స్ఫూర్తితో వచ్చేవారు కొందరైతే, చెడు చేయాలనుకునేవారు మరికొందరు. వాళ్లు బోర్డర్‌లో రక్షణ కంచె దాటుతుంటారు. మన బీఎస్‌ఎఫ్ జవాన్లు వాళ్లని కాల్చేస్తుంటారు. మహిళలు, పిల్లల మృతదేహాలు ఉంటాయక్కడ.
- అనాథపిల్లలదీ అదే పరిస్థితి. పిల్లల్ని కని తుప్పల్లోనో, చెత్తకుప్పల్లోనే పడేస్తుంటారు. అటువంటి వారి సంఖ్య ప్రతి రోజూ దాదాపు ఐదు నుంచి ఆరువేలు ఉంటుంది. వారిలో ఎంత మంది బతికారో, ఎంతమంది పాలు లేక చచ్చిపోయారో, ఎందర్ని దత్తత తీసుకున్నారో ఆ దేవుడికే తెలుసు. భారతదేశ ప్రభుత్వం గత లెక్కల ప్రకారం చూస్తే నాలుగు కోట్ల మంది అనాథలు ఇండియాలో ఉన్నారు. వాళ్ల పరిస్థితి చాలా దారుణంగా ఉంటుంది.
- సియాచిన్ అనే మంచు కొండపైన మైనస్ 50 –60 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటుంది. అక్కడ మన సైనికులు కాపలా కాస్తూ ఇండియాని రక్షిస్తుంటారు. అక్కడ ఎక్కడానికే వాళ్లకి చాలా రోజులు పడుతుంది. తినడానికి మూడు పూటలా తిండి కూడా ఉండదు. మాట్లాడేందుకు ఫోన్ సిగ్నల్స్ కూడా సరిగ్గా ఉండవు. హెలీకాప్టర్‌లో తీసుకెళ్లి ఆహారం కిందికి జారవిడుస్తుంటారు. అది వాళ్లకి అందిందో లోయలో పడిందో తెలియని పరిస్థితి. అయినా ఎన్నో ఏళ్లుగా క్లిష్టమైన పరిస్థితుల్లో ఉద్యోగం చేస్తూనే ఉన్నారు.

అలా ప్రపంచంలో ఇన్ని కష్టాలు, ఎన్నో దరిద్రాలు ఉంటే.. వాటితో పోలిస్తే మన లాక్‌డౌన్ అన్నది నథింగ్.. ఏప్రిల్ 14కి లాక్‌డౌన్ అయిపోతుందనుకోవద్దు.. మే 1కి వెళ్లొచ్చు, జూన్ 1కి వెళ్లొచ్చు. అందుకు సిద్ధపడి ఉండండి. దయచేసి అందరూ లాక్‌డౌన్‌కి సహకరిద్దాం.

# అంతా బాగానే ఉంది




రాధికా ఆప్టే

'జాగ్రత్త మేడమ్. జాగ్రత్తలు పాటించండి' అంటూ రాధికా ఆప్టే అభిమానులు ట్వీటర్ ద్వారా ఆమెకు జాగ్రత్తలు చెప్పారు. అసలు విషయం ఏంటంటే... తన తాజా సినిమా చిత్రీకరణ నిలిచిపోవడంతో లండన్‌లో ఉంటున్న భర్త బెనెడిక్ట్‌తో టైమ్ స్పెండ్ చేయడానికి వెళ్లారామె. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె పోస్ట్ చేసిన ఓ ఫొటో చర్చకు దారి తీసింది. ముఖానికి మాస్క్ ధరించి ఆస్పత్రిలో వేచి చూస్తున్న తన ఫొటోని పోస్ట్ చేసి, ''ఆస్పత్రికి వచ్చాను.. అయితే భయపడాల్సిందేమీ లేదు. కోవిడ్ 19 గురించి కాదు లెండి. అంతా బాగానే ఉంది'' అని పేర్కొన్నారు. కరోనా గురించి కాకపోయినా ఆస్పత్రికి వెళ్లారు కాబట్టి వేరే ఏదైనా ఆరోగ్య సమస్య ఉండి ఉంటుందని ఫాలోయర్స్ ఆమెకు జాగ్రత్తలు చెప్పారు.

# నిర్మాత ప్రసాద్ కన్నుమూత



ప్రముఖ దర్శకుడు సుకుమార్ స్నేహితుడు, ఆయన మేనేజర్ వి.ఇ.వి.కె.డి.ఎస్. ప్రసాద్ శనివారం గుండెపోటుతో మరణించారు. ప్రసాద్ 'అమరం అఖిలం ప్రేమ' అనే సినిమా నిర్మించారు. ఆయనకు భార్య పద్మజ, కుమార్తెలు సాయి ప్రణీత, సత్య ప్రజీత ఉన్నారు. ప్రసాద్ మరణ వార్త విన్న సుకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ''నేను ఏ కాస్త నిరుత్సాహంలో ఉన్నా ప్రసాద్‌తో మాట్లాడగానే ఎనర్జీ వచ్చేది. తన మరణం నాకు చాలా లోటు. తన స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరు'' అంటూ ప్రసాద్ కుటుంబానికి సుకుమార్ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

**విచారం:** సాక్షి ఆదివారం సంచిక సినిమా వార్తల్లో 'న్యూ కట్' శీర్షికతో వచ్చిన వార్తలో తప్పిదం జరిగింది. ఒక సామాజిక వర్గాన్ని ప్రస్తావించే సామెతను ఈ వార్తలో ఉపయోగించడం వెనుక సంబంధిత రిపోర్టర్‌కు ఎటువంటి దురుద్దేశం లేనప్పటికీ, అలా వాడటాన్ని పొరపాటుగానే మేము భావిస్తున్నాము. అందుకు తీవ్రంగా చింతిస్తున్నాము.

– ఎడిటర్

# నేను బాగానే ఉన్నాను


గౌతమి

''కమల్ హాసన్ క్వారంటైన్‌లో ఉన్నారు'' అనే వార్తలు శనివారం తమిళనాడులో హల్ చల్ చేశాయి. దానికి కారణం కమల్ హాసన్ నివాసం వద్ద 'గృహ నిర్బంధంలో ఉన్నారు' అనే స్టికర్ కనిపించడమే. అయితే 'ఆ ఇంట్లో నేను ఉండటం లేదు. ప్రస్తుతం మా పార్టీ కార్యక్రమాలను నిర్వహించడానికి ఉపయోగిస్తున్నాం. నేను గృహ నిర్బంధంలో లేను. కానీ సామాజిక దూరం పాటిస్తున్నాను'' అని అధికారిక ప్రకటన విడుదల చేసి అభిమానుల అనుమానాలను క్లియర్ చేశారు కమల్. అయితే 'గృహ నిర్బంధంలో ఉన్నారు'' అనే స్టికర్ అంటించడానికి కారణం వేరే ఉందట. కమల్ హాసన్ తో కొన్నేళ్లు సహజీవనం చేసిన గౌతమి ఈ నెల మొదటివారంలో దుబాయ్ నుంచి తిరిగి వచ్చారట. ఆమె పాస్‌పోర్టులో కమల్ పాత నివాస గృహానికి సంబంధించిన అడ్రెస్ ఉండటంతో ప్రభుత్వ ప్రతినిధులు ఆ ఇంటికి స్టికర్ అంటించారట. అసలు విషయం అది. ఇక గౌతమి తన గురించి మాట్లాడుతూ –''నేను బాగానే ఉన్నాను. దుబాయ్ నుంచి తిరిగి వచ్చినప్పటి నుంచి ఇంట్లోనే ఉంటున్నాను. మీరందరు కూడా ఇంట్లోనే ఉండాలని కోరుకుంటున్నాను. ప్రభుత్వం చెప్పిన సూచనలను పాటిద్దాం'' అని ట్వీటర్ ద్వారా పేర్కొన్నారు గౌతమి.

సాక్షి భవిత
సోమవారం నుంచి శుక్రవారం వరకు
స్పర్ధయా వర్ధతే విద్య
సోమవారం 30-3-2020

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

## ఉద్యోగ సమాచారం

### ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలో పోస్టులు

తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఒప్పంద ప్రాతిపదిక వైద్య నిపుణులు, సిబ్బంది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **పోస్టుల వివరాలు:** డాక్టర్లు, నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తులకు చివరి తేది:** 3 ఏప్రిల్ 2020
» **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** http://health.telangana.gov.in

### ఎయిమ్స్ బీబీ నగర్‌లో టీచింగ్ పోస్టులు

పుదుచ్చేరిలోని జిప్‌మర్... తెలంగాణ (బీబీ నగర్)లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)లో ఒప్పంద ప్రాతిపదికన టీచింగ్‌పోస్టుల భరీకి దరఖాస్తులు కోరుతోంది.



» **మొత్తం పోస్టుల సంఖ్య:** 53
» **పోస్టుల వివరాలు:** ప్రొఫెసర్–06, అడిషనల్ ప్రొఫెసర్–13, అసోసియేట్ ప్రొఫెసర్–11, అసిస్టెంట్ ప్రొఫెసర్–23.
» **విభాగాలు:** అనాటమీ, బయోకెమిస్ట్రీ, ఫిజియాలజీ, ఫార్మకాలజీ, పీడియాట్రిక్స్, రేడియో డయాగ్నసిస్ తదితరాలు.
» **అర్హత:** సంబంధిత స్పెషలైజేషన్‌లో పోస్టు గ్రాడ్యుయేట్ డిగ్రీ ఉత్తీర్ణత, టీచింగ్ అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక జరుగుతుంది.
» **దరఖాస్తు విధానం:** ఈమెయిల్/ ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తుకు చివరి తేది:** 27.04.2020
» **వెబ్‌సైట్:** https://www.jipmer.edu.in

### ఐజీఐబీలో ప్రాజెక్ట్ స్టాఫ్

ఢిల్లీలోని సీఎస్ఐఆర్–ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జీనోమిక్స్ అండ్ ఇంటిగ్రేటివ్ బయాలజీ(ఐజీఐబీ) ఒప్పంద ప్రాతిపదికన పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 11
» **పోస్టుల వివరాలు:** ఫీల్డ్ డేటా కలెక్టర్, ల్యాబ్ టెక్నీషియన్, ప్రాజెక్ట్ మేనేజర్, డేటా అనలిస్ట్, జేఆర్ఎఫ్.
» **అర్హతలు:** పోస్టును అనుసరించి సంబంధిత సబ్జెక్టుల్లో డిప్లొమా, బీఎస్సీ, బీటెక్/ఎంఎస్సీ(లైఫ్ సైన్స్), పీహెచ్‌డీ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక జరుగుతుంది.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తుకు చివరితేది:** 30.04.2020
» **వెబ్‌సైట్:** https://www.igib.res.in

## కెరీర్ కౌన్సెలింగ్

» ఇంటర్మీడియెట్ బైపీసీ పూర్తిచేశాను. హెచ్‌సీయూ ఎంఎస్సీ చేయాలను కుంటున్నాను. అడ్మిషన్ ప్రక్రియ ఎలా ఉంటుంది.. బైపీసీ విద్యార్థులకు హెచ్‌సీయూ అందించే కోర్సుల వివరాలు తెలపండి? – మహేష్

✦ ఇంటర్ బైపీసీ అర్హతతో హెచ్‌సీయూ అందించే ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ కోర్సులో చేరొచ్చు. బైపీసీ విద్యార్థులకు ఫిజిక్స్, కెమికల్ సైన్సెస్, సిస్టమ్స్ బయాలజీ, ఆప్టోమెట్రీ అండ్ విజన్ సైన్సెస్ స్పెషలైజేషన్స్ అందుబా




టులో ఉన్నాయి. ఔత్సాహికులు నోటిఫికేషన్‌ను అనుసరించి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించి ప్రవేశాలను ఖరారు చేస్తారు. వీటితోపాటు హెచ్‌సీయూ ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయోకెమిస్ట్రీ, ప్లాంట్ బయాలజీ అండ్ బయోటెక్నాలజీ, బయోటెక్నాలజీ, మాలిక్యులర్ బయాలజీ, యానిమల్ బయోటెక్నాలజీ, హెల్త్ సైకాలజీ స్పెషలైజేషన్స్‌తో ఎంఎస్సీ కోర్సును ఆఫర్‌చేస్తోంది. ఈ కోర్సుల్లో ప్రవేశానికి సదరు సబ్జెక్టుల్లో గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణత తప్పనిసరి.

ఎంసెట్ ప్రత్యేకం
✦ స్టడీమెటీరియల్
✦ బిట్ బ్యాంక్
✦ ఆన్‌లైన్ టెస్టులు
✦ మోడల్ పేపర్స్
✦ ప్రీవియస్ పేపర్స్
విద్య, ఉద్యోగ సమాచారం కోసం
WWW.SAKSHIEDUCATION.COM
SAKSHI CURRENT AFFAIRS యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి

## హయ్యర్ ఎడ్యుకేషన్



# పీజీఈసెట్ 2020

# ఇంజనీరింగ్, ఫార్మసీ ఉన్నత విద్యకు మార్గం

పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్.. సంక్షిప్తంగా.. పీజీఈసెట్! ఇది పీజీ స్థాయిలో.. ఎంటెక్/ఎంఈ, ఎంఫార్మసీ కోర్సుల్లో.. ప్రవేశానికి నిర్వహించే పరీక్ష!! బీటెక్, బీఫార్మసీ విద్యార్థులు ఈ ప్రవేశ పరీక్షలో మంచి ర్యాంకు సొంతం చేసుకుంటే.. కోరుకున్న కాలేజీల్లో ఎంటెక్,ఎంఫార్మసీల్లో చేరే అవకాశం లభిస్తుంది! తమకు సరితూగే స్పెషలైజేషన్‌తో ఎంటెక్/ఎంఫార్మసీ పూర్తిచేసుకుంటే.. ఉద్యోగాన్వేషణలో ముందుకు దూసుకుపోవచ్చు.
తెలుగు రాష్ట్రాల్లో పీజీఈసెట్ నోటిఫికేషన్‌లు విడుదలయ్యాయి. ఈ నేపథ్యంలో.. పీజీఈసెట్‌ల పరీక్ష స్వరూపం, సీట్ల భర్తీ గురించి తెలుసుకుందాం...

- రెండు తెలుగు రాష్ట్రాల్లో పీజీఈసెట్ 2020 నోటిఫికేషన్‌లు విడుదల
- పలు స్పెషలైజేషన్లలో ఆన్‌లైన్ విధానంలో ప్రవేశ పరీక్ష
- మంచి ర్యాంకుతో కోరుకున్న కాలేజీలో ఎంటెక్, ఎంఫార్మసీలో చేరే అవకాశం

దేశవ్యాప్తంగా ఉన్న ఐఐటీలు, ఎన్ఐటీలు, ఇతర ప్రముఖ ఇన్‌స్టిట్యూట్స్‌లో ఎంటెక్‌లో చేరాలంటే.. జాతీయ స్థాయిలో గేట్‌లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. అలాగే రాష్ట్ర స్థాయిలోని యూనివర్సిటీ క్యాంపస్ ఇంజనీరింగ్ కళాశాలలు, ఇతర ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్స్‌లో ఎంటెక్‌లో చేరేందుకు అవకాశం కల్పించే పరీక్ష పీజీఈసెట్(పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్). 2020–21 విద్యా సంవత్సరానికి సంబంధించి రెండు తెలుగు రాష్ట్రాల్లో పీజీఈసెట్–2020 షెడ్యూల్ విడుదలైంది.

ఇందులో ర్యాంకు ఆధారంగా ఎంఈ/ఎంటెక్/ఎంఫార్మసీ/మాస్టర్ ఆఫ్ ఆర్కిటెక్చర్/ ఫార్మ్–డి(పోస్ట్ బాక్యులరేట్) కోర్సుల్లో ప్రవేశం కల్పిస్తారు.

### అర్హత

బీటెక్/బీఈ/బీఫార్మసీ/బీఆర్క్ సంబంధిత కోర్సులు 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత.

### పీజీఈసెట్

ఏపీ పీజీఈసెట్‌ను మొత్తం పదమూడు విభాగాల్లో(ఫార్మసీతో కలిపి) పలు పేపర్లలో నిర్వహించనున్నారు. ఈ అభ్యర్థులు బీటెక్‌లో తాము చదివిన బ్రాంచ్ ఆధారంగా సంబంధిత పేపర్లలో పరీక్షకు హాజరయ్యే అవకాశం ఉంది. ఇదే విధంగా తెలంగాణ పీజీ ఈసెట్ కూడా ఇదే తరహాలో జరగనుంది.

### ఎంఫార్మసీకి కూడా పీజీఈసెట్

బీఫార్మసీ పూర్తిచేసిన విద్యార్థులకు అందుబాటులో ఉన్న ఉన్నత విద్యావకాశం.. ఎంఫార్మసీ. ఈ కోర్సులో ప్రవేశానికి కూడా పీజీఈసెట్‌లో ర్యాంకు సొంతం చేసుకోవాలి. ఆ ర్యాంకు ఆధారంగా ఎంఫార్మసీలో అందుబాటులో ఉండే పలు స్పెషలైజేషన్లలో అడుగు పెట్టొచ్చు.

### పరీక్ష ఆన్‌లైన్ విధానం

ఏపీ పీజీఈసెట్ పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో జరుగుతుంది. ప్రశ్న పత్రం ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటుంది. మొత్తం 120 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు ఒక్కో మార్కు కేటాయిస్తారు.

టీఎస్ పీజీఈసెట్ పరీక్ష కూడా 120 మార్కులకు ఆన్‌లైన్ విధానంలో ఆబ్జెక్టివ్ తరహాలోనే నిర్వహిస్తారు.

### అందుబాటులోని సీట్లు

గతేడాది గణాంకాల ప్రకారం–ఎంటెక్/ఎంఈ/ఎంఫార్మసీ కోర్సుల్లో రెండు రాష్ట్రాల్లో కలిపి అందుబాటులో ఉన్న సీట్ల సంఖ్య దాదాపు 35 వేలు. పీజీఈసెట్‌లో ర్యాంకు ఆధారంగా వెబ్ కౌన్సెలింగ్ విధానంలో సీట్లు భర్తీ చేస్తారు.

### గేట్, జీప్యాట్‌లకు తొలి ప్రాధాన్యం

ఎంటెక్, ఎంఫార్మసీ సీట్ల భర్తీ విషయంలో జాతీయ స్థాయిలో నిర్వహించే గేట్, జీప్యాట్ పరీక్షల ఉత్తీర్ణులకు తొలి ప్రాధాన్యం ఇస్తారు. అంటే.. ముందుగా గేట్ ర్యాంకర్లు ఎంపిక చేసుకున్న సీట్లను భర్తీ చేస్తారు. ఆ తర్వాత మిగిలిన సీట్లను పీజీఈసెట్ ర్యాంకు ఆధారంగా ప్రవేశం కల్పిస్తారు.

కాబట్టి గేట్‌కు హాజరు కాకుండా.. కేవలం పీజీఈసెట్ ద్వారానే సీటు పొందాలనుకునే విద్యార్థులు మరింత ఎక్కువ కృషి చేయాల్సి ఉంటుంది.

### బీటెక్ స్థాయి ప్రశ్నలు

రెండు గంటల వ్యవధిలో నిర్వహించే పీజీఈసెట్‌లో అడిగే ప్రశ్నలన్నీ బీటెక్ స్థాయిలోనే ఉంటాయి. అప్లికేషన్ ఓరియెంటేషన్ ప్రశ్నలు అడుగుతారు. కాబట్టి విద్యార్థులు ప్రిపరేషన్ పరంగా ప్రాక్టీస్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి.

కేవలం బుక్ రీడింగ్‌కే పరిమితం కాకుండా.. ఒక సమస్యను పలు కోణాల్లో పరిష్కరించే నేర్పు సొంతం చేసుకోవాలి. దీనికి కూడా పరిష్కారం ప్రాక్టీస్. ప్రతిరోజు కనీసం నాలుగు గంటలు చొప్పున ప్రిపరేషన్‌కు కేటాయించాలి. ముఖ్యంగా తృతీయ, చివరి సంవత్సరం సబ్జెక్ట్‌లపై ఎక్కువ దృష్టి పెట్టాలి.

### ఆన్‌లైన్ విధానంపై అవగాహన

మొదటిసారి ఆన్‌లైన్ పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు ఈ విధానంపైనా ముందుగా అవగాహన ఏర్పరచుకోవాలి. ఫలితంగా పరీక్ష హాల్లో అందుబాటులో ఉండే సమయంలో తమకు వచ్చిన అన్ని ప్రశ్నలకు తడబాటు లేకుండా సమాధానం ఇచ్చే అవకాశం లభిస్తుంది. ఆన్‌లైన్ మాక్ టెస్ట్‌లు, ఆన్‌లైన్ ప్రాక్టీస్ టెస్ట్‌లకు హాజరు కావాలి. ముఖ్యంగా పీజీఈసెట్ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచే మాక్ టెస్ట్ సదుపాయాన్ని వినియోగించుకోవడం వల్ల మరింత ప్రయోజనకరంగా ఉంటుంది.

### సబ్జెక్ట్ పేపర్ల ఎంపిక

పీజీఈసెట్ అభ్యర్థులు తాము ఎంపిక చేసుకునే పేపర్ల విషయంలో కూడా అప్రమత్తంగా వ్యవహరించాలి. వాస్తవానికి కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విద్యార్థులకు సంబంధిత పేపర్‌తో పాటు మరికొన్ని పేపర్లకు కూడా అర్హత ఉంటుంది. అర్హత ఉన్న పేపర్లలో తమకు బాగా అవగాహన, నైపుణ్యం ఉన్న పేపర్‌ను ఎంపిక చేసుకోవడం వల్ల సత్ఫలితాలు ఆశించొచ్చు. ఇలా పేపర్ ఎంపిక నుంచి పరీక్ష రోజు వరకు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తే విజయావకాశాలు మెరుగవుతాయి.

### పీజీ ఈసెట్ పేపర్లు

ఏరోస్పేస్ ఇంజనీరింగ్; బయోమెడికల్ ఇంజనీరింగ్; కెమికల్ ఇంజనీరింగ్; కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ; ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్; ఫుడ్ టెక్నాలజీ; ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, మెటలర్జీ; ఫార్మసీ, ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్; బయోటెక్నాలజీ; సివిల్ ఇంజనీరింగ్; ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్; ఎన్విరాన్‌మెంటల్ మేనేజ్‌మెంట్; జియో ఇంజనీరింగ్ అండ్ జియో ఇన్ఫర్మాటిక్స్; మెకానికల్ ఇంజనీరింగ్; మైనింగ్ ఇంజనీరింగ్, నానో టెక్నాలజీ; టెక్స్‌టైల్ టెక్నాలజీ.

### దరఖాస్తు విధానం

పీజీఈసెట్ అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లోనే అందజేయాల్సి ఉంటుంది. సంబంధిత వెబ్‌సైట్‌లో లాగిన్ ఐడీ క్రియేట్ చేసుకోవాలి. ఆ తర్వాత నిర్దేశిత ఫీజును ఆన్‌లైన్ బ్యాంకింగ్ విధానంలో లేదా ఇతర ఆన్‌లైన్ విధానాల్లో చెల్లించాలి.

### ఏపీ పీజీఈసెట్-2020 ముఖ్య తేదీలు/ సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** ఓసీ, ఓబీసీ అభ్యర్థులకు రూ.1000(ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు రూ.500)
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ:** మార్చి 9 నుంచి ఏప్రిల్ 9 వరకు(రూ.500 ఆలస్య రుసుముతో ఏప్రిల్ 10 నుంచి 12 వరకు; రూ. 2,000 ఆలస్య రుసుముతో ఏప్రిల్ 13 నుంచి 15 వరకు; రూ. 5000 ఆలస్య రుసుముతో ఏప్రిల్ 16 నుంచి ఏప్రిల్ 18 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు)
- **ఆన్‌లైన్ దరఖాస్తు పొరపాట్లు సరిదిద్దుకునే అవకాశం:** ఏప్రిల్ 10 నుంచి ఏప్రిల్ 19 వరకు.
- **హాల్ టికెట్ డౌన్‌లోడ్:** ఏప్రిల్ 25 నుంచి
- **పీజీఈసెట్ పరీక్ష తేదీలు:** మే 2 నుంచి మే 4 వరకు (పతిరోజు ఉదయం 10 నుంచి 12 గంటల వరకు; మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు పరీక్ష జరుగుతుంది). అభ్యర్థులు దరఖాస్తు సమయంలోనే తమకు నచ్చిన తేదీ, సమయం ప్రాధాన్యాన్ని పేర్కొనాలి.
- **ఫలితాలు, ర్యాంకుల వెల్లడి:** మే 14, 2020.
- **వివరాలకు వెబ్‌సైట్:** https://sche.ap.gov.in/PGECET

### టీఎస్ పీజీఈసెట్ ముఖ్య తేదీలు/ సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** ఓసీ, ఓబీసీ అభ్యర్థులకు రూ.1000 (ఎస్సీ, ఎస్టీ, వికలాంగ అభ్యర్థులకు రూ. 500)
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ:** మార్చి 12 నుంచి ఏప్రిల్ 30 వరకు (రూ.500 ఆలస్య రుసుముతో మే 6వ తేదీ వరకు; రూ.2,000 ఆలస్య రుసుముతో మే 13వ తేదీ వరకు; రూ.5000 ఆలస్య రుసుముతో మే 20వ తేదీ వరకు దరఖాస్తు; రూ.10,000 ఆలస్య రుసుముతో మే 26 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.)
- **హాల్ టికెట్ డౌన్‌లోడ్:** మే 20 నుంచి 27 వరకు
- **పీజీఈసెట్ పరీక్ష తేదీలు:** మే 28 నుంచి మే 31 వరకు (పతి రోజు ఉదయం 10 నుంచి 12 గంటల వరకు; మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు పరీక్ష జరుగుతుంది). అభ్యర్థులు దరఖాస్తు సమయంలోనే తమకు నచ్చిన తేదీ, సమయం ప్రాధాన్యాన్ని పేర్కొనాలి.
- **ఫలితాలు, ర్యాంకుల వెల్లడి:** జూన్ 15, 2020
- **వివరాలకు వెబ్‌సైట్:** https://pgecet.tsche.ac.in



నోటిఫికేషన్

# ఏపీ ఎడ్‌సెట్-2020

సమాజంలో ఉపాధ్యాయులది మహోన్నతమైన స్థానం. అలాంటి ఉత్కృష్టమైన ఉపాధ్యాయ వృత్తిలో చేరేందుకు వీలుకల్పించే కోర్సు.. బీఈడీ(బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్). 2020-21 విద్యాసంవత్సరంలో ఆంధ్రప్రదేశ్‌లో బీఈడీ కోర్సుల్లో ప్రవేశాలకు ఏపీ ఎడ్‌సెట్-2020 (ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్) నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో... ఏపీ ఎడ్‌సెట్‌కు అర్హతలు, దరఖాస్తు, పరీక్ష విధానం, సిలబస్‌పై ప్రత్యేక సమాచారం..

### బీఈడీ కోసం ఏపీ ఎడ్‌సెట్

బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్(బీఈడీ) కోర్సు కాల వ్యవధి రెండేళ్లు. బీఈడీ కోర్సుల్లో ప్రవేశం పొందాలంటే.. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఎడ్‌సెట్)రాయాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని బీఎడ్ కళాశాల్లో ప్రవేశాల కోసం రాష్ట్ర ఉన్నత విద్యామండలి తరపున ఆంధ్ర యూనివర్సిటీ ఏపీ ఎడ్‌సెట్ 2020 పరీక్షను నిర్వహిస్తోంది. దీనిద్వారా రాష్ట్రంలోని అన్ని కళాశాలల్లో ఉన్న బీఈడీ సీట్లను భర్తీ చేస్తారు.

### అర్హతలు

✦ ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఏదైనా డిగ్రీ(బీఏ/బీఎస్సీ/బీఎస్సీ (హోంసైన్స్)/బీకాం/బీసీఏ/బీబీఎంలో కనీసం 50 శాతం మార్కులు సాధించాలి. డిగ్రీలో 50 శాతం మార్కులు రాకుంటే పీజీలోనైనా కనీసం 50శాతం మార్కులతో తెచ్చుకోవాలి. అదేవిధంగా బ్యాచిలర్ ఆఫ్ ఇంజనీరింగ్/టెక్నాలజీ(మ్యాథ్స్, సైన్స్ స్పెషలైజేషన్) కోర్సుల అభ్యర్థులకు కూడా కనీసం 55 శాతం మార్కులు రావాలి. ✦ ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు 40శాతం మార్కులు సాధిస్తే సరిపోతుంది. ✦ప్రస్తుతం డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నవారు కూడా దరఖాస్తుకు అర్హులే.

✦ **వయసు:** జూలై 01, 2020 నాటికి 19 ఏళ్లు నిండి ఉండాలి.

### పరీక్ష విధానం

ఏపీ ఎడ్‌సెట్ పరీక్ష ఆన్‌లైన్ విధానంలో 150 మార్కులకు జరుగుతుంది. ప్రశ్న పత్రంలో మూడు విభాగాలు పార్ట్–ఏ,పార్ట్–బీ, పార్ట్–సీ ఉంటాయి. ప్రశ్నలు ఆబ్జెక్టివ్ తరహాలో అడుగుతారు. పరీక్ష సమయం మూడు గంటలు.

### పార్ట్- ఏ.. జనరల్ ఇంగ్లిష్

ఈ విభాగంలో జనరల్ ఇంగ్లిష్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. మొత్తం 25 ప్రశ్నలకు గాను 25 మార్కులు ఉంటాయి. జనరల్ ఇంగ్లిష్‌కు సంబంధించి రీడింగ్ కాంప్రహెన్షన్, కరెక్షన్ ఆఫ్ సెంటెన్స్, ఆర్టికల్స్, ప్రిపొజిషన్, టెన్సెస్, స్పెలింగ్స్, వొక్యాబులరీ, సినానిమ్స్, ఆంటోనిమ్స్, ట్రాన్స్‌ఫర్మేషన్ ఆఫ్ సెంటెన్స్, సింపుల్, కాంపౌండ్, కాంప్లెక్స్ సెంటెన్సెస్, డైరెక్ట్, ఇన్ డైరెక్ట్ స్పీచ్ వంటి వాటిపై దృష్టిపెట్టాలి. ఇందులో ఎక్కువగా పదోతరగతి స్థాయిలో ప్రశ్నలు అడుగుతారు. కాబట్టి పదోతరగతి ఇంగ్లిష్‌పై ఎక్కువ దృష్టిసారిస్తే మంచిది.

### పార్ట్ -బీ: జీకే, టీచింగ్ అప్టిట్యూడ్

✦ ఇందులో జనరల్ నాలెడ్జ్(జీకే), టీచింగ్ అప్టిట్యూడ్ నుంచి ప్రశ్నలు అడుగుతారు.

✦ **జనరల్ నాలెడ్జ్:** ఈ విభాగం నుంచి 15 ప్రశ్నలను–15 మార్కులకు అడుగుతారు. ఇందులో అభ్యర్థుల పరిశీలనాత్మక గుణం తెలుసుకునే విధంగా ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది. అందు కోసం ప్రస్తుతం రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పరిణామాలపై ప్రశ్నలు ఎదురవుతాయి. అలాగే వివిధ దేశాల కరెన్సీలు, రాజధానులు, భౌగోళిక, సంస్కృతి అంశాలపై ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది. ఇవే కాకుండా ప్రపంచ కట్టడాలు, రాష్ట్ర, దేశ, ప్రపంచ ప్రతిష్ఠాత్మక అవార్డులు.. వాటిని అందుకున్న వ్యక్తుల గురించి ప్రశ్నలు అడిగే వీలుంది. కాబట్టి అభ్యర్థులు చుట్టూ జరుగుతున్న పరిణామాలపై అవగాహన పెంచుకునేందుకు నిత్యం వార్తా పత్రికలు చదువుతుండాలి. ఎప్పటికప్పుడు జాతీయ, అంతర్జాయ పరిణామాలు తెలుసుకోవాలి.

✦ **టీచింగ్ ఆప్టిట్యూడ్:** ఈ విభాగం నుంచి 10 ప్రశ్నలను–10 మార్కులకు అడుగుతారు. దీనిలో జనరల్ ఇంటెలిజెన్స్, కమ్యూనికేషన్ సామర్థ్యం, ఉపాధ్యాయుడికి ఉండాల్సిన లక్షణాలు, పాటించాల్సిన పద్ధతులు, పిల్లలతో ఏవిధంగా మెలగాలి తదితర అంశాలపై ప్రశ్నలను అడిగే అవకాశం ఉంటుంది.

### పార్ట్-సీ.. మెథడాలజీ 100 మార్కులు

పార్ట్–సీలో అభ్యర్థులు అర్హత పరీక్ష విభాగానికి సంబంధించిన ప్రశ్నలు అడుగుతారు. ఈ విభాగం నుంచి 100 ప్రశ్నలకుగాను 100 మార్కులకు పరీక్షను నిర్వహిస్తారు. దీంట్లో అభ్యర్థులు మ్యాథమెటిక్స్, ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్, సోషల్ స్టడీస్, ఇంగ్లిష్‌ల్లో ఏదో ఒక సబ్జెక్టును ఎంచుకోవాల్సి ఉంటుంది.

### మ్యాథమెటిక్స్(ఎంఎస్)

ఈ సబ్జెక్టును ఎంపిక చేసుకునే అభ్యర్థులు బీఏ/బీఎస్సీలో మ్యాథ్స్ సబ్జెక్టును కలిగి ఉండాలి. బీఈ/బీటెక్ అర్హత కలిగిన వారు ఆ స్థాయిలో మ్యాథ్స్ సబ్జెక్టు చదివి ఉండాలి. అలాగే బీసీఏ అభ్యర్థులు ఇంటర్మీడియట్ స్థాయిలో మ్యాథ్స్ సబ్జెక్టు చదవాలి. మ్యాథ్స్‌కు సంబంధించి 100 ప్రశ్నలు–100 మార్కులకు పరీక్ష జరుగుతుంది.

### ఫిజికల్ సైన్సెస్(ఫిజిక్స్, కెమిస్ట్రీ)

✦ ఈ సబ్జెక్టును ఎంపిక చేసుకునే వారు బీఎస్సీలో ఫిజిక్స్, కెమిస్ట్రీ చదివి ఉండాలి. బీఈ/బీటెక్ అభ్యర్థులు బ్యాచిలర్ కోర్సు స్థాయిలో ఫిజిక్స్, కెమిస్ట్రీ కలిగి ఉండాలి. బీసీఏ అభ్యర్థులు ఇంటర్మీడియట్ స్థాయిలో ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులు చదవాలి. ఫిజికల్ సైన్స్ సబ్జెక్టుకు సంబంధించి 100 మార్కులకు గాను ఫిజిక్స్ నుంచి 50 ప్రశ్నలు, కెమిస్ట్రీ నుంచి 50 ప్రశ్నలు వస్తాయి.

### బయలాజికల్ సైన్స్(బోటనీ, జువాలజీ)

✦ ఈ సబ్జెక్టును ఎంపిక చేసుకునే అభ్యర్థులు బీఎస్సీ/బీఎస్సీ(హోంసైన్స్)లో బోటనీ, జువాలజీ కలిగి ఉండాలి. ✦ ఈ సబ్జెక్టుకు సంబంధించి బోటనీ నుంచి 50 ప్రశ్నలు, జువాలజీ నుంచి 50 ప్రశ్నలు.. మొత్తం 100 మార్కులకు పరీక్ష ఉంటుంది.

### సోషల్ స్టడీస్

✦ ఈ సబ్జెక్టును ఎంపిక చేసుకునే బీఏ/బీకాం/బీబీఎం/బీబీఏ అభ్యర్థులు ఇంటర్మీడియట్ స్థాయిలో సోషల్ సైన్స్ సబ్జెక్టు చదివి ఉండాలి.
✦ సోషల్ స్టడీస్‌కి సంబంధించి జాగ్రఫీ 35 ప్రశ్నలు–35 మార్కులు; హిస్టరీ 30 ప్రశ్నలు–30 మార్కులు; సివిక్స్ 15 ప్రశ్నలు–15 మార్కులు; ఎకనామిక్స్ 20 ప్రశ్నలు–20 మార్కులకు మొత్తం 100 ప్రశ్నలకు 100 మార్కులు ఉంటాయి.

### ఇంగ్లిష్(స్పెషల్ ఇంగ్లిష్ ఇన్ బీఏ)

✦ ఈ సబ్జెక్టును ఎంపిక చేసుకునే అభ్యర్థులు బీఏలో స్పెషల్ ఇంగ్లిష్/ఆప్షనల్ ఇంగ్లిష్ /ఇంగ్లిష్ లిటరేచర్ లేదా ఎంఏ ఇంగ్లిష్ పూర్తి చేసి ఉండాలి. దీంట్లో నుంచి 100 ప్రశ్నలకు గాను 100 మార్కులకు పరీక్ష ఉంటుంది.

### కటాఫ్ మార్కులు

ఎడ్‌సెట్‌లో పరీక్షల్లో 25శాతం మార్కులు సాధించాలి. మొత్తం 150 మార్కులకు గాను కనీసం 37 మార్కులను సాధించిన వారు అర్హులు అవుతారు.

### రిజర్వేషన్

ఈ పరీక్ష ద్వారా రాష్ట్రంలోని మొత్తం సీట్లలో 85 శాతం లోకల్ అభ్యర్థులకు రిజర్వ్ చేస్తారు. అలాగే నాన్ లోకల్‌కు 15 శాతం రిజర్వ్ చేస్తారు.

### దరఖాస్తు ఫీజు

✦ జనరల్ అభ్యర్థులు రూ.600, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులు రూ.400 దరఖాస్తు ఫీజుగా చెల్లించాలి.
✦ రూ.500 ఆలస్య రుసుముతో 27.04.2020 వరకు చెల్లించవచ్చు.

### ముఖ్యమైన సమాచారం

✦ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
✦ **దరఖాస్తుకు చివరి తేదీ:** 24.04.2020
✦ **హాల్ టికెట్ల డౌన్‌లోడ్:** 04.05.2020
✦ **పరీక్ష తేదీ:** 09.05.2020
✦ **వెబ్‌సైట్:** https://sche.ap.gov.in

### ప్రిపరేషన్ పక్కాగా

✦ అభ్యర్థులు ప్రిపరేషన్ మొదలుపెట్టే ముందు పరీక్ష విధానం, సిలబస్ గురించి క్షుణ్నంగా తెలుసుకోవాలి. సిలబస్ గురించి పూర్తిగా తెలుసుకున్న తర్వాతనే ప్రిపరేషన్ ప్రారంభించాలి. ప్రిపరేషన్‌కు ముందు గత పరీక్షల్లో ప్రశ్నలు అడిగిన విధానంపై అభ్యర్థులు దృష్టి పెట్టాలి.
✦ పరీక్ష ప్రిపరేషన్‌కి సమయ ప్రణాళిక చాలా ముఖ్యం. తమకు తాము ప్రతీ సబ్జెక్టుకు సంబంధించి ఒక టైం టేబుల్‌ను తయారు చేసుకోవాలి. దాని ప్రకారం మొదటి ప్రాధాన్య అంశంగా కష్టమైన అంశాలపై దృష్టి పెట్టాలి. ఆపై సులభమైన అంశాలకు వెళ్లే విధంగా ప్రిపరేషన్ ప్రణాళికను రూపొందించుకోవాలి.
✦ ఎడ్‌సెట్ పరీక్ష అనేది విద్యార్థులకు బోధించే ఉపాధ్యాయ వృత్తికి సంబంధించిన పరీక్ష. కాబట్టి ఉపాధ్యాయ వృత్తిపై అభ్యర్థికి నిజంగా ఆసక్తి ఉందా? లేదా? అనే విషయాన్ని తెలుసుకునేలా ప్రశ్నలు అడుగుతారు.
✦ సబ్జెక్టులపై లోతైన అవగాహన కోసం యూట్యూబ్‌తోపాటు, ఇతర ఆన్‌లైన్ సబ్జెక్టు నిపుణుల వీడియోలు వీక్షించొచ్చు.
రివిజన్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి. ఒక సబ్జెక్టు చదవడం పూర్తయిన తర్వాత మళ్లీ మళ్లీ రివిజన్ చేస్తుండటం మేలు చేస్తుంది.
✦ ఎంపిక చేసుకున్న సబ్జెక్టును బట్టి అభ్యర్థులు 8వ తరగతి నుంచి డిగ్రీస్థాయి సిలబస్ వరకు ప్రిపేర్ కావాలి.

# సరిహద్దులను మూసేయండి

- రాష్ట్రాలు, జిల్లాల బోర్డర్లను మూసేయాలని కేంద్రం ఆదేశాలు
- వలస కూలీల ప్రయాణాలతో కరోనా వ్యాప్తి ముప్పు
- 1,024కి చేరిన కేసులు
- కొత్తగా 8 వైరస్ మరణాలు
- పత్రికల సరఫరాకు అంతరాయం కలిగించొద్దంటూ ప్రభుత్వం ఆదేశాలు

**న్యూఢిల్లీ:** వలస కూలీల ద్వారా కరోనా వైరస్ వ్యాప్తి జరగకుండా అడ్డుకోవడం కోసం దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, జిల్లాల సరిహద్దులను మూసేయాలని కేంద్రం ఆదివారం ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాలను ఉల్లంఘించి సరిహద్దులను దాటేందుకు ప్రయత్నించిన వారిని 14 రోజుల పాటు క్వారంటైన్‌లో ఉంచాలని స్పష్టం చేసింది. అయితే, కేంద్రం కఠినమైన ఆదేశాలను జారీ చేసినప్పటికీ.. వేల సంఖ్యలో ఉపాధి కరువైన వలస కూలీలు మూకుమ్మడిగా నగరాల నుంచి తమ స్వస్థలాలకు కాలినడక సహా తమకు వీలైన అన్ని మార్గాల ద్వారా వెళ్లేందుకు ప్రయత్నిస్తూనే ఉన్నారు. మరోవైపు, దేశంలో కరోనా కేసుల సంఖ్య వెయ్యి దాటింది. దేశవ్యాప్తంగా కోవిడ్‌–19 కేసుల సంఖ్య ఆదివారం సాయంత్రానికి 1,024 అని, మరణాల సంఖ్య 27 అని కేంద్ర ఆరోగ్య శాఖ ప్రకటించింది. గత 24 గంటల్లో భారత్‌లో 8 మరణాలు, చోటు చేసుకున్నాయని ప్రకటించింది. ఇప్పటివరకు మహారాష్ట్రలో 6, గుజరాత్‌లో 5, కర్ణాటకలో 3, మధ్యప్రదేశ్‌లో 2, ఢిల్లీలో 2, జమ్మూకశ్మీర్లో 2, తెలంగాణ, కేరళ, తమిళనాడు, బిహార్, పంజాబ్, పశ్చిమబెంగాల్, హిమాచల్‌ ప్రదేశ్‌ల్లో ఒక్కొక్కటి చొప్పున మరణాలు చోటు చేసుకున్నాయి. కాగా,


కుటుంబాలతో సహా తమ గ్రామాలకు వెళ్లేందుకు ఢిల్లీలోని లాల్‌ క్వార్టర్‌ బస్టాండ్‌ వద్ద బస్సుల కోసం వేచి చూస్తున్న వలస కార్మికులు

ఆదివారం కొత్తగా నమోదైన కేసుల్లో స్పైస్‌జెట్‌ పైలట్‌ ఒకరు కూడా ఉన్నారు. అయితే, ఆయనకు మార్చి నెలలో అంతర్జాతీయ ప్రయాణాలు చేసిన చరిత్ర లేకపోవడం గమనార్హం. లాక్‌డౌన్‌ కారణంగా, ఇళ్లకే పరిమితమై పలువురు మానసిక సమస్యలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో.. నిమ్హాన్స్‌ 08046110007 అనే టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేసిందన్నారు.

**వలస కూలీల విషాదం:** కరోనా సమస్య దేశంలో మరో సంక్షోభానికి కారణమైంది. వైరస్‌ వ్యాప్తి ప్రమాదమున్నప్పటికీ.. దేశవ్యాప్తంగా వేలాదిగా వలస కూలీలు తమ స్వస్థలాలకు వెళ్లేందుకు ఆంక్షల నడుమనే ప్రయత్నిస్తున్నారు. ముఖ్యంగా, ఢిల్లీ– యూపీ సరిహద్దులు, కేరళ, మహారాష్ట్రల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. మధ్యప్రదేశ్‌కు చెందిన ఒక కూలి ఢిల్లీ నుంచి స్వస్థలానికి వెళ్లేందుకు 200 కిమీలు నడిచి, ఉత్తరప్రదేశ్‌లో గుండెపోటుతో మరణించిన విషాదం ఆదివారం చోటు చేసుకుంది. ‘ఏదో వైరస్‌ అందరినీ చంపేస్తుందని అంటున్నారు. నాకవేమీ తెలియదు. ఇక్కడ ఉంటే నా పిల్లలకు అన్నం పెట్టలేకపోతున్నా. ఆ వైరస్‌తో చావడం కన్నా ముందు ఆకలితో చనిపోయేలా ఉన్నాం’ అని ఢిల్లీలో కూలి పనులు చేసుకునే సావిత్రి ఆవేదన వ్యక్తం చేసింది. మథుర హైవే మీదుగా 400 కిమీల దూరంలో యూపీలో ఉన్న తమ స్వగ్రామానికి కాలి నడకనైనా సరే వెళ్లేందుకు ఆమె తన పిల్లలతో కలిసి పయనమైంది. ఢిల్లీ–యూపీ సరిహద్దుల్లో వేలాదిగా కూలీలు, ఇతర సామాన్యులు తమ ఊర్లకు వెళ్లేందుకు హైవేపై నిలిచి ఉన్నారు. ఈ సామూహిక ప్రయాణాలతో వైరస్‌ మరింత ప్రబలే ప్రమాదముందని కేంద్రం భావిస్తున్న నేపథ్యంలో అన్ని రాష్ట్రాలు, జిల్లాల సరిహద్దుల్లో లాక్‌డౌన్‌ కొనసాగినంత కాలం ప్రయాణికుల రాకపోకలను నిలిపేయాలని కేంద్ర కేబినెట్‌ సెక్రటరీ రాజీవ్‌ గౌబా, కేంద్ర హోంశాఖ కార్యదర్శి అజయ్‌ భల్లా అన్ని రాష్ట్రాల డీజీపీలు, చీఫ్‌ సెక్రటరీలను ఆదేశించారు. అయితే, అత్యవసర, అత్యవసరం కాని వస్తువులనే భేదం చూపకుండా సరుకులు సరఫరా చేసే అన్ని వాహనాలను అనుమతించాలని అజయ్‌ భల్లా స్పష్టం చేశారు. దిన పత్రికల సరఫరాకు కూడా అంతరాయం కలిగించకూడదన్నారు. సామాన్యులు, దినసరి కూలీల నుంచి ఇంటి అద్దె డిమాండ్‌ చేయవద్దని యజమానులను ఒక ప్రకటనలో ప్రభుత్వం కోరింది. సామాన్యులు, విద్యార్థులు, ఇతర కూలీలను అద్దె ఇళ్లను ఖాళీ చేయాలని ఒత్తిడి చేస్తే.. వారిపై కఠిన చర్యలుంటాయని స్పష్టం చేసింది. ఇతర రాష్ట్రాల కూలీలకు భోజన, వసతి, ఇతర సౌకర్యాలు కల్పిస్తామని ఢిల్లీ, మహారాష్ట్ర తదితర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించాయి.

**ప్రధాని సమీక్ష**

కరోనాపై పోరు కోసం తీసుకున్న చర్యల గురించి ప్రధాని మోదీ స్వయంగా సమీక్షిస్తున్నారు. పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, గవర్నర్లు, ఆరోగ్య మంత్రులు, వైద్య నిపుణులు సహా ప్రతీ రోజు దాదాపు 200 మంది నుంచి ఆయన వివరాలు తెలుసుకుంటున్నారు.

## అంబులెన్స్‌ సిబ్బందికి ప్రామాణిక మార్గదర్శకాలు



కరోనా బాధితులను ఆసుపత్రులకు తరలించే విషయంలో అంబులెన్స్‌ సిబ్బందికి కేంద్ర ఆరోగ్య శాఖ ఆదివారం ప్రామాణిక మార్గదర్శకాలు జారీ చేసింది. అంబులెన్స్‌ డ్రైవర్లకు, సాంకేతిక ఇబ్బందికి ఇవి వర్తిస్తాయి. బాధితులను ఆసుపత్రులకు తరలిస్తుండగా వీరు సైతం కరోనా బారినపడుతున్నట్లు ఆరోగ్య శాఖ గుర్తించింది. అంబులెన్స్‌ల్లో అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. వీటిలో పని చేసే వారంతా తప్పనిసరిగా వ్యక్తిగత రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొంది. ఈ మేరకు ఆధునిక రక్షణ పరికరాలు ఉపయోగించాలని స్పష్టం చేసింది. అంబులెన్స్‌లోని రోగికి, అతడి సహాయకుడికి మూడు పొరల మాస్కులు, గ్లోవ్స్‌ అందుబాటులో ఉంచాలని ఆదేశించింది. కోవిడ్‌–19 కేసులను ఎలా గుర్తించాలన్న దానిపై ఒక నమూనా ప్రశ్నావళిని ఆరోగ్యశాఖ విడుదల చేసింది. ఎక్కడికక్కడ ప్రైవేట్‌ అంబులెన్స్‌ల జాబితా రూపొందించాలని, వాటిని కేంద్రీకృత కాల్‌ సెంటర్‌తో అనుసంధానించాలని, తద్వారా అంబులెన్స్‌ అందుబాటు సమయాన్ని గరిష్టంగా 20 నిమిషాలకు తగ్గించాలని పేర్కొంది. గుర్తింపు పొందిన అంబులెన్స్‌లనే కరోనా బాధితుల రవాణాకు ఉపయోగించాలని తేల్చి చెప్పింది.

## క్లుప్తంగా...



### ఎలక్ట్రిక్‌ బైక్‌ అంబులెన్స్‌

**సాక్షి ప్రతినిధి, చెన్నై:** అంబులెన్స్‌ సేవల్లో మరో ముందడుగు వేస్తూ మదురై కేఎల్‌ఎస్‌ ఇంజినీరింగ్‌ కళాశాల ఆటోమొబైల్‌ విభాగం ప్రొఫెసర్‌ మహమ్మద్‌ జమీన్‌ ఎలక్ట్రిక్‌ బైక్‌ అంబులెన్స్‌ను తయారు చేశారు. ఇప్పటికే వాడకంలో ఉన్న బైక్‌ అంబులెన్స్‌లు ప్రాథమిక చికిత్సకు మాత్రమే పనికొస్తాయని జమీన్‌ తెలిపారు. ఎలక్ట్రిక్‌ బైక్‌ అంబులెన్స్‌ ద్వారా రోగిని సురక్షితంగా ఆస్పత్రికి తరలించే అన్ని సౌకర్యాలు ఉన్నాయన్నారు. నాలుగు గంటల పాటు చార్జ్‌ చేస్తే 80 కిలోమీటర్ల దూరం ప్రయాణించవచ్చన్నారు. ఈ–బైక్‌ కాపీరైట్‌లను పొందిన తర్వాత ఆటోమేటిక్‌ బైక్‌ అంబులెన్స్‌ల తయారీకి ప్రణాళికను రూపొందించామని ఆయన తెలిపారు.

### కదలనున్న పార్సిల్‌ రైళ్లు..

**న్యూఢిల్లీ:** కరోనా కారణంగా ఈ నెల 22 నుంచి రైళ్లు నిలిచిపోయిన సంగతి తెలిసిందే. అయితే కూరగాయల వంటి అత్యవసర సరుకులను రవాణా చేసేందుకు రైల్వే శాఖ కొన్ని పార్సిల్‌ వ్యాన్లను నడిపేందుకు సిద్ధమైంది. ఈ పార్సిల్‌ ఎక్స్‌ప్రెస్‌ రైళ్లు ఢిల్లీ–గువాహటి, ఢిల్లీ–ముంబై, ఢిల్లీ–కళ్యాణ్, ఢిల్లీ–హౌరా, చండీగఢ్‌–జైపూర్, మోగా–ఛంగ్సారి మార్గాల్లో తిరుగుతాయి. ఈ రైళ్లలో కూరగాయలు, పాల ఉత్పత్తులు, మందులు, చేపలు వంటివి రవాణా అవుతాయని అధికారులు చెప్పారు.

### పీఎం కేర్‌కు రైల్వే విరాళం

**న్యూఢిల్లీ:** కరోనాను ఎదుర్కొనేందుకు ప్రధాని మోదీ ప్రారంభించిన ట్రస్టుకు విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. రైల్వే శాఖ తరఫున రూ. 151 కోట్లు మోదీ ట్రస్టుకు అందిస్తున్నట్లు రైల్వే మంత్రి పియూష్‌ గోయల్, ఆ శాఖ సహాయక మంత్రి చేసిన ఓ ట్వీట్‌ను షేర్‌ చేశారు.
- పీఎంకేర్‌ ఫండ్‌కు జిందాల్‌ సంస్థ రూ.100 కోట్లను విరాళంగా ప్రకటించింది.
- పారా మిలటరీ దళాల విరాళం 116 కోట్లు.

### జుకర్‌బర్గ్‌ విరాళం187 కోట్లు

**హూస్టన్:** కరోనా వైరస్‌ బారినపడి ప్రపంచ వ్యాప్తంగా వేలాది మంది మరణిస్తుండడం పట్ల ఫేస్‌బుక్‌ వ్యవస్థాపకుడు మార్క్‌ జుకర్‌బర్గ్, ఆయన భార్య ప్రిస్కిలా చాన్‌ ఆందోళన వ్యక్తం చేశారు. కరోనా నివారణపై పరిశోధనలకు ఆ ఫౌండేషన్‌కు 25 మిలియన్‌ డాలర్ల (రూ.187.19 కోట్లు) విరాళం ప్రకటించారు.

### జర్మనీలో మంత్రి ఆత్మహత్య

**ఫ్రాంక్‌ఫర్ట్:** కరోనా వైరస్‌ ప్రత్యక్షంగానే కాదు.. పరోక్షంగానూ ప్రాణాలను బలిగొంటోంది. కరోనా కాటుకు ఆర్థిక పరిస్థితి అతలాకుతలం కావడంతో దాన్ని ఎలా ఎదుర్కోవాలో అర్థం కాక జర్మనీలోని హెస్సీ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి థామస్‌ షాఫర్‌(54) బలవన్మరణానికి పాల్పడ్డారు. ఆయన శనివారం రైలు పట్టాలపై నిర్జీవంగా కనిపించారు. జర్మనీ వాణిజ్య రాజధాని ఫ్రాంక్‌ఫర్ట్‌ నగరం హెస్సీ రాష్ట్రంలోనే ఉంది. దేశంలో ప్రముఖ బ్యాంకుల కేంద్ర స్థానం ఈ నగరమే. కరోనా వల్ల హెస్సీలో వ్యాపార, వాణిజ్య సంస్థలు మూతపడ్డాయి. షాఫర్‌ పదేళ్లుగా రాష్ట్ర ఆర్థిక మంత్రి సేవలందిస్తున్నారు. భవిష్యత్తులో పరిస్థితి మరింత భయానకంగా ఉండబోతోందని భావించి, తనువు చాలించినట్లు తెలుస్తోంది.

### మద్యం దొరక్క ఆరుగురి బలవన్మరణం

**రాయచూరు రూరల్‌/బనశంకరి/త్రిసూర్:** లాక్‌డౌన్‌ వల్ల మద్యం ప్రియులు అల్లాడిపోతున్నారు. మద్యం లభించకపోవడంతో తట్టుకోలేక ఆరుగురు ప్రాణాలు తీసుకుంటున్నారు. కర్ణాటకలో శని, ఆదివారాల్లో నలుగురు మందుబాబులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. అదేవిధంగా, కేరళలో ఇద్దరు వ్యక్తులు మద్యం దొరక్క ఆదివారం బలవన్మరణానికి పాల్పడ్డారు.

# గాలి పీల్చుకోండి!

- 90 నగరాల్లో తగ్గుతున్న వాయు కాలుష్యం, ఢిల్లీలో 30% తగ్గుదల

దేశం లాకౌట్‌లో ఉంది.
వాహనాల రణగొణధ్వనులు లేవు
పరిశ్రమలు తాత్కాలికంగా మూతబడ్డాయి
రహదారులు నిర్మానుష్యంగా మారాయి
దీంతో నీలాకాశం నిర్మలంగా ఉంది
గాలి హాయిగా పీల్చుకునే పరిస్థితి వచ్చింది

**న్యూఢిల్లీ:** గుండెల నిండా స్వచ్ఛమైన గాలి పీల్చడానికి కూడా ఇన్నాళ్లు మనం నోచుకోలేదు. ప్రపంచంలోనే వాయు కాలుష్యం అధికంగా ఉన్న నగరాల జాబితాలో భారత్‌ టాప్‌ పొజిషన్‌లో ఉంది. ఇప్పుడు కరోనా భయంతో దేశవ్యాప్తంగా లాక్‌డౌన్‌ ప్రకటించడంతో వాయు కాలుష్యం కాస్త తగ్గింది. దేశవ్యాప్తంగా 90 నగరాల్లో వాయు కాలుష్యం చాలా తగ్గిందని కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎయిర్‌ క్వాలిటీ అండ్‌ వెదర్‌ ఫోర్‌కాస్టింగ్‌ అండ్‌ రీసెర్చ్‌ (ఎస్‌ఎఫ్‌ఏఆర్‌) సంస్థ వెల్లడించింది. ఈ సంస్థ అందించిన వివరాల ప్రకారంలో గాలిలో సూక్ష్మాతి సూక్ష్మ ధూళి కణాలు, నైట్రోజన్‌ ఆక్సైడ్‌ భారీగా తగ్గినట్టుగా ఎస్‌ఏఎఫ్‌ఏఆర్‌ సంస్థకు చెందిన సైంటిస్టు గుఫ్రాన్‌ బీగ్‌ తెలిపారు.
- ఢిల్లీలో పీఎం 2.5 (గాలిలో సూక్ష్మాతి సూక్ష్మ ధూళి కణాలు) 30 శాతం వరకు తగ్గితే, అహ్మదాబాద్‌ పుణేలలో 15 శాతం వరకు తగ్గాయి
- సర్వసాధారణంగా మార్చి నెలలో గాలిలో



నాణ్యత సూచి మధ్యస్థంగా (100–200) ఉంటుంది. కానీ ఇప్పుడు సంతృప్తికరం (150–100), బాగుంది (ఏక్యూఐ 0–50) కేటగిరీలో ఉంటోంది. ప్రస్తుతం ఢిల్లీలో వీస్తున్న గాలి చాలా ఆరోగ్యకరమైనదిగా ఉందని సెంట్రల్‌ పొల్యూషన్‌ కంట్రోల్‌ బోర్డు కూడా గుర్తించింది.
- దేశవ్యాప్తంగా 39 నగరాల్లో గాలి నాణ్యతా సూచి బాగుంది రేంజ్‌లో ఉంటే, 51 నగరాల్లో సంతృప్తికర స్థాయిలో ఉంది.

**ప్రభుత్వానికి మేలు కొలుపు**

పరిశ్రమలు మూత పడడం, వాహనాలు రోడ్డెక్కకపోవడంతో వాయు కాలుష్యం అదుపులోకి వచ్చిందని, ప్రభుత్వానికి ఇది మేలుకొలుపు వంటిదని పలువురు పర్యావరణ వేత్తలు అంటున్నారు.

# నన్ను క్షమించండి

- కఠిన నిర్ణయమే.. అయినా తప్పదు
- లాక్‌డౌన్‌పై మోదీ
- కరోనాపై విజయం సాధిస్తామని ‘మన్‌ కీ బాత్‌’లో ధీమా



**న్యూఢిల్లీ:** కరోనా కోరల్లో చిక్కుకొని జీవన్మరణ సమస్యను ఎదుర్కొంటున్నామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. కోవిడ్‌–19 మహమ్మారిపై చేస్తున్న పోరాటంలో భారత్‌ తప్పక విజయం సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా లాక్‌డౌన్‌ చేయడం కఠిన నిర్ణయమైనా ప్రస్తుత పరిస్థితుల్లో తప్పదన్నారు. ఇలాంటి నిర్ణయం తీసుకున్నందుకు దేశప్రజలందరూ తనను క్షమించాలని వేడుకున్నారు. ఆకాశవాణి మన్‌కీ బాత్‌ కార్యక్రమంలో ఆదివారం జాతినుద్దేశించి ప్రధాని మాట్లాడారు. ‘ఈ ప్రాణాంతక వ్యాధికి సంబంధించి కొన్ని విషయాలు చెబుతాను. ముందుగా దేశ ప్రజలందరినీ క్షమించమని కోరుకుంటున్నాను. మీరందరూ నన్ను క్షమిస్తారనే నాకు తెలుసు. నిరుపేద సోదర సోదరీమణులు ఈయనేం ప్రధానమంత్రి .. మమ్మల్ని సమస్యల ఊబిలోకి తోసేశాడు అని అనుకుంటూ ఉండే ఉంటారు. అందుకే ప్రత్యేకంగా మీ అందరూ నన్ను మన్నించాలి. బహుశా, చాలా మంది నా మీద కోపం పెంచుకుని ఉంటారు. మమ్మల్నందరినీ ఇలా ఇళ్లలో బంధిస్తావా అని ఆగ్రహిస్తూ ఉంటారు. నేను మీ అందరి ఇబ్బందులను అర్థం చేసుకోగలను కానీ 130 కోట్ల మంది జనాభా ఉన్న దేశాన్ని రక్షించడానికి ఇంతకంటే మరో మార్గం లేదు. కరోనాతో యుద్ధమంటే చావుబతుకుల మధ్య పోరాటం. ఈ యుద్ధంలో మనం గెలవాలి. గెలిచి తీరుతాం’’అని ప్రధాని అన్నారు.

**వైద్యసిబ్బంది సేవలు భేష్‌**

కరోనాపై పోరాటంలో వైద్య సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు, పోలీసులు, ప్రభుత్వ అధికారులు, ఫ్రంట్‌లైన్‌ వర్కర్స్‌ చేస్తున్న కృషిని ఆయన ప్రశంసించారు. లాక్‌డౌన్‌ ప్రకటించినప్పట్నుంచి ప్రజలకి ఇబ్బందులు తలెత్తకుండా నిత్యావసరాలు, కూరలు, పాలు సరఫరా చేసేవారు వేలాది మంది నిరంతరాయంగా పని చేస్తున్నారంటూ కొనియాడారు.

**దయచేసి చట్టాన్ని ఉల్లంఘించకండి**

‘నాకు తెలుసు ఎవ్వరూ కూడా కావాలని చట్టాన్ని ఉల్లంఘించాలనుకోరు. కానీ కొందరు చేస్తున్నారు. వాళ్లు పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోలేకపోతున్నారు. వారందరినీ కోరేది ఒక్కటే లాక్‌ డౌన్‌ నియమాలను పాటించకపోతే ఈ వైరస్‌ నుంచి కాపాడుకోవడం కష్టమవుతుంది. ప్రపంచంలో చాలా మంది ఈ అపోహలతోనే కాలం గడిపారు. ఇప్పుడు పశ్చాత్తాప పడుతున్నారు’అని ప్రధాని అన్నారు. ఈ సందర్భంగా మోదీ కరోనా నుంచి కోలుకున్న వారితో మాట్లాడారు.

**ప్రధానికి రాహుల్‌ లేఖ**

కేంద్ర ప్రభుత్వం హఠాత్తుగా లాక్‌డౌన్‌ ప్రకటించడం తీవ్రమైన గందరగోళానికి దారి తీసిందని కాంగ్రెస్‌ నేత రాహుల్‌ గాంధీ అన్నారు. ఈ మేరకు ఆయన ప్రధానికి ఆదివారం లేఖ రాశారు. వలస కార్మికుల దుస్థితిని ప్రధాని దృష్టికి తీసుకువెళ్లిన రాహుల్‌ అభివృద్ధి చెందిన దేశాలు పాటించిన సంపూర్ణ లాక్‌డౌన్‌ వ్యూహం భారత్‌లో సరైంది కాదని అభిప్రాయపడ్డారు. దినసరి వేతన జీవులకి , నిరక్షరాస్యులకి ఈ పరిస్థితిని అర్థం చేసుకునే శక్తి ఉండదని రాహుల్‌ ఆ లేఖలో పేర్కొన్నారు. దేశాన్ని పూర్తిగా లాక్‌డౌన్‌ చేయడంతో కార్మికులు ఊళ్లకి వెళుతూ ఉండడంతో గ్రామాల్లో కూడా కరోనా ప్రబలే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.



## చికిత్సకు ‘జాఫీ’ రోబో

**సాక్షి ప్రతినిధి, చెన్నై:** తిరుచ్చిరాపల్లిలోని డ్రోన్లు, రోబోలు తయారు చేసే ప్రైవేటు సంస్థ ‘ప్రొపెల్లర్‌ టెక్నాలజీస్‌’కరోనా వైరస్‌ చికిత్స కోసం ‘జాఫీ’అనే రోబోను తయారు చేసింది. దీన్ని వినియోగించేందుకు ఎవరైనా ముందుకొస్తే ఉచితంగా సరఫరా చేసేందుకు సిద్ధమని ఆ సంస్థ సీఈఓ మహమ్మద్‌ ఆషిక్‌ రెహమాన్‌ తెలిపారు. ఇప్పటి వరకు తయారు చేసిన రోబోలను పారిశుద్ధ్య కార్మికులు, వైద్య సిబ్బందికి బదులుగా పనిచేసేలా రూపొందించామన్నారు. వ్యాధిగ్రస్తులకు ఆహారం, మందులు సరఫరా చేసేందుకు సైతం వీటిని వినియోగించవచ్చని తెలిపారు. మనిషి రూపంలో ఉండే ఈ రోబో నోటి మాటలు, మొబైల్‌ సంకేతాలతో పనిచేసేలా కంట్రోలింగ్‌ సిస్టమ్స్‌ను రూపొందించామన్నారు. 20 కిలోల బరువు మోస్తుందని తెలిపారు. కిలోమీటర్‌ దూరం వరకు ఆపరేట్‌ చేయవచ్చని వివరించారు.

# ముందుగానే స్పందిస్తే మరణాలు తగ్గించొచ్చు

- 1918 నాటి స్పానిష్‌ ఫ్లూ పరిస్థితులపై అధ్యయనంలో వెల్లడి
- నివారణ చర్యలు, ఐసోలేషన్‌ వంటి వాటితో ఫలితముంటుందన్న పరిశోధకులు


ఢిల్లీ–ఉత్తరప్రదేశ్‌ సరిహద్దు వద్దకు చేరుకున్న వలస కార్మికుల చేతులపై శానిటైజర్‌ను చల్లుతున్న ఎన్డీఆర్‌ఎఫ్‌ సభ్యులు

**న్యూయార్క్:** కరోనా వైరస్‌ వంటి అంటువ్యాధుల సమయంలో ముందుగానే నివారణ చర్యలు తీసుకోవడం వల్ల మరణాల సంఖ్య తగ్గేందుకు అవకాశం ఉందని అమెరికా పరిశోధకులు అంటున్నారు. 1918–19 సంవత్సరాల్లో స్పానిష్‌ ఫ్లూ మహమ్మారి ప్రపంచాన్ని వణికించిన సమయంలో అమెరికాలోని కొన్ని నగరాల్లో ముందుగానే అప్రమత్తమై చేపట్టిన నిర్బంధ, నివారణ చర్యల కారణంగా మరణాలు తగ్గినట్లు లయోలా యూనివర్సిటీ శాస్త్రవేత్తలు తేల్చారు. అప్పట్లో ప్రపంచ వ్యాప్తంగా స్పానిష్‌ ఫ్లూ బారినపడి 5 కోట్ల మంది చనిపోగా అమెరికాలో 6.75 లక్షల మంది బలయ్యారు. శాన్‌ఫ్రాన్సిస్కో, సెయింట్‌ లూయిస్, కన్సాస్‌ సిటీ, మిల్వాకీ నగరాలు చేపట్టిన.. పాఠశాలల మూసివేత, సభలు, సమావేశాలపై నిషేధం, కఠినమైన ఐసోలేషన్‌ విధానాలు, పరిశుభ్రత పాటించడం, తప్పనిసరిగా మాస్కులు ధరించేలా చేయడం వంటి చర్యలు సత్ఫలితాలనిచ్చాయని పేర్కొన్నారు. ‘ఈ చర్యలు వ్యాధి తీవ్రతను 30 నుంచి 50 శాతం వరకు తగ్గించాయి. ఆలస్యంగా స్పందించిన/ ముందు జాగ్రత్తలు తక్కువగా తీసుకున్న నగరాలతో పోలిస్తే ఇవి మెరుగైన స్థితిలో ఉన్నాయి. ఈ నగరాల్లో మరణాల రేటు గరిష్ట స్థాయిని చేరుకునేందుకు ఎక్కువ సమయం పట్టింది. మొత్తం మరణాలు కూడా తగ్గుముఖం పట్టాయి. ఈ పరిశోధన ఫలితాలు తాజాగా అమెరికన్‌ సొసైటీ ఆఫ్‌ సైటోపాథాలజీ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ‘ఇలాంటి కఠినచర్యలతో ఎలాంటి ఫలితం ఉండదని అప్పట్లో జనం అనుకునేవారు. కానీ, అది తప్పు అని మా అధ్యయనంలో తేలింది’అని శాస్త్రవేత్తలు వెల్లడించారు. ‘1918లో అమెరికాలో పేదరికం, పోషకాహార లోపం, అపరిశుభ్రత, జనం ఎక్కువగా గుమికూడటం ఎక్కువగా ఉండేవి. అప్పటి పరిస్థితులతో పోల్చుకుంటే ప్రపంచం నేడు చాలా మారింది. అయినప్పటికీ, వందేళ్ల క్రితం తీసుకున్న నివారణ చర్యలు ప్రస్తుతం ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా వైరస్‌ వ్యాప్తి నివారణకూ అనుసరణీయాలే’అని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

### వయసుతో సంబంధం లేదు

**వాషింగ్టన్:** కరోనా ముప్పు వృద్ధులకే అధికమన్న వాదనలో నిజం లేదని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరించింది. ఆరోగ్యం.. అనారోగ్యం అన్నవే కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొంది. పూర్తి ఆరోగ్యంగా ఉన్నవారు కరోనా బారినపడే అవకాశాలు తక్కువని తేల్చిచెప్పింది. సహజంగా వృద్ధుల్లో ఆరోగ్యవంతులు అంతంతమాత్రమే కాబట్టి అలాంటి వారే బలయ్యే ప్రమాదం ఉందంది.

# 7 లక్షలకి చేరువలో కేసులు

## ప్రపంచ వ్యాప్తంగా 32వేలు దాటిన మృతులు

## యూరప్‌లో మరణ మృదంగం

## కరోనాతో కన్నుమూసిన స్పెయిన్‌ యువరాణి


శాన్‌ఫ్రాన్సిస్కోలో కరోనా భయంతో ఖాళీగా కనిపిస్తున్న చర్చి

**వాషింగ్టన్‌/రోమ్‌/మాడ్రిడ్‌/పారిస్:** కరోనా కోరల్లో చిక్కుకొని యూరప్‌ దేశాలు అతలాకుతలమైపోతున్నాయి. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అక్కడ దేశాలు ఘోర కలిని ఎదుర్కొంటూ ఉండడంతో దిక్కు తోచని పరిస్థితుల్లో పడిపోయాయి. కరోనా ప్రభావం అత్యధికంగా ఉన్న ఇటలీ, స్పెయిన్‌ తమకు సాయం చేయాలంటూ యూరోపియన్‌ యూనియన్‌ దేశాలను అభ్యర్థించాయి. ప్రపంచ వ్యాప్తంగా 32 వేల మందికి పైగా మరణిస్తే అందులో సగానికి పైగా ఇటలీ, స్పెయిన్‌లో నమోదు కావడం ఆందోళన రేకెత్తిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా కేసులు 7 లక్షలకి చేరువలో ఉన్నాయి అయితే అన్ని దేశాల్లోనూ సరిపడినన్ని టెస్టింగ్‌ కిట్‌లు లేకపోవడంతో వ్యాధిగ్రస్తులు ఇంకా ఎక్కువ ఉంటారని ఆరోగ్య నిపుణులు అంటున్నారు.

**ఇటలీలో సూపర్‌ మార్కెట్లు లూటీ !**

కరోనా ప్రభావం అత్యధికంగా ఉన్న ఇటలీలోని సిసిలీలో జనం తిండి కోసం సూపర్‌ మార్కెట్లను లూటీ చేస్తున్నారు. ‘మా దగ్గర డబ్బుల్లేవు. కడుపు నింపుకోవాలి కదా’’అంటూ బిల్లు చెల్లించకుండానే పరుగులు తీస్తున్నట్టు స్థానిక పత్రికల్లో వార్తలు వస్తున్నాయి. దీంతో పోలీసులు తుపాకులతో మార్కెట్లను పహారా కాయాల్సిన పరిస్థితులు వచ్చేసాయి. మృతుల సంఖ్య పదివేలు దాటిపోవడంతో వారిని పూడ్చడానికి శవపేటికలు లేక వేచి చూడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

**సాయం చేయాలంటూ అభ్యర్థన**

ఇటలీ, స్పెయిన్, ఫ్రాన్స్‌ మరో ఆరు దేశాలు తమను ఆదుకోవాలంటూ యూరోపియన్‌ యూనియన్‌ని అభ్యర్థిస్తున్నాయి. 27 దేశాలతో కూడిన ఈయూ ఏర్పడిన తర్వాత ఇంతటి సంక్షోభ పరిస్థితుల్ని ఎదుర్కోవడం ఇదే తొలిసారి. ఆర్థిక ఇబ్బందుల్ని అన్ని దేశాలు పంచుకోవాలని ఇటలీ, స్పెయిన్‌లు మొరపెట్టుకుంటే జర్మనీ, నెదర్లాండ్స్‌ వంటి దేశాలు మాస్కులు, శానిటైజర్లు కూడా ఇవ్వడానికి నిరాకరిస్తున్నాయి.

**స్పెయిన్‌లో రికార్డు స్థాయిలో మరణాలు**

ఒకే రోజులో స్పెయిన్‌లో 838 మరణాలు నమోదయ్యాయి. దీంతో మొత్తం మృతుల సంఖ్య 6,528కి చేరుకుంది. ఇక కేసులు 78,797కి చేరుకున్నాయి. కరోనా పంజా విసిరిన దేశాల్లో ఇటలీ తర్వాత స్థానం స్పెయిన్‌దే.

### క్వారంటైన్‌లో న్యూయార్క్‌

అగ్రరాజ్యం అమెరికా కరోనా కోరల్లో చిక్కుకొని విలవిల్లాడుతోంది. ఇన్నాళ్లూ న్యూయార్క్, కాలిఫోర్నియాలను అతలాకుతలం చేసిన వైరస్‌ ఇప్పుడు డెట్రాయిట్, న్యూ ఓర్లీన్స్, చికాగోల్లో తన ప్రతాపాన్ని చూపిస్తోంది. న్యూయార్క్‌ నగరవాసులెవరూ ఇల్లు కదిలి బయటకు వెళ్లొద్దని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. దేశవ్యాప్తంగా లక్షా 20 వేలకు పైగా కేసులు నమోదైతే, మృతుల సంఖ్య 2 వేలు దాటిపోయింది. కరోనాపై విజయం సాధించడానికి ఇంకా వారాలకి వారాలు పడుతుందని న్యూయార్క్‌ గవర్నర్‌ ఆండ్రూ క్యూమో అన్నారు. వైరస్‌ వ్యాప్తి చెందకుండా ఒకరికొకరు ఆరు అడుగులు దూరంగా ఉండాలని, దగ్గు, జలుబు ఉంటే 23 నుంచి 27 అడుగుల దూరం పాటించాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. దక్షిణాఫ్రికాలో రోడ్లపైకి కూడా వచ్చే పరిస్థితి లేదు. రష్యా దేశ సరిహద్దుల్ని మూసేయాలని నిర్ణయించింది. వియత్నాంలో రెస్టారెంట్లు, వాణిజ్య కేంద్రాలు మూసివేశారు.

### స్పెయిన్‌ యువరాణి మృతి



స్పెయిన్‌ దేశ యువరాణి మేరీ థెరెసా కరోనా బారిన పడి ప్రాణాలు కోల్పోయారు. ఆమె వయసు 86 సంవత్సరాలు. యూరప్‌లో రాజ కుటుంబానికి చెందిన వ్యక్తి మరణించడం ఇదే మొదటిసారి. ఆమె సోదరుడు ప్రిన్స్‌ సిక్స్టో ఎన్‌రిక్‌ డి బార్బన్‌ ఫేస్‌బుక్‌ ద్వారా యువరాణి ఇక లేరన్న విషయం వెల్లడించారు. కరోనా సోకక ముందు నుంచి మేరీ న్యుమోనియాతో బాధపడుతున్నారు.

### నాడు స్పానిష్‌ ఫ్లూను చూసిన మహిళ...

**లండన్:** రెండు ప్రపంచయుద్ధాలకు సాక్షిగా, స్పానిష్‌ ఫ్లూను సైతం తట్టుకుని నిలిచిన ఆమె..కరోనా ముందు ఓడిపోయారు. కరోనా వైరస్‌ బారినపడి బ్రిటన్‌కు చెందిన హిల్డా చర్చిల్‌(108) శనివారం కన్నుమూశారు. ఏప్రిల్‌ 5వ తేదీన 108వ పుట్టినరోజు జరుపుకోనున్న ఆమె ఇటీవల అస్వస్థతతకు గురయ్యారు. పరీక్షల్లో ఆమెకు కరోనా పాజిటివ్‌ అని తేలింది. ఫలితం వెలువడిన 24 గంటల్లోనే సల్‌ఫోర్డ్‌సిటీలోని వృద్ధాశ్రమంలో హిల్డా కన్నుమూశారు. కరోనాతో బ్రిటన్‌లో మృతి చెందిన కురువృద్ధురాలు హిల్డాయేనని అధికారులు అంటున్నారు. 1918లో ప్రపంచాన్ని స్పానిష్‌ ఫ్లూ చుట్టుముట్టిన సమయంలో హిల్డా వయస్సు సుమారు ఆరేళ్లు. స్పానిష్‌ఫ్లూ నుంచి అప్పట్లో హిల్డా కోలుకుంది.

సాక్షి 24|7 నల్లగొండ
NALGONDA DISTRICT
సోమవారం । 30 । మార్చి । 2020

## పోలీసుల ఔదార్యం..



**మునుగోడు :** కరోనా లాక్‌డౌన్‌తో నిత్యం బిజీబిజీగా విధుల్లో ఉంటూ కూడా తమ ఔదార్యం చాటుకున్నారు మునుగోడు పోలీసులు. ఆదివారం మునుగోడులోని చౌరస్తాలో తిరుగుతున్న ఓ మానసిక వికలాంగుడిని చేరదీసి చౌటుప్పల్‌లోని అమ్మానాన్న అనాథ ఆశ్రమంలో చేర్పించారు. స్థానిక జెడ్పీటీసీ స్వరూపరాణిరవి విన్నపం మేరకు ఎస్‌ఐ కె.రజినీకర్ స్పందించి తన సిబ్బందిని పంపించి అనాథాశ్రమంలో చేర్పించారు.

## న్యూస్‌రీల్

### నిత్యావసరాల సరఫరాకు అనుమతి : ఎస్పీ



**నల్లగొండ క్రైం :** నిత్యావసర సరుకులు, కూరగాయలు, మెడిసిన్ సంబంధిత వాహనాలను అనుమతించాలని ఎస్పీ రంగనాథ్ చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసులకు సూచించారు. ఆదివారం జిల్లాలో నార్కట్‌పల్లి నుంచి వాడపల్లి వరకు సరిహద్దు చెక్‌పోస్టులను పర్యవేక్షించారు. కరోనా కట్టడికి సరిహద్దుల వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. లాక్‌డౌన్ నేపథ్యంలో ప్రజలకు ఇబ్బంది కలుగకుండా ఇతర ప్రాంతాల నుంచి వచ్చే కూరగాయలు, కిరాణ సామగ్రి, మెడిసిన్ వాహనాలను అనుమతించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కేసులు నమోదు చేయాలన్నారు. పోలీసులు ఒత్తిడికి గురికాకండా రెండు విడతలుగా బాధ్యతలను విభజించినట్లు తెలిపారు. విధులు నిర్వహించే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, సామాజిక దూరం పాటించాలని పోలీస్ సిబ్బందికి శానిటైజర్లు అందించినట్లు తెలిపారు.

**'కరోనా' కట్టడి.. ప్రతిఒక్కరి బాధ్యత**

**దామరచర్ల (మిర్యాలగూడ) :** కరోనా వైరస్ కట్టడి ప్రతిఒక్కరి సామాజిక బాధ్యత అని ఎస్పీ ఏవీ.రంగనాథ్ అన్నారు. ఆదివారం ఆయన తెలంగాణ, ఏపీ రాష్ట్రాల సరిహద్దున ఉన్న కృష్ణానది తీరంలోని వాడపల్లిలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్టు వద్ద ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులకు పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈసందర్భంగా ఏపీ పోలీసులతో మాట్లాడారు. కార్యక్రమంలో సీఐ రమేష్ బాబు, ఎస్.ఐ నర్సింహారావు పాల్గొన్నారు.

### పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి : జెడ్పీ చైర్మన్



**నార్కట్‌పల్లి (నకిరేకల్) :** కరోనా వైరస్ కట్టడికి జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్యం పనులపై అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాలని జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి కోరారు. మండలంలోని నక్కలపల్లి గ్రామంలో పారిశుద్ధ్య పనులను పరిశీలించి ప్రతి వార్డులో బ్లీచింగ్ పౌడర్ చల్లాలని సూచించారు. ప్రజలంతా స్వచ్ఛంద గృహ నిర్బంధంలో ఉంటూ లాక్‌డౌన్‌కు సహకరించాలని పిలుపునిచ్చారు. బయట తిరిగేవారిపై పోలీసులు చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. పోలీసులు ప్రతి గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు.

### పోలీసులకు చేయూత



**నల్లగొండ :** మానవాళిని కబళిస్తున్న మహమ్మారి కరోనా వైరస్ కట్టడికి ప్రకటించిన లాక్‌డౌన్ నేపథ్యంలో జిల్లాకేంద్రంలో నిర్విరామంగా విధులు నిర్వహిస్తున్న పోలీసులకు పట్టణానికి చెందిన అదిరనాయుడు, మనోజ్ నాయుడు చేయూతనందించారు. ఈ మేరకు వారు ఆదివారం పట్టణంలోని అన్ని రోడ్లలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బందికి వాటర్ బాటిళ్లు, పులిహోర అందజేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు విధులు నిర్వహిస్తున్న సందర్భంలో అక్కడ మంచినీళ్లు కూడా సమయానికి తాగలేని పోలీసుల పరిస్థితిని గమనించిన వారు తమ వంతు చేయూతనందించారు. వీరి సహకారానికి పోలీసులు కూడా అభినందనలు తెలిపారు. అనంతరం నిరాశ్రయులకు కూడా నీళ్లు, పులిహోర పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెంకట్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### ప్రమాదవశాత్తు పశువుల కొట్టం, పత్తి దగ్ధం

**మునుగోడు :** ప్రమాదవశాత్తు పశువుల కొట్టం, పత్తి దగ్ధమైంది. ఈ సంఘటన ఆదివారం మునుగోడు మండలం కోతులారం గ్రామంలో చోటుచేసుకుంది. బాధితుడు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం కోతులారం గ్రామానికి చెందిన గుండు చిన్నకృష్ణయ్య వ్యవసాయ కొట్టం పక్కన గల మరో రైతు తన వ్యవసాయ భూమిలోని పత్తి కట్టెను తగలబెట్టాడు. అయితే ఆ మంటలు పక్కనే ఉన్న కృష్ణయ్య కొట్టంపై పడి దగ్ధమైంది. దీంతో అందులో ఉన్న వ్యవసాయ పనిముట్లు, 5 క్వింటాళ్ల పత్తి పూర్తిగా కాలిబూడిదైంది. దాదాపు రూ.లక్షకుపైగా నష్టం వాట్లిందని రైతులు తెలిపాడు.

# సరిలేరు.. మీకెవ్వరూ!

- జిల్లాలో 'కరోనా' కట్టడికి పోలీస్‌శాఖ నిర్విరామ కృషి
- లాక్‌డౌన్ నేపథ్యంలో విధుల్లో 2వేల మంది పోలీసులు
- రెండు విడతలుగా డ్యూటీకి హాజరవుతున్న సిబ్బంది
- జిల్లా సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక నిఘా
- విదేశాలనుంచి వచ్చిన వారి ఇళ్లకు జియోట్యాగింగ్
- జిల్లా కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షణ
- అధిక ధరలకు సరుకులు విక్రయిస్తే ఉక్కుపాదం మోపుతూ ముందుకు..

| జిల్లాలో విధులు నిర్వహిస్తున్న పోలీసుల సంఖ్య | |
|---|---|
| ఎస్పీ | 01 |
| డీఎస్పీలు | 05 |
| సీఐలు | 20 |
| ఎస్‌ఐలు | 45 |
| ఏఎస్‌ఐలు | 54 |
| కానిస్టేబుళ్లు, ఇతర సిబ్బంది | 1,875 |



నల్లగొండ : రోడ్లపై ఎవరూ తిరగకుండా తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

**నల్లగొండ క్రైం :** కరోనా కట్టడికి ప్రభుత్వం విధించిన లాక్‌డౌన్ జిల్లాలో సమర్థంగా అమలవుతోంది. ఇందుకు పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకుంటూ పగలనకా.. రేయనకా నిర్విరామంగా సరిలేరు.. మీకెవ్వరూ అనేరీతిలో విధులు నిర్వర్తిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 2వేల మంది పోలీసులు లాక్‌డౌన్ నేపథ్యంలో రెండు విడతలుగా విధులకు హాజరవుతున్నారు. ఈ నేపథ్యంలో విదేశాలనుంచి వచ్చిన వారి వివరాలు పోలీసుల వద్ద ఉండడంతో వారి నివాసాలకు ఇప్పటికే జియోట్యాగింగ్ చేశారు. నివాసాల్లో ఉండాలని ఇల్లు విడిచి వేరే చోటుకు వెళ్లొద్దని హెచ్చరిస్తున్నారు. అనుమానితులు ఇల్లు విడిచి వెళితే వెంటనే జియోట్యాగ్ ద్వారా వారి కదలికలు జిల్లా పోలీస్ కార్యాలయానికి తెలిసేలా కంట్రోల్ రూమ్‌ను సైతం ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నారు. ఇలా అనుమానితులను హోం క్వారంటైన్‌లో కొనసాగేలా నిఘా పెట్టారు. నిరంతరం వీరిపై నిఘా ఉంచేందుకు జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రత్యేకంగా కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశారు. ప్రజలనుంచి వచ్చే అన్నిరకాల ఫిర్యాదులను కంట్రోల్ రూమ్ సిబ్బంది పర్యవేక్షిస్తూ.. పరిష్కారానికి చర్యలు తీసుకుంటోంది. జిల్లా సరిహద్దులో ఏఆర్ పోలీస్‌లు విధులు నిర్వర్తిస్తున్నారు. నిత్యావసరసరులు, అత్యవసరంగా ఆస్పత్రికి వెళ్లేవారిని మాత్రమే సరిహద్దులో పోలీసులు అనుమతిస్తున్నారు.

**ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో బారికేడ్ల ఏర్పాటు..**

జిల్లాలో ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో బారికేడ్లు ఏర్పాటు చేసి నిరంతరం నిఘా ఉంచుతున్నారు. వాహనదారులు విచ్చలవిడిగా తిరగకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నారు. అత్యవసరమైతేనే తప్ప రోడ్లపైకి అనుమతించడంలేదు. నిత్యావసర సరుకుల కోసం వెళ్లేవారికి సడలింపు ఇస్తున్నారు. అనవసరంగా వాహనాలపై రోడ్లపైకి వస్తే లాఠీ ఝుళిపిస్తున్నారు. మాస్కులు లేకుండా వెళ్లేవారిని ఆపి కౌన్సెలింగ్ ఇస్తున్నారు.

**భారీగా పోలీసుల మోహరింపు..**

కరోనా కట్టడికి భారీగానే పోలీసుల మోహరింపు ఉంది. ఎక్కడికక్కడ నిర్బంధం విధించినట్లు పోలీసుల నిఘా ఉంది. జిల్లావ్యాప్తంగా మొత్తం 2వేల మంది పోలీసులు విధుల్లో పాల్గొంటున్నారు. లాక్‌డౌన్ నేపథ్యంలో ప్రజలను ఇళ్లనుంచి ఎక్కడికీ వెళ్లకుండా స్వీయ నిర్బంధం చేశారు. చెక్‌పోస్ట్‌ల వద్ద 60మంది ఏఆర్ సిబ్బంది నిరంతరం పహారాలో ఉన్నారు. జిల్లా ఎస్పీ రంగనాథ్ ప్రతిరోజూ ముఖ్య పట్టణాల్లో, జాతీయ రహదారిలో భద్రతా చర్యలును పర్యవేక్షిస్తున్నారు. సెల్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తూ పోలీసులకు దిశానిర్దేశం చేస్తున్నారు.

**భద్రతా సిబ్బందికి మాస్కులు**

అన్ని పోలీస్ స్టేషన్లకు, రోడ్లపై విధులు నిర్వహిస్తున్న భద్రతా సిబ్బందికి ఇప్పటికే పోలీసులు మాస్కులు, శానిటైజర్లు అందజేశారు. పోలీసులు స్వీయ ఆరోగ్య రక్షణ పాటిస్తూనే ప్రజలు కరోనా బారిన పడకుండా చర్యలు తీసుకుంటున్నారు. ప్రజలు గుంపులుగా ఉండకుండా సామాజిక దూరం పాటించే విధంగా అవగాహన కల్పిస్తూ అందుకు సాగుతున్నారు. ముఖ్యంగా నిత్యావసర సరుకుల విక్రయ కేంద్రాల వద్ద మార్కింగ్ చేసి కొనుగోలుదారులు సా మాజిక దూరం పాటించేలా చర్యలు తీసుకుంటున్నారు.

**విదేశాలనుంచి 410మంది..**

విదేశాలనుంచి జిల్లాకు 410మంది వచ్చినట్లు ఇప్పటికే పోలీసులు గుర్తించారు. 332మంది హోం క్వారంటైన్ పూర్తి చేయగా మరో 154మంది హోం క్వాంటైన్‌లో ఉన్నారు. అయితే నిబంధనలు అతిక్రమించి హోం క్వారంటైన్ నుంచి వచ్చిన ఇద్దరు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేసి మరలా వారిని హోం క్వారంటైన్‌కు పంపించారు.

### అనవసరంగా రోడ్లెక్కుతున్నారు..



పనీపాటా లేని వారు అనవసరంగా వాహనాలతో రోడ్లెక్కి ఇబ్బంది కలిగిస్తున్నారు. మాస్కులు లేనివారిని వాహనాలు ఆపి వారి దగ్గర ఉన్న వస్త్రాన్ని కట్టి , వైరస్ గురించి తెలియజేస్తున్నాం. పదేపదే రోడ్లపైకి వచ్చి విధులకు ఆటంకం కలిగించే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తున్నాం. నిరంతరం రోడ్లపైనే విధులు నిర్వహించడం ఇబ్బంది అనిపించినా కరోనా కట్టడి కోసం తప్పడం లేదు.

**- సైదులు, ట్రాఫిక్ కానిస్టేబుల్, నల్లగొండ**



బైక్‌పై వస్తున్న వ్యక్తి నోటికి కర్చీఫ్ కడుతున్న పోలీస్

### ఇబ్బందిగా ఉన్నా.. విధులు నిర్వహిస్తున్నా..



నిరంతరం విధులు నిర్వహించడం ఇబ్బందిగా ఉంది. అయినా ప్రజల రక్షణకోసం సమర్థంగా విధులు నిర్వహిస్తూ కరోనాను కట్టడి చేసేందుకు నావంత బాధ్యతగా వ్యవహరిస్తున్నా. ప్రజలు రోడ్లపైకి రాకుండా చర్యలు తీసుకుంటున్నాం. పోలీసులందరం రెండు విడతలుగా విధులకు హాజరవుతున్నందున కొంత విశ్రాంతి దొరకుతోంది. అత్యవసరంగా వెళ్లే వారినే రోడ్లపైకి అనుమతిస్తున్నాం.

**- లింగారెడ్డి, కానిస్టేబుల్, నల్లగొండ**

### కరోనా కట్టడికి చర్యలు



కరోనా కట్టడికి ప్రభుత్వం లాక్‌డౌన్ విధించిన నేపథ్యంలో పోలీస్‌శాఖ నిరంతరం ఎక్కడికక్కడ ప్రజలు రోడ్లపైకి రాకుండా కట్టడి చేస్తోంది. నిత్యావసర సరుకులకు, ఇతర అత్యవసరాలకు వెళ్లేవారిని మాత్రమే అనుమతిస్తున్నాం. 2వేల మంది పోలీస్ సిబ్బంది రెండు విడతలుగా విధులు నిర్వర్తిస్తున్నారు. రోడ్లపైకి ఎవరూ రాకుండా నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. జిల్లా సరిహద్దులో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలి. నిత్యావసరాల సరుకుల రవాణాకు ఇబ్బందులు లేకుండా అన్ని స్టేషన్లలో గుర్తింపు కార్డులు ఇస్తున్నాం. అధిక ధరలకు అమ్మకుండా నిరంతరం పర్యవేక్షించడంతోపాటు 12మందిపై కేసు నమోదు చేశాం.

**- ఏవీ.రంగనాథ్, ఎస్పీ నల్లగొండ**

# స్వచ్ఛంద నిర్బంధంలో..



నల్లగొండ గడియారం సెంటర్‌లో వాహనదారులను నిలువరిస్తున్న పోలీసులు

- 'కరోనా' కట్టడికి ఎవరికి వారు ఇళ్లకే పరిమితమవుతున్న ప్రజలు
- లాక్‌డౌన్ అమలులో ఉన్నా పట్టించుకోని ఆకతాయిలు
- ఏ పనిలేకున్నా రోడ్లపై యథేచ్ఛగా చక్కర్లు..
- పోలీసులు పట్టుకొని లాఠీలతో బుద్ధి చెబుతున్నా తీరుమారని వైనం!
- కొందరిని అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇస్తున్న ఖాకీలు
- బైపాస్‌లో ఆగని బైక్‌రైడింగ్‌లు

**సాక్షి ప్రతినిధి నల్లగొండ :** కరోనా వైరస్ వ్యాపించకుండా ప్రభుత్వం చేస్తున్న హెచ్చరికలను అర్థం చేసుకుని ప్రజలు స్వచ్ఛంద నిర్బంధంలో ఉంటున్నారు. చాలామంది తమకు తాముగా స్వీయ నిర్బంధం విధించుకుంటూ ఇళ్లకే పరిమితమవుతున్నారు. కనీసం పక్కింటి గడప కూడా తొక్కడం లేదు. కరోనా వైరస్ తీవ్రతను అర్థం చేసుకొని జాగ్రత్త పడుతున్న వారి పరిస్థితి ఇది. ఇదిలాఉంటే ఆకతాయి యువత మాత్రం హాయ్‌గా చక్కర్లు కొడుతున్నారు. పోలీసులు నాలుగైదు రోజులుగా అవసరం ఉంటేనే బయటికి రావాలని మందలించినా కొందరు యువకుల్లో మాత్రం మార్పు రావడం లేదు. యథేచ్ఛగా తిరుగుతున్నారు. పోలీసులు లాఠీలకు పనిచెప్పినా ఆకతాయిల్లో మాత్రం మార్పు రావడం లేదు. ఎందుకు తిరుగుతున్నావు. ఏపనిపై బయటికి వచ్చావు. అని పోలీసులు ఆ యువతను ఆరా తీస్తే వారి ఇళ్లు ఎక్కడో దూరంగా ఉంది. కానీ ఇంతదూరం ఎందుకు వచ్చావ్ అంటే కొందరు కిరాణం సామానుకు వచ్చాం అంటున్నారు. మీ కాలనీ దేవరకొండ రోడ్డులో ఉంటే అక్కడ కిరాణం షాపులు, కూరగాయల షాపులు లేవా ఇంతదూరం ఎందుకొచ్చావు అంటూ లాఠీ ఝుళిపించి పంపించారు. మళ్లీ కనిపిస్తే కేసు బుక్ చేస్తామంటూ హెచ్చరించి పంపిస్తున్నారు. అయినా వారిలో మార్పులు రావడంలేదు. ఆదివారం గడియారం వద్ద ఓ యువకుడి బండిపై పోలీస్ అనే స్టిక్కర్ వేసుకొని వచ్చాడు. అక్కడి పోలీసులు ఆపారు. ఏం పనిపై పోతున్నావు అని ప్రశ్నించడంతో పొంతన లేని సమాధానాలు చెబుతున్నాడు. నిత్యావసర వస్తువులు కొనడానికి అయితే సంచి ఉండాలి అది ఏదీ లేకపోవడంతో మీ నాన్నకు , మీ అమ్మకు ఫోన్ చేసి ఇవ్వమని అనడంతో ఫోన్ కోసం ప్రయత్నించిన ఫోన్ కలవలేదా. అవతల ఎత్తలేదా లెలియదు. అలా చాలా సేపు అయిన తర్వాత చివరికి హెచ్చరించి పంపించారు. అలాంటి వారు అవసరం లేకున్నా ప్రధాన రోడ్లే కాదు వీధుల్లోనూ తిరుగుతున్నారు.

**పట్టణంలో బైక్ రైడ్‌లు..**

పట్టణంలో బైక్ రైడింగ్ నిర్వహిస్తున్నారు. నాలుగు రోజుల క్రితం ఎన్‌జీ కళాశాల వద్ద తెల్లవారుజామున బైక్ రైడింగ్ నిర్వహించడంతో పోలీసులు వారిని మందలించినట్లు సమాచారం. అక్కడినుంచి అద్దమర్చి గిరకబాయ్‌గూడెం నుంచి మునుగోడు రోడ్డు పైపు వెళ్లేదారిలో వేళలను మార్చి బైక్ రైడింగ్ నిర్వహించారు. పోలీసుల పెట్రోలింగ్ తక్కువగా ఉండడం వల్ల బైక్ రైడింగ్‌లు ఆ గుట్ట ప్రాంతాల్లో నిర్వహిస్తున్నారు.

**కొన్ని షాపుల వద్ద పాటించని సామాజిక దూరం..**

ఆదివారం కావడంతో చికెన్, మటన్ షాపుల తోపాటు చేపల దుకాణాలలో రద్దీ పెరిగింది. సామాజిక దూరాన్ని పక్కన పెట్టి పెద్ద ఎత్తున గుమ్మిగూడి కొనుగోలు చేశారు. యజమానులు చెప్పినా కూడా పట్టించుకోని పరిస్థితి.

**మధ్యాహ్నం తరువాత బయటికిరాని జనాలు..**

లాక్‌డౌన్ సందర్భంగా ఉదయం 12గంటల వరకే రోడ్లపై జనాలు అధికంగా కనిపిస్తున్నారు. ఆ తర్వాత ఇళ్లకే పరిమితమవుతున్నారు. రోడ్లపై తక్కువగా వాహనాలు కనిపిస్తున్నాయి. కాలనీల్లో అయితే కర్ఫ్యూ పరిస్థితే కనిపిస్తోంది.

**రాత్రి 7గంటలయితే ఉరుకులు పరుగులు..**

రాత్రి 7అయిందంటే కర్ఫ్యూ మొదలవుతుంది. అప్పటినుంచి పోలీసులు ఎక్కడిక్కడ రోడ్లపై బారికేడ్లు పెట్టి కట్టుదిట్టం చేస్తున్నారు. రోడ్లపై వచ్చేవారిని లాఠీలతో సమాధానం చెబుతుండడంతో షాపులు ఇతర పనులపై వచ్చినవారు కూడా ఉరుకులు పరుగులు తీస్తూ ఇళ్లబాట పడుతున్నారు. 7:30 తర్వాత జనాలు బయటికి రావాలంటే జంకుతున్నారు.

# ఏప్రిల్ 3నుంచి ధాన్యం కొనుగోళ్లు

- జిల్లాలో 400 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయం
- 'కరోనా' వ్యాప్తి దృష్ట్యా రైతులకు ఇబ్బందులు కలగకుండా గ్రామాల్లోనే..
- మొబైల్ టీంల తరహాలో ఇళ్లకు వెళ్లి ధాన్యం కొనుగోలుకు సన్నాహాలు
- అవసరమైన ట్యాబ్‌లు, వేయింగ్ మిషన్లు తెప్పించనున్న అధికారులు
- ఏర్పాట్లపై సమీక్షించిన అదనపు కలెక్టర్ వనమాల చంద్రశేఖర్



**నల్లగొండ :** రబీ ధాన్యం కొనుగోళ్లు ఏప్రిల్ 3వ తేదీనుంచి ప్రారంభం కానున్నాయి. అందుకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. కరోనా దృష్ట్యా రైతులు ఎక్కువ సంఖ్యలో కేంద్రాల వద్ద గుమ్మి కూడకుండా ఉండడంతోపాటు పండించిన ప్రతి ధాన్యపుగింజను కొనుగోలు చేసి రైతులకు నష్టం జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. అందులో భాగంగానే జిల్లా మంత్రి జగదీశ్‌రెడ్డి ఇప్పటికే జిల్లా యంత్రాంగంతో ధాన్యం కొనుగోళ్లపై సమీక్షించి ప్రతి రెవెన్యూ గ్రామంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అయితే జిల్లా యంత్రాంగం మాత్రం ధాన్యం దిగుబడి ఎక్కడ ఎక్కువగా వస్తుంది.. ఆ ప్రకారంగా రైతుల రద్దీని తగ్గించడానికి జిల్లాలో 400 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

**పెంచిన కొనుగోలు కేంద్రాలు..**

జిల్లాలో మొత్తం 844 గ్రామపంచాయతీలు ఉన్నాయి. అందులో 563 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. వాటన్నింటిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే జిల్లాలో 26,450 హెక్టార్లలో వరిసాగు చేశారు. తద్వారా 5,96,960 మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్‌కు వస్తుందని అంచనా వేశారు. అయితే ముందుగా 229 కొనుగోలు కేంద్రాలు సరిపోతాయని గత రబీ సీజన్‌తోపాటు ప్రస్తుతం వచ్చే దిగుబడిని దృష్టిలో ఉంచుకొని కేంద్రాలను ఎంపిక చేశారు. అయితే కరోనా దృష్ట్యా రైతులు రద్దీగా ఉండవద్దని ప్రతి రెవెన్యూ గ్రామంలో కేంద్రాలు ఏర్పాటు చేయాలని వాటిని 400కు పెంచారు.

**ఏర్పాట్లలో నిమగ్నమైన యంత్రాంగం..**

ఏప్రిల్ 3వ తేదీనుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కానున్నాయి. అందుకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో కేంద్రాల వద్దకు రైతులు ధాన్యాన్ని తీసుకొస్తున్నారు. కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో కొందరు మిల్లుల వద్దకువెళ్తున్నారు. 3వ తేదీనుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి ధాన్యం కొనుగోలు చేసే విధంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

**తూకం యంత్రాలు, ట్యాబ్‌లను తెప్పిస్తున్న అధికారులు..**

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలంటే అందుకు సంబంధించి ప్రధానంగా తూకం యంత్రాలు తప్పనిసరిగా ఉండాలి. ఇవి లేకపోతే అక్కడ కేంద్రం ఏర్పాటు చేసిన ప్రయోజనం లేదు. గతంలో ఏర్పాటు చేయాలనుకున్న 229 కేంద్రాలకే యంత్రాలు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం కేంద్రాల సంఖ్య 400కు పెరిగింది. తూకం యంత్రాలు, ట్యాబ్‌లను తాత్కాలికంగా బయటి నుంచి తెప్పించేందుకు కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, అదనపు కలెక్టర్ వనమాల చంద్రశేఖర్ ఏర్పాట్లు చేశారు.

**ఏర్పాట్లపై సమీక్షించిన అదనపు కలెక్టర్..**

ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ఆదివారం అదనపు కలెక్టర్ వనమాల చంద్రశేఖర్ తన క్యాంప్ ఆఫీస్‌లో అధికారులతో సమీక్షించారు. పెరిగిన కేంద్రాలకు సంబంధించి తూకం యంత్రాలు, కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎంటర్ చేసేందుకు ట్యాబ్‌లు, మ్యాచరైజ్ మిషన్లు, గన్నీ బ్యాగ్‌లు, టార్పాలిన్లు ఎన్ని అవసరం వాటిని ఏ విధంగా తెప్పించాలని వాటిపై డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి, డీసీఓ శ్రీనివాసమూర్తి, డీఎం నాగేశ్వర్‌రావు, మార్కెటింగ్ ఏడీ అలీం, ఏఎస్‌ఓ నిత్యానందం తదితరులతో సమీక్ష నిర్వహించారు.

## రబీ ధాన్యం కొనుగోలుకు చర్యలు

- కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్
- సీఎం వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరు

**నల్లగొండ :** రాష్ట్రంలోని వివిధ జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, వ్యవసాయ శాఖ అధికారులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, జిల్లా స్థాయి అధికారులతో కరోనా వైరస్ నియంత్రణ, రబీలో వరిధాన్యం కొనుగోలుపై సీఎం కేసీఆర్ ఆదివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రబీలో వరిధాన్యం కొనుగోళ్లు, కరోనా వైరస్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ మాట్లాడుతూ రబీ వరిధాన్యం కొనుగోలుపై మంత్రి జగదీశ్‌రెడ్డితో చర్చించామని తెలిపారు. ధాన్యం కొనుగోలుపై జిల్లా కోఆర్డినేషన్ కమిటీ ద్వారా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో దాదాపు 40 వేల ఎకరాల్లో బత్తాయి, నిమ్మ తోటలు ఉన్నాయని, బత్తాయి, నిమ్మ రవాణాకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వీసీలో ఎస్పీ రంగనాథ్, అదనపు కలెక్టర్లు వి.చంద్రశేఖర్, రాహుల్ శర్మ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కొండల్ రావు, డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి, జిల్లా సహకార అధికారి శ్రీనివాసమూర్తి, సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ నాగేశ్వర్‌రావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి తదితరులు పాల్గొన్నారు.



కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, అధికారులు

### పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో సంత ఏర్పాటు

**నాగార్జునసాగర్ :** కరోనా వైరస్ కట్టడికి ప్రభుత్వం విధించిన లాక్‌డౌన్ నేపథ్యంలో గత ఆదివారం నాగార్జునసాగర్‌లో జరిగే సంతను బంద్ చేశారు. అయితే ఈ ఆదివారం పోలీసులు చొరవ తీసుకుని కూరగాయలు విక్రయించేందుకు వచ్చిన రైతులు, వ్యాపారులతో స్థానిక పాత పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో సంతను ఏర్పాటు చేయించారు. ఎస్‌ఐ సీనయ్య, పోలీసు సిబ్బంది దగ్గరుండి వినియోగదారులు సామాజిక దూరాన్ని పాటించేలా పర్యవేక్షించారు. వ్యాపారులు ఎవరు కూడా ధరలకు అమ్మకుండా మార్కెట్ రేటుకు కూరగాయలు విక్రయించేలా తగిన చర్యలు తీసుకున్నారు.

epaper.sakshi.com

# క్వారంటైన్‌లో అనుమానితులు

- విదేశాలు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారికి స్వీయ గృహ నిర్బంధం
- రాజాపేటలో హోంక్వారంటైన్‌లో 54 మంది
- ఆత్మకూర్‌లో ఐదుగురికి క్వారంటైన్ స్టాంపులు వేసిన అధికారులు


గుట్టలో ఓ రాష్ట్రం నుంచి వచ్చిన యువకుడి వివరాలు సేకరిస్తున్న వైద్యులు


ఆత్మకూరు(ఎం): స్టాంప్ వేస్తున్న రెవెన్యూ అధికారులు

**యాదగిరిగుట్ట(ఆలేరు) :** కరోనా వైరస్ వ్యాపిస్తున్న నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనల మేరకు యాదగిరిగుట్ట పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాలకు విదేశాలు, వివిధ రాష్ట్రాల నుంచి తమ సొంత ఇళ్లకు వచ్చిన వారిని వైద్య, ఆరోగ్య, రెవెన్యూ, పోలీస్, మున్సిపల్ అధికారులు మరో ముగ్గురిని గుర్తించారు. యాదగిరిగుట్ట పట్టణానికి ఇటీవల పంజాబ్, బెంగళూర్, ఒరిస్సా ప్రాంతాల నుంచి వచ్చిన ముగ్గురిని వైద్యాధికారి రాజేందర్, పట్టణ ఇన్‌స్పెక్టర్ పాండురంగారెడ్డి, మున్సిపల్ కమిషనర్ జంపాల రజిత, హెల్త్ సూపర్‌వైజర్ జ్యోతిలు పరిశీలించారు. వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని 14రోజుల పాటు హోం క్వారంటైన్‌లోనే ఉండాలని సూచిస్తూ చేతికి స్టాంప్‌ను వేశారు. ఇక ఇటీవల కాలంలో హోం క్వారంటైన్‌లో ఉన్న వ్యక్తుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు యాదగిరిగుట్ట పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా 57మందిలో ఒక్కరు దుబాయ్ నుంచి రాగా, మిగతా వారు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చినట్లు వెల్లడించారు. ఇందులో ఆదివారం వరకు ఆరుగురికి హోం క్వారంటైన్ పూర్తయినట్లు వైద్యులు తెలిపారు. వారి వెంట మున్సిపల్ చైర్మన్ ఎరుకల సుధ, వైస్ చైర్మన్ కాటంరాజు, కౌన్సిలర్లు తాళ్లపల్లి నాగరాజు, గుండ్లపల్లి వాణి భరత్, దండబోయిన అనిల్ యాదవ్ ఉన్నారు.

**ఢిల్లీ వెళ్లి వచ్చిన వ్యక్తిని ఐసోలేషన్‌కు తరలింపు**

**చింతలపాలెం(హుజూర్‌నగర్) :** ఇటీవల ఢిల్లీకి వెళ్లి వచ్చిన మండలంలోని ఓ వ్యక్తికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించిన వైద్యాధికారులు ఆదివారం సూర్యాపేటలోని ఐసోలేషన్ వార్డుకు తరలించారు. మండల వైద్యాధికారి ప్రేమ్‌సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఈనెల 13వ తేదీన ఢిల్లీకి వెళ్లాడు. అక్కడ ఒక మతప్రచార సభలో పాల్గొన్నాడు. అతను ఈనెల 17న తిరిగి వచ్చాడు. ఇంటెలిజెన్స్ అధికారులు ఇచ్చిన సమాచారం ప్రకారం మండల వైద్యాధికారి సిబ్బందితో వెళ్లి అతనికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అతనికి జ్వరంగా ఉండడంతో సూర్యాపేటలోని ప్రభుత్వ ఐసోలేషన్ వార్డుకు తరలించినట్లు తెలిపారు.

**వర్ధమానుకోటలో ఒకరు..**

**నాగారం(తుంగతుర్తి) :** కరోనా వైరస్ నియంత్రణలో భాగంగా వర్ధమానుకోట గ్రామానికి ఈనెల–18న ఢిల్లీ నుంచి వచ్చిన ఎండీ యాదుహుల్లాను ఆదివారం క్వారంటైన్ చేసినట్లు తహసీల్దార్ జి.శ్రీకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్ధమానుకోట గ్రామానికి ఎండీ యాదుహుల్లా అనే వ్యక్తి వచ్చాడని రాష్ట్ర ప్రభుత్వం నుంచి సమాచారం రావడంతో అక్కడికి వెళ్లి ఆ వ్యక్తితో పాటు కుటుంబ సభ్యులకు కరోనాపై కౌన్సిలింగ్ ఇచ్చి, చేతులపై స్టాంపును ముద్రించి, క్వారంటైన్ చేసినట్లు తెలిపారు.

**యాదాద్రి భువనగిరి జిల్లాలో 597మంది..**

**భువనగిరి :** జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఐసోలేషన్ వార్డులో నలుగురు కరోనా అనుమానితులను అబ్జర్వేషన్‌లో ఉంచినట్లు డీఎంహెచ్‌ఓ సాంబశివరావు తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు నిర్వహించిన పరీక్షల్లో ఎవరికీ కరోనా వైరస్ సోకినట్లు నిర్ధారణ కాలేదన్నారు. విదేశాలనుంచి జిల్లాకు 79 మంది రాగా ఇతర రాష్ట్రాల నుంచి 518 మంది వచ్చినట్లు తెలిపారు. వీరందరినీ హోం క్వారంటైన్‌లో ఉంచినట్లు పేర్కొన్నారు.

**హరియాణా, తమిళనాడు నుంచి వచ్చిన వారికి వైద్యపరీక్షలు**

**నడిగూడెం (కోదాడ) :** మండల పరిధిలోని వల్లాపురానికి వరి పొలాలు కోసేందుకు హరియాణా, తమిళనాడు నుంచి వచ్చిన డ్రైవర్లకు ఆదివారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ వట్టికూటి చంద్రయ్య, పంచాయతీ కార్యదర్శి సీహెచ్.అనిల్, వీఆర్వో జిలానీ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**ఐదుగురికి హోమ్ క్వారంటైన్ స్టాంప్‌లు**

**ఆత్మకూరు(ఎం) (ఆలేరు) :** ఆత్మకూరు(ఎం) మండలంలోని రహీంఖాన్‌పేటకు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ఐదుగురికి ఆదివారం రెవెన్యూ అధికారులు హోమ్ క్వారంటైన్ స్టాంప్‌లు వేశారు. వారికి వైద్యపరీక్షలు నిర్వహించి, బయట తిరగకూడదని సూచించారు.

**రామన్నపేట మండలంలో ఐదుగురికి క్వారంటైన్ స్టాంప్‌లు**

**రామన్నపేట(నకిరేకల్) :** మండలంలోని నిధానపల్లి, జనంపల్లి గ్రామాలకు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ఐదుగురికి ఆదివారం మునిపంపుల ఆరోగ్యకేంద్రం వారు క్వారంటైన్ స్టాంప్‌లు వేశారు. వారికి వైద్యపరీక్షలు నిర్వహించారు. 14 రోజుల వరకు ఇంటి నుంచి బయటకు వెళ్లవద్దని, కుటుంబసభ్యులు, ఇతరులకు సామాజిక దూరం పాటించాలని సూచించారు. అదేవిధంగా విదేశాల నుంచి వచ్చి క్వారంటైన్‌లో ఉన్న ముగ్గురు వ్యక్తుల ఆరోగ్యస్థితిని పరిశీలించారు. జియోట్యాగింగ్ ద్వారా వారి ఆరోగ్యస్థితిని ఉన్నతాధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారులు డాక్టర్ రవినాయక్, ఆరోగ్యబోధకుడు బి.సత్యనారాయణ, ఏఎన్ఎం కవిత, పావని ఆశావర్కర్లు పాల్గొన్నారు.

**క్వారంటైన్ నిబంధనలను ఉల్లంఘించిన ఇద్దరిపై కేసు**

**శాలిగౌరారం :** కరోనా వైరస్ విజృంభిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ నిర్దేశిత హోం క్వారంటైన్ నిబంధనలను ఉల్లంఘించిన మండలంలోని ఎన్‌జీ కొత్తపల్లి గ్రామానికి చెందిన పుట్ట రాజు, నిమ్మల వంశీలపై 1897 ఎపిడమిక్ డిసీజ్ యాక్ట్ కింద సెక్షన్–3 తోపాటూ ఐపీసీ 188, 269, 270, 271 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ హరిబాబు ఆదివారం తెలిపారు. ఎన్‌జీ కొత్తపల్లి గ్రామానికి చెందిన నిమ్మల వంశీ ఈనెల 23న మహారాష్ట్ర నుంచి, పుట్ట రాజు ఈనెల 25న చత్తీస్‌ఘడ్ నుంచి ఎన్‌జీ కొత్తపల్లికి వచ్చారు. వెంటనే వారిని గుర్తించిన మండల అధికారులు గ్రామానికి చేరుకొని ఆ ఇద్దరిని ఇల్లువిడిచి బయటకు వెళ్లకుండా హోంక్వారంటైన్(గృహనిర్బంధం)లో ఉండాలని సూచించడంతో పాటు ఆ వ్యక్తులు ఇంటి నుంచి బయటకు రాకుండా చర్యలు చేపట్టారు. అయినప్పటికీ ఆ ఇద్దరు అధికారుల ఆదేశాలను బేఖాతరు చేయడంతో పాటు స్నేహితులతో కలిసి నిత్యం ఆరుబయట తిరుగుతూ విందులు, వినోదాలు చేశారు. ఈ నేపథ్యంలోనే వారిని శనివారం మధ్యాహ్నం పట్టుకొని నల్లగొండ సమీపంలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్వారంటైన్‌కు తరలించిన విషయం విధితమే. నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడినందుకు వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

**88 మందికి జియోట్యాగింగ్**

**భూదాన్‌పోచంపల్లి(భువనగిరి) :** విదేశాలతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి సొంతూళ్లకు వచ్చిన 88 మందికి జియోట్యాగింగ్ వేసినట్లు తహసీల్దార్ దశరథనాయక్ ఆదివారం తెలిపారు. ఇందులో ఆరుగురు దుబాయ్, లండన్, మస్కట్ దేశాల నుంచి రాగా, మిగతా వారు బతుకుదెరువు కోసం వివిధ రాష్ట్రాలకు వెళ్లి ఇటీవల ఇంటికి వచ్చారని తెలిపారు. హోమ్ క్వారైంటీన్‌లో ఉన్న వీరందరికీ జియో ట్యాగింగ్ వేశామని తెలిపారు. తద్వారా వారు హోమ్ క్వారైంటీన్ పాటిస్తున్నారా లేదా, వారి కదలికలను వెంటనే తెలుసుకునే వీలుందన్నారు.

**ఆలేరుకు చెందిన ముగ్గురు క్వారంటైన్‌కు తరలింపు**

**ఆలేరు :** ఢిల్లీ నుంచి వచ్చిన ఆలేరుకు చెందిన ముగ్గురిని ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా అధికారులు, పోలీసులు ఆదివారం సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ నెల 13 నుంచి 17 వరకు ఢిల్లీలో జరిగిన సమావేశంలో పాల్గొని తిరుగు ప్రయాణంలో 178 మంది ఫ్లైట్‌లో హైదరాబాదుకు వచ్చారు. అయితే వీరిలో ఒకరు శనివారం కరోనా వైరస్‌తో చనిపోవడంతో పోలీసులు, వైద్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ క్రమంలో ఢిల్లీ నుంచి వచ్చిన వారిలో ముగ్గురు ఆలేరుకు చెందిన వారు ఉండడంతో ఆదివారం అధికారులు వారిని గుర్తించి సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలోని క్వారంటైన్‌కు తరలించారు.

**హోం క్వారంటైన్‌లో 54 మంది**

**రాజాపేట (ఆలేరు) :** మండలంలోని పలు గ్రామాల్లో 54 మందిని హోంక్వారంటైన్‌లో ఉంచినట్లు మండల వైద్యాధికారి శివవర్మ తెలిపారు. ఆదివారం ఆరోగ్య, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఓ రైస్ మిల్‌లో బీహార్ నుంచి వలస వచ్చిన నలుగురు కూలీల వివరాలు సేకరించారు. స్థానిక బుడిగె జంగాల కాలనీలోకి ఇతర జిల్లా నుంచి వచ్చిన మూడు కుటుంబాల వారికి హోం క్వారంటైన్‌లో ఉండాలని సూచించారు. ఇప్పటివరకు మండలంలో ఒకరు ఇతర దేశం నుంచి వచ్చిన వ్యక్తికి, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన మరో ఇద్దరికి హోం క్వారంటైన్ ముగిసినట్లు తెలిపారు.

**బెటాలియన్‌లో కరోనా నివారణ చర్యలు**

**నల్లగొండ క్రైం :** కరోనా వైరస్ నివారణకు అన్నెపర్తి బెటాలియన్‌లో ఆదివారం అగ్నిమాపక సిబ్బంది సోడియం హైడ్రో క్లోరైడ్‌ను పిచికారీ చేశారు. బెటాలియన్‌లోని శిక్షణ గదులు, నివాస గృహాలు, అంతర్గత రోడ్ల వెంట హైడ్రో క్లోరైడ్‌ను పిచికారీ చేశారు. అదేవిధంగా కొత్తపల్లి గ్రామంలో కరోనా నివారణకు ద్రావణాన్ని పిచికారీ చేశారు.

## కరోనా నివారణకు సహకరించాలి

- ఎమ్మెల్యే రవీంద్రకుమార్


పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే

**కొండమల్లేపల్లి (దేవరకొండ) :** కరోనా వైరస్ నివారణకు ప్రతిఒక్కరూ సహకరించాలని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ కోరారు. కరోనా వైరస్ వ్యాప్తి నివారణకు సోమవారం దేవరకొండ పట్టణంలోని ప్రధాన రహదారిపై సోడియం హైపోక్లోరైడ్ మందును పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైరస్ వ్యాపించకుండా సోడియం హైపోక్లోరైడ్ మందును పిచికారీ చేయిస్తున్నట్లు తెలిపారు. ఎవరికి వారు సామాజిక దూరాన్ని పాటించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పిలుపు మేరకు చేపట్టిన లాక్ డౌన్‌కు అందరూ సహకరించాలన్నారు. అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రాకూడదని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, వడ్త్య దేవేందర్, సీఐ ఆదిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్, ఏఈ రాజు, జయప్రకాశ్, ప్రదీప్, శ్రీశైలం యాదవ్, బొడ్డుపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## దాతలు ముందుకు రావాలి: ఎమ్మెల్యే


కూరగాయలు అందజేస్తున్న ఎమ్మెల్యే బొల్లం

**కోదాడ :** కరోనా వైరస్ నేపథ్యంలో ఇబ్బంది పడుతున్న సామాన్యులను వివిధ రకాలుగా ఆదుకోవడానికి దాతలు ముందుకు రావాలని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ కోరారు. ఆదివారం పట్టణంలోని 19వ వార్డులో కౌన్సిలర్ బత్తిని హనుమంతరావు ఆధ్వర్యంలో ఇంటింటికి కూరగాయలు అందించే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అదే విధంగా 30వ వార్డులో తొగరు రమేష్ ఆధ్వర్యంలో ఇంటింటికి కూరగాయలను అందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే దాతలను అభినందించారు. వీరిని స్ఫూర్తిగా తీసుకొని మరికొంత మంది ముందుకు రావాలని కోరారు.

## 'కరోనా' కట్టడికి పరిశుభ్రత పాటించాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే నోముల

**నాగార్జునసాగర్ :** కరోనా వైరస్ కట్టడికి ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య అన్నారు. ఆదివారం నాగార్జునసాగర్ వద్ద ఏర్పాటు చేసిన తెలంగాణ–ఆంధ్రా సరిహద్దు చెక్‌పోస్టును ఆయన సందర్శించారు. అనంతరం నందికొండ మున్సిపాలిటీ కమిషనర్ పుల్లారావు, టీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కర్ణ బ్రహ్మానందరెడ్డిలతో కలిసి స్థానిక విలేకరులతో మాట్లాడారు. సరిహద్దులోని చెక్‌పోస్టు వద్ద లాక్‌డౌన్‌ను పకడ్బందీగా నిర్వహిస్తున్న పోలీసుల సేవలను ప్రశంసించారు. సోషల్‌మీడియా ప్రచార మాధ్యమాల ద్వారా వైరల్ అయ్యే భయంకరమైన వ్యాధి అని ఆందోళన చెందాల్సిన వసరం లేదన్నారు. నిత్యావసర సరుకుల విక్రయదారులు షాపుల ముందు ధరలను తెలిపే బోర్డులు ఏర్పాటు చేసేలా సంబంధిత అధికారులు చూడాలన్నారు. ఆయన వెంట స్థానిక నాయకులు కౌన్సిలర్లు ఉన్నారు.

## ప్రజలంతా బాధ్యతగా వ్యవహరించాలి


చెక్కు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్

**చిట్యాల:** కరోనా వైరస్‌ను అరికట్టేందుకు ప్రజలంతా బాధ్యతగా వ్యవహరించి లాక్‌డౌన్‌కు సహకరించాలని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య కోరారు. మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, పలువురు టీఆర్ఎస్ నాయకులు కలిసి సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.2లక్షల ఆర్థికసాయాన్ని ఆదివారం ఎమ్మెల్యేకు అందజేశారు. ఇందులో మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్ రెడ్డి రూ.50వేలు, మండల రైతు సంఘం అధ్యక్షుడు కర్నాటి ఉప్పల వెంకట్ రెడ్డి రూ.25వేలు, పాటి మాధవరెడ్డి రూ.25వేలు, హరికా కేబుల్ నెట్ వర్క్ తరఫున రూ.21వేలు, క్లాత్ మర్చంట్ అసోసియేషన్ తరఫున రూ.25 వేలు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మెండె సైదులు, వేలుపల్లి మధుకుమార్ రూ. 10వేలు, లక్ష్మీనర్సింహా రెడ్డి రూ.10వేలు, అదేవిధంగా టీఆర్ఎస్ నాయకుడు బొబ్బల శివశంకర్‌రెడ్డి కూతురు మేదారెడ్డి తన కిడ్డి బ్యాంకులో దాచుకున్న రూ.2,600లతో పాటు మరికొందరు నగదును, చెక్కులను అందజేశారు.

## మటన్, చేపల మార్కెట్ తరలింపు


మటన్ మార్కెట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

**మిర్యాలగూడ :** కరోనా వైరస్ వ్యాప్తి నివారణలో భాగంగా మిర్యాలగూడలోని మటన్, చేపల మార్కెట్‌ను ఆదివారం తరలించారు. స్థానిక నేతాజీ కూరగాయల మార్కెట్, రైతు బజార్ వద్ద ఉండే మటన్ దుకాణాలు, చేపల మార్కెట్‌ను షాబ్‌నగర్‌లోని పాత వ్యవసాయ మార్కెట్‌లోకి మార్చారు. మటన్, చేపల మార్కెట్‌ను,ఎన్ఎస్‌పీ క్యాంపులోని కూరగాయల మార్కెట్‌ను స్థానిక ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు పరిశీలించారు. కూరగాయలు అధిక ధరలకు విక్రయించొద్దని వ్యాపారులకు సూచించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, ఆర్డీఓ రోహిత్‌సింగ్, మున్సిపల్ కమిషనర్ చీమ వెంకన్న డీఈ శ్రీనివాస్, కౌన్సిలర్లు ఉదయ్‌భాస్కర్, మలగం రమేష్ తదితరులు ఉన్నారు.

## అధికారులతో ఎమ్మెల్యే టెలీకాన్ఫరెన్స్

**చింతలపాలెం (హుజూర్‌నగర్) :** కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టడంలో భాగంగా ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి నియోజకవర్గంలోని అధికారులతో ఆదివారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. పట్టణంలోని చికెన్, మటన్ దుకాణాలను హైస్కూల్ ప్రాంగణంలోకి తరలించాలన్నారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## యాదాద్రి ఆలయంలో శాస్త్రోక్త పూజలు


నారసింహ హోమం నిర్వహిస్తున్న ఆచార్యులు

**యాదగిరిగుట్ట (ఆలేరు) :** పంచనారసింహ క్షేత్రంగా విరాజిల్లుతున్న యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి బాలాలయంలో ఆదివారం శ్రీస్వామి అమ్మవార్లకు ఆచార్యులు విశేష పూజలు నిర్వహించారు. సుప్రభాత సేవ చేపట్టి, ప్రతిష్ఠామూర్తులను ఆరాధిస్తూ హారతి నివేదన జరిపారు. ఉత్సవ మూర్తులను పంచామృతాలతో అభిషేకించి, తులసి పత్రాలతో అర్చించారు. దర్శన మూర్తులకు సువర్ణ పుష్పార్చన చేపట్టారు. మహా మండపంలో వేద మంత్రోచ్ఛరణలతో శ్రీసుదర్శన నారసింహ హోమం, విశ్వక్సేన ఆరాధన, గజవాహన సేవ, నిత్య కల్యాణ పర్వాలు కనుల పండువగా నిర్వహించారు. సాయంత్రం ఆలయ మండపంలో సేవోత్సవాన్ని జరిపించారు. రాత్రి 7గంటలకు శ్రీస్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి శయనోత్సవాన్ని నిర్వహించారు.

## కరోనా నివారణకు 'సువెన్' చేయూత


జిల్లా వైద్యశాఖాధికారికి శానిటైజర్లు,మాస్కులు, ఆప్రాన్స్ అందజేస్తున్న కంపెనీ సిబ్బంది

**సూర్యాపేటరూరల్ :** ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న కోవిడ్–19 అరికట్టడంలో భాగంగా ఆదివారం సువెన్ ఫార్మాస్యూటికల్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి ఆదేశానుసారం సూర్యాపేట కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి సూచనల మేరకు జిల్లా వైద్యశాఖాధికారి నిరంజన్‌కు కరోనా నివారణకు ఉపయోగించే రూ. లక్ష విలువైన సామగ్రిని అందజేశారు. కరోనా వైరస్ నివారణలో భాగంగా జిల్లాలో పనిచేస్తున్న సిబ్బందికి ఉపయోగపడే 50 లీటర్ల హ్యాండ్ శానిటైజర్, 5 శాతం హైపోసొల్యూషన్ 100 లీటర్లు, 8 ఫేస్ షీల్డ్స్, 6 సేఫ్టీ ఆప్రాన్స్, 450 మాస్కులు, 4 బాడీ షూట్స్ అందజేశారు. కార్యక్రమంలో సువెన్ కంపెనీ ప్రెసిడెంట్ కేవీ శేషగిరిరావు, ప్రొడక్షన్ డీజీఎం రసూల్ మదీన, సీనియర్ మేనేజర్ బూర రాములు, సేఫ్టీ మేనేజర్ పి.వెంకటరమణ, నాగేంద్రచౌదరి, బాబునాయక్, డి.సైదులు, పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలుకు 12 కేంద్రాలు మంజూరు

**శాలిగౌరారం(తుంగతుర్తి) :** ప్రస్తుత రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలు కోసం మండలానికి 12 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈమేరకు ఐకేపీ ఏపీఎం జానకి, పీఏసీఎస్ సీఈఓ నిమ్మల ఆంజనేయులు ఆదివారం ఇక్కడ విలేకరులకు తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో 10 కేంద్రాలు, పీఏసీఎస్ ఆధ్వర్యంలో రెండు కేంద్రాలు మంజూరైనట్లు తెలిపారు. ఐకేపీ ఆధ్వర్యంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అడ్లూరు, ఆకారం, భైరవునిబండ, చిత్తలూరు, గురుజాల, మనిమద్దె, ఎన్‌జి కొత్తపల్లి, రామాంజాపురం, ఊట్కూరు, శాలిలింగోటం కేంద్రాలు ఉన్నాయి. అదేవిధంగా పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో శాలిగౌరారం (వ్యవసాయ మార్కెట్‌యార్డు), మాధారంకలాన్ గ్రామాలలోని కేంద్రాలు ఉన్నాయి. గురుజాల కేంద్రం పరిధిలో తుడిమిడి, చిత్తలూరు కేంద్రం పరిధిలో ఇటుకులపహాడ్ గ్రామాల్లో సబ్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ఏపీఎం తెలిపారు.

## పలువురు కల్లుప్రియులపై కేసు నమోదు

**వలిగొండ (భువనగిరి) :** తాటిచెట్ల వద్ద గుంపులుగా కూర్చొని కల్లు సేవిస్తుండగా వారిపై స్థానిక ఎస్సై శివనాగ ప్రసాద్ కేసు నమోదు చేసినట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వారిలో వలిగొండ మండలంలోని నాగారంలో 13 మంది, వెల్వర్తిలో ఏడుగురు, దాశిరెడ్డిగూడెంలో ఐదుగురు ఉన్నారు. లాక్‌డౌన్ నేపథ్యంలో ఎవరూ గుంపులుగా ఉండొద్దని ఆయన సూచించారు.

## క్వారంటైన్ పాటించాలి

- కలెక్టర్ అనితారామచంద్రన్

**సాక్షి, యాదాద్రి :** కరోనా అనుమానితులు హోం క్వారంటైన్ తప్పనిసరిగా పాటించాలని యాదాద్రి భువనగిరి కలెక్టర్ అనితారామచంద్రన్ ఆదివారం తెలిపారు. జిల్లాలో నలుగురు ప్రభుత్వ హోమియో ఆస్పత్రిలోని క్వారంటైన్‌లో ఉండగా మరో 80మంది హోం క్వారంటైన్‌లో ఉన్నట్లు పేర్కొన్నారు. 20 మందికి 14 రోజుల క్వారంటైన్ గడువు ముగిసిందని, వారికి ఎలాంటి కరోనా లక్షణాలు లేనప్పటికీ మరికొన్ని రోజులు డాక్టర్ల పర్యవేక్షణలో ఉంచుతామన్నారు. కరోనా వైరస్ నేపథ్యంలో హోం క్వారంటైన్‌లో ఉన్నవారు నిబంధనలు ఉల్లంఘించి బయట తిరగకూడదన్నారు. జిల్లాలో విదేశాల నుంచి వచ్చినవారు హోం క్వారంటైన్‌లో ఇంటి వద్దనే ఉండాలని హెచ్చరించారు. ఎవరైనా హోం క్వారంటైన్ ఉల్లంఘించి బయట తిరిగితే కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్ 18004257106కు తెలియజేయాలని తెలిపారు.

## రెండు తుఫాన్ వాహనాలు సీజ్

**సూర్యాపేటరూరల్ :** దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ అమలులో ఉండగా అక్రమంగా ప్రయాణికులను తరలిస్తున్న రెండు తుఫాన్ వాహనాలను ఆదివారం సూర్యాపేటరూరల్ పోలీసులు మండలంలోని టేకుమట్ల గ్రామం వద్ద జాతీయ రహదారిపై సీజ్ చేశారు. ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. టేకుమట్ల జాతీయ రహదారిపై తనిఖీలు నిర్వహిస్తుండగా హైదరాబాద్ నుంచి విజయవాడకు ఒక్కో వాహనంలో 20 మంది ప్రయాణికులను తరలిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. రెండు తుఫాన్ వాహనాలు సీజ్ చేసి వాహనయజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ వెల్లడించారు.

## 'కరోనా'తో మృతి చెందిన వృద్ధుడితో గుట్టకు చెందిన వ్యక్తుల ప్రయాణం..?

**యాదగిరిగుట్ట(ఆలేరు) :** ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా వైరస్‌తో హైదరాబాద్‌లో శనివారం ఓ వృద్ధుడు(70) మరణించాడు. అయితే యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన ఐదుగురు వ్యక్తులు.. ఈ వృద్ధుడితో కలిసి ఢిల్లీలోని ఓ ప్రార్థనా మందిరంలో ప్రార్థనలు చేసినట్లు తెలిసింది. యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన ముగ్గురు, యాదగిరిగుట్ట మండలంలోని సైదాపురం, వంగపల్లి గ్రామాలకు చెందిన ఇద్దరు ప్రార్థనలు చేసినట్లు సమాచారం. ఈ ఐదుగురు వ్యక్తులు.. ఆ వృద్ధుడితో కలిసి ఢిల్లీనుంచి విమానంలో వచ్చారా లేక వేర్వేరుగా రైలు మార్గంలో వచ్చారా అనే విషయాలు తెలియాల్సి ఉంది. విషయం తెలుసుకున్న వైద్యాఆరోగ్య, పోలీస్ శాఖ అధికారులు అప్రమత్తమై వారికి ఐసోలేషన్ నిర్వహిస్తున్నట్లు తెలిసింది. వృద్ధుడితో ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు వచ్చిన వ్యక్తులు ఎవరనే చర్చ స్థానికంగా జోరుగా సాగుతోంది. వారు వచ్చిన వాహనం ఏమిటి, మృతి చెందిన వృద్ధుడితో ఈ ఐదుగురు వ్యక్తులు ఎన్ని రోజులు ప్రయాణం చేశారు.. వీరంతా ఒకే చోట నుంచి కలిసి వచ్చారా లేక.. వేర్వేరు ప్రాంతాల్లో నుంచి వాహనంలో కలిశారా అనే అంశాలు తెలియాల్సి ఉంది. ఈ విషయమై వైద్యులను వివరణ అడగగా.. ఢిల్లీ నుంచి వచ్చిన ఐదుగురు వ్యక్తులను ఇప్పటికే హోం క్వారంటైన్లలో ఉంచామని, వారిలో ఎవరికీ ఎలాంటి లక్షణాలు లేవని తెలిపారు.

## జాతీయ రహదారిపై చెక్‌పోస్టు ఏర్పాటు


చెక్‌పోస్టును ఏర్పాటు చేస్తున్న ఎస్ఐ

**నాగారం( తుంగతుర్తి) :** కరోనా వైరస్(కోవిడ్–19) వ్యాప్తిని అరికట్టేందుకు మండలకేంద్రంలోని సూర్యాపేట–జనగాం జాతీయ రహదారిపై ఆదివారం ఎస్ఐ ఎం.లింగం చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనాను నివారించేందుకు వాహనాల రాకపోకలను కట్టడి చేయడానికి చెక్‌పోస్టును చేస్తున్నట్లు తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, వాహనం రిజిస్ట్రేషన్ కాగితాలు కలిగి ఉండాలని సూచించారు.

**సాక్షి క్లాసిఫైడ్స్**

**SERVICES**

■వ్యక్తిగత, వ్యవసాయం, ప్రాపర్టీ, బిజినెస్, టేకోవర్, ప్రాజెక్ట్ మరియు సిబిల్ కేసులు వంటి అన్ని రకముల ఋణములు ఇవ్వబడును. సంప్ర।। 7838016584. [W-723337]

**BUSINESS OFFER**

■శ్రీవినాయక క్యాండిల్స్. మైనం కొవ్వొత్తులు మీ ద్వారా తయారు చేయించి బై బ్యాక్ చేసుకోబడును. రోజు అధిక ఆదాయం సంపాదించుకునే అవకాశం. ఫోన్: 78239 61596, 63819 03793 [V- 1578]

**గమనిక**

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచు రించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పం దించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాం టి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## కనిగిరి బాలుడు.. వాటర్‌ట్యాంక్‌తండా వద్ద ప్రత్యక్షం



**మిర్యాలగూడ టౌన్ :** ప్రకాశం జిల్లా కనిగిరి గ్రామానికి చెందిన బాలుడు మిర్యాలగూడ మండలం వాటర్‌ట్యాంక్‌తండా రైల్వేట్రాక్ వద్ద ప్రత్యక్షం అయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మిర్యాలగూడ మండలం వాటర్‌ట్యాంకుతండా వద్ద ఉన్న రైల్వేట్రాక్ పక్కన ఆదివారం ఉదయం తచ్చాడుతున్న బాలుడిని చూసి స్థానికులు మిర్యాలగూడ రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఆ బాలుడిను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అతని పేరు సుబ్రహ్మణ్యం అని, తన నాన్న పేరు కూడా సుబ్రహ్మణ్యం అని, ఊరి పేరు ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా కనిగిరి గ్రామం అని తెలిపాడు. ఇక్కడికి ఎందుకు వచ్చావని అడగగా.. బాతులను మేపేందుకు వచ్చామని చెప్పాడు. తన బంధువులు ఎవరు అని అడిగగా చెప్పలేకపోతున్నాడని పోలీసులు తెలిపారు. అతడు పూర్తి వివరాలు చెప్పలేకపోవడంతో వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామ శివారులో ఉన్న మిరియం అనాథ ఆశ్రమానికి తరలించారు. వివరాలు తెలిస్తే మిర్యాలగూడ రూరల్ పోలీస్‌స్టేషన్‌కు 9440795614ను సంప్రదించాలని ఎస్ఐ పరమేష్ తెలిపారు.

## కృష్ణానదిపై పడవ ద్వారా వ్యక్తి తరలింపు

**దామరచర్ల (మిర్యాలగూడ) :** కృష్ణానదిలో పడవ ద్వారా వ్యక్తిని తరలిస్తుండగా పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేసిన సంఘటన ఆదివారం మండలంలోని వాడపల్లిలో జరిగింది. ఎస్ఐ నర్సింహారావు తెలిపిన వివరాల ప్రకారం.. వాడపల్లికి చెందిన హన్మంతు పడవలో ఏపీలోని అద్దంకికి చెందిన కృష్ణ, అతని ద్విచక్రవాహనాన్ని దాటిస్తుండగా పట్టుకున్నారు. హైదరాబాద్ నుంచి స్వస్థలమైన అద్దంకికి వెళ్తుండగా రూ.3వేలకు మాట్లాడుకొని నది ద్వారా తరలించేందుకు పడవ యజమాని ఒప్పందం కుదుర్చుకున్నాడు. వీరికి సహకరించిన స్థానికులు ప్రేమ్ చందు, లక్ష్మీ శ్రీనివాస్‌లపై కూడా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## తెలంగాణ కూలీలకు మార్గం సుగమం

**చింతలపాలెం(హుజూర్‌నగర్) :** తెలంగాణకు చెందిన కూలీలు ఆంధ్రప్రదేశ్‌లో కూలి పనికి వెళ్లి వస్తుండగా మండలంలోని పులిచింతల ప్రాజెక్ట్ అవతల పోలీస్ అధికారులు అనుమతించకపోవడంతో వారు శనివారం రాత్రి చెక్‌పోస్టు వద్దనే ఉండిపోయారు. ఆదివారం విషయం తెలుసుకున్న కోదాడ రూరల్ సీఐ శివరాంరెడ్డి, ఎస్ఐ నవీన్ ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం గుంటూరు జిల్లా పోలీస్ అధికారులతో మాట్లాడి వారిని స్వస్థలం చివ్వెంల మండలం పాచ్యాతండాకు పంపేందుకు మార్గం సుగమం చేశారు.

## పండ్లను విరివిగా తీసుకోవాలి

**గుర్రంపోడు (నాగార్జునసాగర్) :** ప్రజలు కరోనా వైరస్ బారిన పడకుండా బత్తాయి, నిమ్మ, దానిమ్మ, పుచ్చ, జామ, మామిడి పండ్లను విరివిగా తీసుకోవాలని ప్రాంతీయ ఉద్యానవన శాఖ అధికారి పిన్నపురెడ్డి అనంతరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన సాక్షితో మాట్లాడారు. ఐసీఎంఆర్ నిబంధనల మేరకు ప్రతి మనిషి రోజుకు సగటున 100 గ్రాముల పండ్లు తీసుకోవాలన్నారు. బత్తాయి రసంలో పోషక విలువలతోపాటు ఔషధ గుణాలు అధికంగా ఉంటాయన్నారు. విటమిన్– సీ పుష్కలంగా లభించడంతోపాటు పీచు పదార్థాలు, జింక్, కాపర్, ఐరన్ లభిస్తుందని, క్యాలరీలు, ఫ్యాట్ చాలా తక్కువ ఉంటుందన్నారు. ఉదర సంబంధిత రోగాలకు బత్తాయి పండ్లు చెక్ పెడతాయని, రోజు ఒక గ్లాస్ బత్తాయి రసం తీసుకోవాలని సూచించారు. ఈ రసంతో గుండె జబ్బులు నివారించబడతాయన్నారు. నిమ్మకాయల్లో విటమిన్–సీ, పీచు పదార్థాలు పుష్కలంగా ఉంటాయని, బరువు నియంత్రణకు, జీర్ణకోశ సంబంధిత వ్యాధులకు నిమ్మ మేలు చేస్తుందన్నారు. పుచ్చకాయ తినడం వల్ల రక్తహీనత తగ్గడంతోపాటు సైనసైటీస్ నివారణకు తోడ్పడుతుందన్నారు. ఒక్క జామపండు తింటే పది యాపిల్ పండ్లు తిన్నంత మేలు కలుగుతుందన్నారు. మామిడి జలుబు, ఊపిరితిత్తుల రోగాలను అరికడుతుందని తెలిపారు.

సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం
30-3-2020


**స్టాక్ మార్కెట్లు** (శుక్రవారం ముగింపు)

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 131 ▼ | 19 ▲ |
| 29,816 | 8,660 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు**

| సూచీ | ముగింపు | మార్పు |
|---|---|---|
| నాస్‌డాక్ | 7,502 | ▼ 295 |
| డోజోన్స్ | 21,637 | ▼ 916 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 5,510 | ▼ 305 |
| డాక్స్ | 9,633 | ▼ 368 |
| షాంఘై | 2,772 | ▲ 7 |
| నిక్కాయ్ | 19,389 | ▲ 725 |

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

**ఫారెక్స్ రేట్లు** రూ. లలో

| | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | 72.52 | 77.49 |
| £ | బ్రిటన్ పౌండ్ | 89.25 | 94.09 |
| € | యూరో | 79.94 | 85.19 |
| ¥ | జపాన్ ఎన్ (100) | 59.00 | 76.00 |
| AUS | ఆస్ట్రేలియా డాలర్ | 43.48 | 47.96 |
| SS | సింగపూర్ డాలర్ | 50.61 | 54.44 |
| SAR | సౌదీ రియాల్ | 18.92 | 20.79 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | 19.06 | 21.70 |
| ¥ | చైనా యువాన్ | 9.43 | 11.19 |



## ఎండోమెంట్ ప్లాన్లు

# బీమా.. రాబడి.. రెండూ కావాలంటే!

### పన్ను ప్రయోజనాలు ● అవసరాలకు అనుగుణంగా ఎంపికకు వీలు

*యూనిట్ లింక్డ్ పాలసీల్లో ఇన్వెస్ట్ చేస్తే స్టాక్ మార్కెట్ పతనాల్లో చేతికి అందేదేమీ ఉండదు. టర్మ్ ప్లాన్లలో తక్కువకే ఎక్కువ పరిహారం వస్తున్నా... చెల్లించిన ప్రీమియం పాలసీదారులు జీవించి ఉంటే వెనక్కి రాదు. ఒకవేళ పాలసీ కాల వ్యవధిలో దురదృష్టవశాత్తూ మరణిస్తే పరిహారం రావాలి.. లేదా జీవించి ఉన్నా తాము చెల్లించిన మొత్తానికి హామీతో కూడిన రాబడి కలసి అందుకోవాలి. అందుకే వ్యక్తిగత ఆర్థిక ప్రణాళికల్లో అత్యధికులు ఎండోమెంట్ ప్లాన్లకు చోటిస్తుంటారు. ఆకర్షణీయమైన ఎండోమెంట్ ప్లాన్ల వివరాలు చూస్తే...*

### హెచ్‌డీఎఫ్‌సీ సంచయ్ ప్లస్

పాలసీదారులకు హామీతో కూడిన (గ్యారంటీడ్) రాబడులను ఆఫర్ చేస్తుంది. ఈ పాలసీలో నాలుగు ఆప్షన్లు ఉన్నాయి. గ్యారంటీడ్ మెచ్యూరిటీ.. అంటే కాల వ్యవధి ముగిసిన తర్వాత హామీ మేరకు చెల్లించేది. గ్యారంటీడ్ ఇన్‌కమ్, లైఫ్‌లాంగ్ ఇన్‌కమ్, లాంగ్ టర్మ్ ఇన్‌కమ్ ఆప్షన్లు కూడా ఉన్నాయి. ఐదేళ్ల ప్రీమియం చెల్లించే వ్యవధి ఎంచుకున్న వారికి పదేళ్లకు.. ఆరేళ్ల ప్రీమియం చెల్లింపును ఎంచుకుంటే 12 ఏళ్లకు.. పదేళ్ల ప్రీమియం కాల వ్యవధిని ఎంచుకున్న వారికి 20 ఏళ్లకు హామీ ఇచ్చిన మేరకు ఏక మొత్తంలో కంపెనీ చెల్లిస్తుంది. గ్యారంటీడ్ ఇన్‌కమ్ ఆప్షన్‌లో.. పాలసీ కాల వ్యవధి పూర్తయ్యే వరకు కంపెనీ నిర్ణీత మొత్తాన్ని చెల్లిస్తుంది. అలాగే, లైఫ్‌లాంగ్ ఇన్‌కమ్‌లో.. పాలసీదారునికి 99 ఏళ్లు వచ్చే వరకు చెల్లింపులు చేస్తుంది. లాంగ్‌టర్మ్ ఇన్‌కమ్ ఆప్షన్‌లో 25 ఏళ్ల పాటు చెల్లింపులు జరుగుతాయి. అన్ని ఆప్షన్లలోనూ పాలసీ కాల వ్యవధి ముగిసిన తర్వాత రెండేళ్ల నుంచి చెల్లింపులు మొదలవుతాయి. పాలసీ కాల వ్యవధిలో మరణిస్తే.. సమ్ ఇన్సూర్డ్ లేదా అప్పటి వరకు ప్రకటించిన గ్యారంటీడ్ అడిషన్స్‌తో కూడిన మెచ్యూరిటీ ప్రయోజనాలను.. ఏది ఎక్కువ అయితే అది చెల్లిస్తారు. ఇంటర్నల్ రేట్ ఆఫ్ రిటర్న్ 40 ఏళ్ల వ్యక్తికి 5–5.5% మధ్య ప్రస్తుతం ఉంది. ప్రీమియం చెల్లింపు కాలం ఎక్కువ ఉంటే రాబడుల రేటూ ఎక్కువగా వస్తుంది.

### ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎస్‌ఐపీ

ఇది హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ సంచయ్ ప్లస్ మాదిరి ప్లాన్. రెండు రకాల ప్లాన్ ఆప్షన్లను అందిస్తోంది. పదేళ్ల ప్లాన్‌కు ఐదేళ్లు, 15 ఏళ్ల ప్లాన్‌కు ఏడేళ్ల పాటు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. గరిష్టంగా 60 ఏళ్ల వయసు వరకు పాలసీని తీసుకోవచ్చు. గ్యారంటీడ్ అడిషన్స్, గ్యారంటీడ్ లంప్‌సమ్ మొత్తాన్ని చెల్లిస్తారు. గ్యారంటీడ్ అడిషన్స్ అన్నవి ఏడాదికోసారి పాలసీకి జోడించడం జరుగుతుంది. పాలసీ కాల వ్యవధిని అనుసరించి ఇది ఏటా 10–15% మధ్య ఉండొచ్చు. మరణ పరిహారం సమ్ అష్యూరెన్స్ లేదా గ్యారంటీడ్ మెచ్యూరిటీ ప్రయోజనం ఏది ఎక్కువ అయితే ఆ మొత్తాన్ని చెల్లిస్తారు. గడువు తీరిన తర్వాత ప్రయోజనం ఏకమొత్తంలో తీసుకునే ఆప్షన్ ఒక్కటే ఉంది. క్రమం తప్పకుండా ఆదాయం కోరుకుంటే తిరిగి ఇన్వెస్ట్ చేసుకోవాల్సిందే.

#### వీటిని గుర్తుంచుకోవాలి..

ఎండోమెంట్ పాలసీల్లో సరెండర్ చార్జీలు అధికం. అంటే పాలసీదారులు గడువు తీరకుండానే పాలసీని స్వాధీనం చేయాలనుకుంటే నష్టపోయేది ఎక్కువ. అలాగే, పార్టిసిపేటింగ్ ప్లాన్లలో బోనస్‌లకు గ్యారంటీ లేదు. ఎండోమెంట్ ప్లాన్లలో రాబడులు నికర రాబడి రేటు తక్కువే. కానీ, ఇందులో మెచ్యూరిటీ తీరిన తర్వాత చేసే చెల్లింపులపై ఎటువంటి పన్ను ఉండదు. మరణంపై వచ్చే పరిహారానికి కూడా పన్ను మినహాయింపు ఉంటుంది. కనుక పన్ను ఆదాను పరిగణనలోకి తీసుకుంటే రాబడి రేటు ఫిక్స్‌డ్ డిపాజిట్ల స్థాయిలో ఉంటుందని భావించొచ్చు. బీమా పాలసీలకు చేసే ప్రీమియంను సెక్షన్ 80సీ కింద గరిష్టంగా రూ.1.5 లక్షల వరకు పన్ను ఆదా పొందొచ్చు.

### ఎస్‌బీఐ లైఫ్ స్మార్ట్ ప్లాటినా అష్యూర్

50 ఏళ్లు, ఆలోపు వయసున్న ఎవరైనా ఈ ప్లాన్ తీసుకునేందుకు అర్హులే. 12 ఏళ్లు, 15 ఏళ్ల కాల వ్యవధితో వస్తాయి. 12 ఏళ్ల పాలసీకి ఆరేళ్లు, 15 ఏళ్ల పాలసీకి ఏడేళ్లపాటు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. త్రైమాసికం, అర్ధ సంవత్సరం ప్రీమియం చెల్లింపు ఆప్షన్లు లేవు. అలాగే, ఈ పాలసీలో కనీస వార్షిక ప్రీమియం రూ.50,000. ఈ పాలసీలో ఇంటర్నల్ రేటు ఆఫ్ రిటర్న్ (ఐఆర్ఆర్) 5.5 శాతంగా ఉంది.

### ఐసీఐసీఐ లక్ష్య లైఫ్‌లాంగ్

ప్రీమియం చెల్లించిన ఐదేళ్ల తర్వాత నుంచి పాలసీదారులకు ఇందులో ఏటా ఆదాయం లభిస్తుంది. పాలసీదారు మరణించేంత వరకు లేదా 99 ఏళ్ల వయసు వచ్చే వరకు ఈ చెల్లింపులు కొనసాగుతాయి. ఎంత మేర ప్రీమియం చెల్లించడానికి అంగీకారం తెలిపారన్న దాని ఆధారంగా పాలసీ జారీ చేసే సమయంలోనే గ్యారంటీడ్ చెల్లింపులు ఎంత మేర అన్నవి నిర్ణయమవుతాయి. 15 ఏళ్ల ప్రీమియం చెల్లింపు ఆప్షన్‌లో 50 ఏళ్ల వయసు వారి వరకే ఈ పాలసీని తీసుకునేందుకు అవకాశం ఉంది. 12 ఏళ్ల ప్రీమియం చెల్లింపు ఆప్షన్‌లో ప్రవేశానికి గరిష్ట వయసు 53 ఏళ్లు. అదే విధంగా పదేళ్ల ప్రీమియం ఆప్షన్‌లో గరిష్ట ప్రవేశ వయసు 55 ఏళ్లు.

### ఎల్‌ఐసీ జీవన్ ఆనంద్

50 ఏళ్ల వయసు, ఆలోపున్న వారు పాలసీ తీసుకునేందుకు అర్హులు. కనీస పాలసీ కాల వ్యవధి 15 ఏళ్లు. గరిష్టంగా 35 ఏళ్ల కాలానికి పాలసీ తీసుకోవచ్చు. పూర్తి పాలసీ కాలవ్యవధి వరకు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. పాక్షిక కాలానికే ప్రీమియం ఆప్షన్ లేదు. పాలసీ అమల్లో ఉన్న కాలంలో మరణం చోటు చేసుకుంటే సమ్ అష్యూరెన్స్ మొత్తాన్ని చెల్లిస్తారు. కాల వ్యవధి తీరే వరకు జీవించి ఉంటే అప్పటి వరకు సమకూరిన బోనస్‌లు అందుకోవచ్చు. అయితే, ఈ పాలసీ కాల వ్యవధి తీరిన తర్వాత కూడా పాలసీదారునికి జీవితాంతం బీమా రక్షణ కొనసాగుతుంది. అంటే కాల వ్యవధి తీరిన తర్వాత ఒకసారి ప్రయోజనం చెల్లించగా, తిరిగి పాలసీదారు మరణానంతరం నామినీలకు సమ్ అష్యూరెన్స్‌ను చెల్లిస్తారు. ప్రతీ రూ.1,000 సమ్ అష్యూరెన్స్ మొత్తంపై 15 ఏళ్ల కాల వ్యవధి ఎంచుకున్న వారికి 2018–19 సంవత్సరానికి జీవన్ ఆనంద్ పాలసీలో రూ.41ను బోనస్‌గా ప్రకటించారు. 16–20 ఏళ్ల కాల వ్యవధి ఎంచుకున్న వారికి ప్రతీ రూ.1,000 బీమాపై ప్రకటించిన బోనస్ రూ.45. అదే 20 ఏళ్లకు పైగా కాల వ్యవధి కలిగిన పాలసీదారులకు రూ.1,000 బీమాపై రూ.49 బోనస్ అందుకున్నారు.

### హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ సంచయ్ ప్లస్

ఇది కూడా హోల్‌లైఫ్ పాలసీయే. అంటే జీవితాంతం బీమా రక్షణ కల్పించే ఉత్పత్తి. 55–65 ఏళ్ల వయసు వరకు ఈ పాలసీని తీసుకోవచ్చు. ఎంచుకునే వ్యవధిపై ఇది ఆధారపడి ఉంటుంది. 100లో తమ వయసును తీసివేయగా మిగిలే కాలానికి పాలసీ వర్తిస్తుంది. లేదంటే 30 నుంచి 40 ఏళ్ల కాలానికీ పాలసీని ఎంపిక చేసుకోవచ్చు. ఆరు, ఎనిమిది, పది, పన్నెండేళ్ల ప్రీమియం చెల్లింపు ఆప్షన్లలో అనుకూలమైనదానిని ఎంచుకోవచ్చు. తక్షణ ఆదాయం (ఇమీడియట్ ఇన్‌కమ్), తర్వాత ఆదాయం (డిఫర్డ్ ఇన్‌కమ్) అనే ఆప్షన్లు ఉన్నాయి. తక్షణ ఆదాయ ఆప్షన్ ఎంచుకుంటే, ఏటా ప్రకటించే బోనస్‌ను చెల్లించడం జరుగుతుంది. గడువు తీరిన తర్వాత జీవించి ఉంటే అప్పటి వరకు చెల్లించిన ప్రీమియంకు సమాన మొత్తం ఒకే సారి చెల్లిస్తారు. అదే తర్వాత తీసుకునే ఆదాయ ఆప్షన్‌లో.. హామీతో కూడిన ఆదాయం, క్యాష్ బోనస్‌ను ప్రీమియం చెల్లింపు గడువు తీరిన ఏడాది తర్వాత నుంచి పాలసీ గడువు ముగిసే వరకు చెల్లించడం మొదలవుతుంది. ప్రీమియం చెల్లింపు గడువు తీరిన నాటి నుంచి పాలసీ ముగియడానికి వరకు ఉండే కాలం లేదా 25 ఏళ్లు ఈ రెండింటిలో ఏది తక్కువ అయితే అప్పటి వరకు ఏటా ఈ చెల్లింపులు జరుగుతాయి. గడువు తీరిన తర్వాత సమ్ అష్యూర్డ్, టర్మినల్ బోనస్ చెల్లిస్తారు.

### వేదాంత డైరెక్టర్‌గా అనిల్ అగర్వాల్



**న్యూఢిల్లీ:** మైనింగ్ మ్యాగ్నెట్ అనిల్ అగర్వాల్.. వేదాంత కంపెనీలో తొలిసారిగా డైరెక్టర్‌గా నియమితులయ్యారు. లండన్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న వేదాంత రిసోర్సెస్‌కు అధినేతగా అనిల్ అగర్వాల్ వ్యవహరిస్తున్నారు. అనిల్ అగర్వాల్(66)ను నాన్–ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా నియమించామని వేదాంత లిమిటెడ్ తెలిపింది. ఇప్పటివరకూ ఈ బాధ్యతలను అనిల్ అగర్వాల్ సోదరుడు నవీన్ నిర్వర్తించారని, ఇప్పటి నుంచి ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్‌గా నవీన్ వ్యవహరిస్తారని పేర్కొంది. కంపెనీ సీఈఓ ఎస్. వెంకటకృష్ణన్ రాజీనామా చేయడంతో ఈ మార్పులు జరిగాయని వివరించింది. మరోపక్క, హిందుస్తాన్ జింక్‌కు హెడ్‌గా ఉన్న సునీల్ దుగ్గల్‌ను వేదాంత సీఈఓగా నియమించామని తెలిపింది.

## కరోనా వార్తలే కీలకం

- ఏప్రిల్ 2న శ్రీరామ నవమి సెలవు
- ట్రేడింగ్ నాలుగు రోజులే...

కరోనా వైరస్ మహమ్మారికి సంబంధించిన తాజా వార్తలే ఈ వారం స్టాక్ మార్కెట్ గమనంపై ప్రభావం చూపనున్నాయి. అంతర్జాతీయ సంకేతాలు కూడా కీలకం కానున్నాయి. శ్రీరామ నవమి సందర్భంగా ఈ గురువారం (ఏప్రిల్ 2) సెలవు కావడంతో ఈ వారంలో ట్రేడింగ్ 4 రోజులకే పరిమితం కానున్నది. డాలర్‌తో రూపాయి మారకం విలువ, విదేశీ, దేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల సరళి, ప్రపంచ మార్కెట్ల పోకడ... ఈ అంశాలు కూడా స్టాక్ మార్కెట్ కదలికలను నిర్దేశించనున్నాయి.

**ఈ నెల 31న ఐఐపీ గణాంకాలు....**

ఈ నెల 31న(మంగళవారం) మార్కెట్ ముగిసిన తర్వాత ఫిబ్రవరి నెల పారిశ్రామికోత్పత్తి గణాంకాలు వస్తాయి. బుధవారం(ఏప్రిల్ 1న) వాహన కంపెనీలు మార్చి విక్రయ గణాంకాలను వెల్లడిస్తాయి. ఈ గణాంకాల ప్రభావం ఆయా కంపెనీలపై ఉండనున్నది. ఇక గురువారం(ఏప్రిల్ 2) తయారీ రంగ (పీఎమ్ఐ) గణాంకాలు వస్తాయి.

**పరిమితంగానే ప్యాకేజీల ప్రభావం..!**

కరోనా వైరస్ ప్రభావం ఏమేరకు ఉండనున్నదో తేలేదాకా, కేంద్ర ప్రభుత్వం, ఆర్‌బీఐలు ప్రకటించిన ప్యాకేజీల ప్రభావం పరిమితంగానే ఉంటుందని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఎనలిస్ట్ వినోద్‌నాయర్ పేర్కొన్నారు. గత వారం వచ్చిన రిలీఫ్ ర్యాలీ నేపథ్యంలో క్వాలిటీ షేర్లలోనే ఇన్వెస్ట్ చేయాలని ఆయన సూచిస్తున్నారు. కాగా ప్రస్తుత అనిశ్చిత పరిస్థితి మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం చూపిస్తుందని రిలయన్స్ సెక్యూరిటీస్ ఎనలిస్ట్ వికాస్ జైన్ అభిప్రాయపడ్డారు. మొత్తం మీద ట్రెండ్ బేరిష్‌గానే ఉందని రెలిగేర్ బ్రోకింగ్ ఎనలిస్ట్ అజిత్ మిశ్రా పేర్కొన్నారు. కరోనా సంక్షోభం ఎంత కాలం కొనసాగుతుందో స్పష్టత లేనందున మార్కెట్లో ఒడిదుడుకులు కొనసాగుతాయని మోతిలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఎనలిస్ట్ సిద్ధార్థ ఖేమ్కా వ్యాఖ్యానించారు.



#### లక్ష కోట్ల విదేశీ నిధులు వెనక్కి

కరోనా వైరస్ కల్లోలం అంతర్జాతీయంగా మాంద్యం భయాలను పెంచుతుండటంతో విదేశీ ఇన్వెస్టర్లు మన క్యాపిటల్ మార్కెట్ నుంచి భారీగా పెట్టుబడులను వెనక్కి తీసుకుంటున్నారు. గత ఏడాది సెప్టెంబర్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకూ నికర పెట్టుబడిదారులుగా నిలిచిన విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐ) ఈ ఒక్క నెలలోనే రూ. లక్షకోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. ఈక్విటీ మార్కెట్ నుంచి రూ.59,377 కోట్లు, డెట్ మార్కెట్ నుంచి రూ.52,811 కోట్ల పెట్టుబడులు... వెరసి మొత్తం రూ.1,12,288 కోట్లు ఉపసంహరించుకున్నారు. ఒక్క నెలలో ఎఫ్‌పీఐలు ఈ స్థాయిలో పెట్టుబడులను ఉపసంహరించుకోవడం బహుశా ఇదే మొదటిసారి.

## ఆఫీస్ నుంచే పని... మూడు రెట్ల జీతం

#### ఎమ్‌సీఎక్స్ నిర్ణయం



**ముంబై:** కరోనా వైరస్ కల్లోలంతో పలు కంపెనీలు ఇంటి నుంచే పనిని ప్రోత్సహిస్తున్నాయి. అయితే కమోడిటీ ఎక్స్ఛేంజ్, ఎమ్‌సీఎక్స్ మాత్రం కార్యాలయాల నుంచి విధులు నిర్వహించే ఉద్యోగులకు మూడు రెట్ల వేతనం చెల్లించనున్నది. ఎమ్‌సీఎక్స్‌లో దేశవ్యాప్తంగా 400 మంది పనిచేస్తుండగా, ఒక్క ముంబైలోనే 300 మంది పనిచేస్తున్నారు. గత శుక్రవారం నుంచి 50 మంది కీలక ఉద్యోగులు ఆఫీసులోనే ఉంటూ విధులు నిర్వహిస్తున్నారని ఎమ్‌సీఎక్స్ తెలిపింది. వారికి కావలసిన రోజువారీ అవసరాలను సమకూరుస్తున్నామని, ఎక్స్ఛేంజ్ బిల్డింగ్‌లోనే బస సౌకర్యాలు కల్పిస్తున్నామని పేర్కొంది. ఇంత రిస్క్ తీసుకుంటున్నందుకు వీరికి రెట్టింపు జీతం ఇవ్వాలని నిర్ణయించామని వివరించింది. కొంత మందికి మూడు రెట్లు కూడా ఇవ్వనున్నామని పేర్కొంది.

## సెన్సెక్స్ 31,990 స్థాయిని అధిగమిస్తేనే...

#### మార్కెట్ పంచాంగం

కరోనావైరస్ వివిధ దేశాల్లో ఉధృతమైనప్పటికీ, పలు దేశాల ప్రభుత్వాలు, కేంద్ర బ్యాంకులు తీసుకున్న అసాధారణ చర్యలతో గత వారాంతంలో ఈక్విటీ మార్కెట్ల పతనానికి తాత్కాలికంగా అడ్డుకట్ట పడింది. ఇండియాలో ఇప్పటికే పేదవర్గాలకు కేంద్రం రూ.1.70 కోట్ల ప్యాకేజీని ప్రకటించగా, రిజర్వుబ్యాంక్ వడ్డీ రేట్లను భారీగా తగ్గించి, రిటైలర్లు, చిన్న సంస్థల రుణ చెల్లింపులకు ఉపశమనాన్ని కల్గించింది. అయితే పూర్తిగా స్తంభించిన దేశ ఆర్థిక వ్యవస్థకు... ఈ ఉద్దీపన ఎంత మాత్రం సరిపోదు. కేంద్రం, ఆర్‌బీఐలు...ద్రవ్యలోటు అదుపును, ద్రవ్యోల్బణ లక్ష్యాల్ని పక్కనపెట్టి, మరింత భారీ ప్యాకేజీల్ని ప్రకటించకపోతే...మన మార్కెట్లు స్వల్పకాలంలో మరో భారీ పతనాన్ని చవిచూసే ప్రమాదం లేకపోలేదు. ఇక మన సూచీల స్వల్పకాలిక సాంకేతికాలు ఇలా వున్నాయి.....

**సెన్సెక్స్ సాంకేతికాంశాలు...**




మార్చి27తో ముగిసినవారం ప్రథమార్థంలో 25,639 పాయింట్ల కనిష్టస్థాయికి పతనమైన బీఎస్‌ఈ సెన్సెక్స్... ద్వితీయార్థంలో 31,126 పాయింట్ల గరిష్టస్థాయివరకూ కోలుకుంది. చివరకు అంతక్రితం వారం ముగింపుతో పోలిస్తే 100 పాయింట్ల స్వల్పనష్టంతో 29,816 పాయింట్ల వద్ద ముగిసింది. గత శుక్రవారం అమెరికా స్టాక్ సూచీలు భారీ లాభాల స్వీకరణకు లోనైన కారణంగా ఈ సోమవారం గ్యాప్‌డౌన్‌తో సెన్సెక్స్ మొదలైతే తొలుత 28,560 పాయింట్ల వద్ద మద్దతు లభిస్తున్నది. ఈ మద్దతు కోల్పోతే 27,460 పాయింట్ల స్థాయికి తగ్గవచ్చు. ఈ స్థాయిని సైతం వదులుకుంటే 26,360 పాయింట్ల వరకూ పడిపోవొచ్చు. ఈ వారం తొలి మద్దతుస్థాయిని పరిరక్షించుకున్నా, పాజిటివ్‌గా మొదలైనా 30,100 పాయింట్ల వద్ద తొలి అవరోధం కలగవచ్చు. అటుపైన ముగిస్తే వేగంగా 30,800 పాయింట్ల స్థాయిని అందుకోవొచ్చు. ఈ స్థాయిని సైతం ఛేదిస్తే 31,125–31,990 పాయింట్ల శ్రేణి వరకూ పెరిగే అవకాశం వుంటుంది. 42,278 పాయింట్ల రికార్డు గరిష్టం నుంచి 25,639 పాయింట్ల గతవారపు కనిష్టస్థాయివరకూ జరిగిన పతనంలో 38.2 శాతం రిట్రేస్‌మెంట్ స్థాయి అయిన 31,990 పాయింట్లపైన స్థిరపడితేనే...భారీ పతనాలకు సెన్సెక్స్ స్వస్తిచెప్పగలుగుతుంది.

**నిఫ్టీ తక్షణ మద్దతు 8,305...**




క్రితంవారం ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 7,511 పాయింట్ల వరకూ పతనాన్ని కొనసాగించిన తర్వాత 9,040 పాయింట్ల వరకూ వేగంగా కోలుకుంది. చివరకు అంతక్రితంవారంతో పోలిస్తే 85 పాయింట్ల స్వల్ప నష్టంతో 8,660 పాయింట్ల వద్ద ముగిసింది. ఈ వారం నిఫ్టీ గ్యాప్‌డౌన్‌తో ప్రారంభమైతే 8,305 పాయింట్ల వద్ద తక్షణ మద్దతు లభించవచ్చు. ఈ స్థాయిని సైతం వదులుకుంటే 8,035 పాయింట్ల స్థాయికి తగ్గవచ్చు. ఈ లోపున 7,715 పాయింట్ల వరకూ పతనం కొనసాగవచ్చు. ఈ వారం తొలి మద్దతుస్థాయిని పరిరక్షించుకోగలిగినా, పాజిటివ్‌గా మొదలైనా నిఫ్టీ 8,750 పాయింట్ల స్థాయిని అందుకోవొచ్చు. అటుపైన ముగిస్తే తిరిగి 9,040 పాయింట్ల వరకూ పెరగవచ్చు. ఆపైన 9,130–9,390 పాయింట్ల శ్రేణి వరకూ రిలీఫ్ ర్యాలీ జరగవచ్చు. సెన్సెక్స్‌లానే నిఫ్టీ 12,430 పాయింట్ల రికార్డుస్థాయి నుంచి 7,511 పాయింట్ల వరకూ చవిచూసిన 4,919 పాయింట్ల నష్టానికి 38.2 శాతం ఫిబోనకి రిట్రేస్‌మెంట్ స్థాయి అయిన 9,390 పాయింట్లపైన స్థిరపడితేనే పతన ప్రమాదం తప్పుతుంది.

– పి. సత్యప్రసాద్

## విదేశీ ఇన్వెస్టర్లు అమ్మేస్తున్నారు.. ఏం చేయాలి?

**Q & A**



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

**నేను గత కొంతకాలంగా కోటక్, యాక్సిస్, డీఎస్‌పీ ఫండ్స్‌ల్లో సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్(సిప్) విధానంలో ప్రతి నెలా ఇన్వెస్ట్ చేస్తున్నాను. కనీసం పదేళ్లు ఇన్వెస్ట్ చేయడానికి వీటిని ఎంచుకున్నాను. ఇన్వెస్ట్ చేయడానికి ఈ ఫండ్స్ సరైనవేనా ?** *–మహేందర్, విజయవాడ*

ఈఎల్‌ఎస్‌ఎస్(ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్) కేటగిరీలో మీరు ఎంచుకున్న మూడు ఫండ్స్ మంచివే. ఈ కేటగిరీలో మంచి పనితీరు కనబరిచే కొన్ని ఫండ్స్‌లో ఇవి కూడా ఉన్నాయి. అయితే మీ పోర్ట్‌ఫోలియోలో ఒకే కేటగిరీ ఫండ్స్ మూడు ఉండటం సరైనది కాదు. ఒకటి లేదా గరిష్టంగా రెండు ఫండ్స్ చాలు. అందుకని ఈ మూడింట్లో రెండు ఫండ్స్‌లోనే సిప్‌లు కొనసాగించండి. మిగిలిన ఫండ్‌లోని ఇన్వెస్ట్‌మెంట్‌ను ఏదైనా ఈక్విటీ ఫండ్‌లో గానీ, మిడ్–క్యాప్ ఫండ్‌కు గానీ బదిలీ చేయండి. ఈఎల్‌ఎస్‌ఎస్‌లో ఇన్వెస్ట్ చేయడం వల్ల ఆదాయపు పన్ను చట్టం సెక్షన్ 80 సీ కింద రూ. లక్షన్నర వరకూ పన్ను రాయితీలు పొందే అవకాశాలున్నాయి.

**ఈ ఏడాది మార్చికి ఆరు నెలల ముందు వరకూ విదేశీ ఇన్వెస్టర్లు స్టాక్ మార్కెట్లో నికర కొనుగోలుదారులుగా నిలిచారు. ఈ మార్చిలో భారీగా అమ్మేసారు.. మన స్టాక్ మార్కెట్ జోరుకు విదేశీ పెట్టుబడులే కీలకం అనే విషయం తెలిసిందే. విదేశీ ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్న నేపథ్యంలో ఒక సాధారణ ఇన్వెస్టర్‌గా నేను ఏం చేయాలి?** *–సిరి, హైదరాబాద్*

స్టాక్ మార్కెట్ల పతనం మన దేశానికే పరిమితం కాలేదు. ప్రపంచవ్యాప్తంగా పడిపోతూనే ఉన్నాయి. షేర్ల ధరలు మరింతగా క్షీణిస్తాయనే భయాలతో అన్ని రకాల ఇన్వెస్టర్లు అమ్మకాలకు పాల్పడుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు పలు ప్యాకేజీలను ప్రకటిస్తున్నాయి. ఆర్థిక వ్యవస్థ వృద్ధిపై కారు మేఘాలు కమ్ముకున్నాయి. మార్కెట్ పతనం మరికొంత కాలం కొనసాగుతుంది. కరోనా వైరస్ సంక్షోభం అంతకంతకూ తీవ్రమవుతున్న నేపథ్యంలో నష్టాలు ఏ స్థాయిలో ఉంటాయో అని అంచనా వేయడం ఒక విధంగా వృధా పని. మీరు దీర్ఘకాలిక ఇన్వెస్టర్ అయితే, కామ్‌గా మార్కెట్‌ను పరిశీలిస్తూ కూర్చోండి. మీ షేర్లను ఉన్నపళంగా అమ్మేయకండి. అలాగని తక్కువ ధరల్లో దొరుకుతున్నాయి కదాని ఏడా పెడా కొనుగోళ్లు చేయకండి. మార్కెట్లో కల్లోలం కుదుటపడటానికి కనీసం ఏడాది కాలం పట్టొచ్చని అంచనా.

**నేను సీనియర్ సిటిజన్‌ను. రెండేళ్ల క్రితం ఫ్రాంక్లిన్ ఇండియా అల్ట్రా షార్ట్ బాండ్ ఫండ్–సూపర్ ఇన్‌స్టిట్యూషనల్ ప్లాన్‌లో రూ. 10 లక్షల మేర ఇన్వెస్ట్ చేశాను. నెల క్రితం వరకూ ఈ ఫండ్ పనితీరు బాగానే ఉంది. ఈ ఫండ్ పనితీరు, ఎన్‌ఏవీ(నెట్ అసెట్ వేల్యూ)లు హఠాత్తుగా పడిపోయాయి. రేటింగ్ కూడా ఫైవ్ స్టార్ నుంచి త్రి స్టార్‌కు పడిపోయింది. ఇలా ఎందుకు జరిగింది ? ఇప్పుడు నేను ఏం చేయాలి ?** *–శ్రీకాంత్, విశాఖపట్టణం*

ఒక ఫండ్‌లో పెద్ద మొత్తాన్ని ఇన్వెస్ట్ చేసి ఊరుకోకుండా, ఫండ్ పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండటం మంచి విషయం. మీరు మీ ఫండ్‌ను జాగ్రత్తగా, సరిగ్గా పరిశీలిస్తున్నారు. ఫ్రాంక్లిన్ ఇండియా అల్ట్రా షార్ట్ బాండ్ ఫండ్–సూపర్ ఇన్‌స్టిట్యూషనల్ ప్లాన్... ఇప్పటివరకూ స్టార్ పెర్ఫామరే. ఇప్పటివరకూ 8–9% రాబడులనిచ్చింది. నెలన్నర క్రితం నుంచి ఈ ఫండ్ ఎన్ఏవీ బాగా తగ్గుతూ వస్తోంది. ఫ్రాంక్లిన్ ఇండియా మ్యూచువల్ ఫండ్ సంస్థ, వొడాఫోన్ ఐడియాలో భారీగా ఇన్వెస్ట్ చేసింది. ఐడియా కంపెనీ ఏజీఆర్ (సవరించిన స్థూల రాబడి) బకాయిలు భారీగా ఉండటం, ఈ ఏజీఆర్ బకాయిల విషయమై వెసులుబాటు లేకపోవడం వల్ల ఈ కంపెనీ మనుగడ విషయమై అనుమాన మేఘాలు కమ్ముకున్నాయి. 2018, డిసెంబర్‌లో మార్కెట్ నియంత్రణ సంస్థ, సెబీ మ్యూచువల్ ఫండ్స్‌కు సంబంధించి సైడ్ పాకెటింగ్ నిబంధనలను అమల్లోకి తెచ్చింది. ఈ నిబంధనల ప్రకారం, ఫ్రాంక్లిన్ ఇండియా అల్ట్రా షార్ట్ బాండ్ ఫండ్–సూపర్ ఇన్‌స్టిట్యూషనల్ ప్లాన్ డిస్ట్రెస్డ్ అసెట్స్ కోసం ఒక ప్రత్యేకమైన పోర్ట్‌ఫోలియోను ఏర్పాటు చేసింది. ఈ పోర్ట్‌ఫోలియోలో చేర్చిన డిస్ట్రెస్డ్ అసెట్స్ రికవరీ అయితే ఆ మేరకు ప్రయోజనం ఇన్వెస్టర్లకు కలుగుతుంది. వొడాఫోన్ ఐడియా కంపెనీ సమస్యలకు పరిష్కారం దొరికే అవకాశాలే అధికంగా ఉన్నాయి. మీలాంటి ఇన్వెస్టర్లకు కూడా ఊరట కలగవచ్చు.

## ఉద్యోగులకు పీఎఫ్ ఊరట..

### 3 నెలల జీతం విత్‌డ్రాయల్‌కు అనుమతి



**న్యూఢిల్లీ:** కరోనా వైరస్ కట్టడి కోసం లాక్‌డౌన్ నేపథ్యంలో ఉద్యోగులు, కార్మికులకు ఊరటనిచ్చేలా కేంద్రం నిర్ణయం తీసుకుంది. కేంద్ర కార్మిక శాఖ జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం.. 3 నెలల బేసిక్ పేతో పాటు డియర్‌నెస్ అలవెన్స్ లేదా పీఎఫ్ ఖాతాలో జమైన మొత్తంలో 75 శాతం (ఏది తక్కువైతే అది) విత్‌డ్రా చేసుకోవచ్చని పేర్కొంది. అలాగే, కేవైసీ (నో యువర్ కస్టమర్) నిబంధనల ప్రకారం వివరాలన్నీ ఇచ్చిన చందాదారులకు ఆన్‌లైన్‌లోనే క్లెయిమ్ సెటిల్ చేసే విధానాన్ని కూడా అందుబాటులోకి తెచ్చినట్లు వివరించింది. దీనితో అర్హులైన చందాదారుల నుంచి విత్‌డ్రా దరఖాస్తులు అందిన వెంటనే సత్వరం ప్రాసెస్ చేసేలా చర్యలు తీసుకోవాలంటూ క్షేత్ర స్థాయి కార్యాలయాలకు ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) ఆదేశాలు జారీ చేసింది.

**కోడిగుడ్లు** (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 30-3-2020

| | |
|---|---|
| విశాఖ | 345–00 |
| చిత్తూరు | 353–00 |
| వరంగల్ | 338–00 |
| గోదావరి | 345–00 |
| విజయవాడ | 345–00 |
| **29–3–2020 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 335–00 |

# గృహ నిర్బంధంపై మరింత ఫోకస్

**కేసులు పెరుగుతుండటంతో వైద్య ఆరోగ్యశాఖ తాజా మార్గదర్శకాలు**

- విదేశాల నుంచి వచ్చినవారు, వారితో కాంటాక్ట్ ఉన్నవారికే ఈ నిబంధనలు
- జిల్లా అధికారులు వారి చేతిపై క్వారంటైన్ ముద్ర వేయాలి... ప్రత్యేక బృందం పర్యవేక్షించాలి
- వారితో గర్భిణులు, పిల్లలు, వృద్ధులు దూరం పాటించాలి... దీర్ఘకాలిక రోగులు కూడా..

**సాక్షి, హైదరాబాద్:** కరోనా కేసుల సంఖ్య పెరగడం, ఒక పాజిటివ్ వ్యక్తి మృతి చెందడం, ఇప్పటికే కరోనా వైరస్ రెండో దశ నుంచి మూడో దశలోకి ప్రవేశించే పరిస్థితులు నెలకొనడంతో వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. విదేశీ ప్రయాణాలు చేసి వచ్చినవారు, వారితో కాంటాక్ట్ అయినవారు గృహనిర్బంధంలో (హోం క్వారంటైన్) ఉన్నారు. వారికి మరిన్ని జాగ్రత్తలు చెబుతూ తాజాగా మార్గదర్శకాలు జారీ చేసింది. హోం క్వారంటైన్‌లో పాటించాల్సిన అంశాలపై ప్రత్యేక బులెటిన్‌ను ఆదివారం విడుదల చేసింది. కరోనా లక్షణాలున్న వారిని, ఇతరుల నుంచి వేరుచేయడం దీని ప్రధాన ఉద్దేశం. తద్వారా ఇతరులకు ఆ లక్షణాలు సంక్రమించకుండా నిరోధించడమే లక్ష్యం.

## హోం క్వారంటైన్‌లో ఎవరుండాలి?

- ఇతర దేశాల నుండి వచ్చిన ప్రయాణికులంతా ఉండాలి. వారికి కరోనా లక్షణాలున్నా లేకపోయినా ఉండాలి.
- కరోనా పాజిటివ్ వచ్చిన వ్యక్తులతో కలిసి మెలిసి తిరిగిన వారు, తద్వారా ఏవైనా లక్షణాలు వృద్ధి చెందితే వారు కూడా హోం క్వారంటైన్‌లో ఉండాలి.
- హోం క్వారంటైన్‌లో ఉండే వ్యక్తి ముంజేతిపై జిల్లా అధికారులు తప్పకుండా ముద్ర వేయాలి.
- ప్రత్యేక టాయిలెట్ ఉన్న గది క్వారంటైన్ వ్యక్తులకు కేటాయించాలి. ఆ గదికి మంచి వెంటిలేషన్ ఉండాలి. క్వారంటైన్ కాలంలో కేటాయించిన గది నుండి బయటికి వెళ్లకూడదు.
- మరొక కుటుంబ సభ్యుడు ఒకే గదిలో ఉండాల్సి వస్తే.. ఇద్దరి మధ్య కనీసం మీటర్ దూరం ఉండాలి.
- వృద్ధులు, గర్భిణిలు, పిల్లలుసహా ఇంట్లో ఎవరికైనా మధుమేహం, క్షయ, గుండె జబ్బులు, దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులుంటే వారంతా క్వారంటైన్‌లో ఉన్న వ్యక్తికి దూరంగా ఉండాలి.
- సామాజిక, మతపరమైన సమావేశాలకు హాజరుకాకూడదు. ఉదాహరణకు వివాహాలు, సంతాపాలు మొదలైనవి.
- ప్రజారోగ్య చర్యలను తప్పక పాటించాలి. కనీసం 20 సెకన్లపాటు సబ్బు లేదా ఆల్కహాల్ ఆధారిత హ్యాండ్ శానిటైజర్‌తో చేతిని బాగా కడగాలి.
- అందుబాటులో ఉంటే కాగితపు తువ్వాళ్లను వాడాలి. లేకుంటే గుడ్డ తువ్వాళ్లను వాడాలి. తడి తువ్వాళ్లు వాడరాదు.
- ఆ వ్యక్తి వాడే వస్తువులను డిటర్జెంట్‌తో పూర్తిగా కడగాలి. అతను వాడే వస్తువులను ఇతర వ్యక్తులు తాకకూడదు.
- అన్ని సమయాలలో కూడా క్వారంటైన్ వ్యక్తి శస్త్రచికిత్సల సందర్భంగా ఉపయోగించే మాస్క్‌ను ధరించాలి. మాస్క్‌ను ప్రతి 6–8 గంటలకు మార్చాలి. ఆపై పారేయాలి.
- ఉపయోగించిన మాస్క్‌లను, ఇతర పారవేసే వస్తువులను దహనం చేయాలి. లేదా లోతైన గోతిలో పాతిపెట్టాలి.
- క్వారంటైన్‌లో ఉన్న వ్యక్తికి లక్షణాలు కనిపిస్తే (దగ్గు, జ్వరం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది) వెంటనే సమీప ఆరోగ్య కేంద్రానికి తరలించాలి. లేదా 104కు కాల్ చేయాలి.
- క్వారంటైన్‌లో ఉన్న వ్యక్తికి సేవలు అందించే సహాయకుడు మాత్రమే అన్నీ చూసుకోవాలి. సందర్శకులను ఇంటి లోపలకు అనుమతించకూడదు.
- గదిలోని మంచం, దాని చుట్టుపక్కల ఫ్రేములు, ఇతర ఫర్నిచర్ వంటివి తరచుగా తాకినట్లయితే వాటిని కడగాలి.
- టాయిలెట్‌ను రోజూ ఒకసారి శుభ్రం చేసి క్రిమిసంహారకం చేయాలి.
- క్వారంటైన్‌లో ఉన్న వ్యక్తి దగ్గరి స్నేహితులు కూడా 14 రోజులు హోం క్వారంటైన్‌లోకి వెళ్లాలి. ప్రధాన వ్యక్తికి లక్షణాలుండి వైద్య పరీక్షలకు శాంపిళ్లను పంపితే అదనంగా మరో 14 రోజులు ఆసుపత్రిలో ఉండాలి.
- పొరుగువారితో క్వారంటైన్ వ్యక్తి కలిసి తిరిగితే వారిని కూడా క్వారంటైన్‌లోకి తీసుకోవాలి. ఈ విషయాన్ని సంబంధిత అధికారికి తెలియజేయాలి.

## ‘ఎల్పీజీ’పై తొందరవద్దు!

**సాక్షి, హైదరాబాద్:** దేశ వ్యాప్తంగా లాక్‌డౌన్ కట్టుదిట్టంగా అమలవుతుండంతో వంట గ్యాస్ సిలిండర్ల బుకింగ్‌లు అనూహ్యంగా పెరుగుతున్నాయి. లభ్యత తగ్గిపోతుందన్న ఆందోళనతో వినియోగదారులు అవసరానికి మించి బుకింగ్‌లు చేస్తుండటంతో డిమాండ్ పెరుగుతోంది. దీంతో ఆయిల్ కంపెనీలపై ఒత్తిడి పెరుగుతోంది. ఈ క్రమంలో ఎల్పీజీ సిలిండర్ల కొరత ఎక్కడా లేదని, వినియోగదారులు ఆందోళనకు గురికావొద్దని ఇండియన్ ఆయిల్ కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కళికృష్ణ ప్రకటించారు.

- పది రోజులుగా భారీగా బుకింగ్‌లు
- అనవసర బుకింగ్‌లు వద్దు: ఆయిల్ కంపెనీలు
- డిమాండ్ మేరకు సరఫరాకు హామీ
- సిటీలో రోజుకు 3.50 లక్షలకు పెరిగిన బుకింగ్‌లు

### కొరత లేదు..

దేశవ్యాప్తంగా ఫిబ్రవరి, మార్చి నెలల్లో బుకింగ్‌లు పెరిగాయి. దేశవ్యాప్తంగా రోజుకు 15–18 లక్షల బుకింగ్‌లు ఉంటుండగా, మార్చి నాటికి 20 నుంచి 22 లక్షలకు పెరిగాయి. పది రోజులుగా ఏకంగా రోజుకు దేశవ్యాప్తంగా 25లక్షల బుకింగ్‌లు జరుగుతున్నాయి. హైదరాబాద్‌లో రోజుకు 2లక్షల వరకు బుకింగ్‌లు ఉంటుండగా, అవిప్పుడు ఏకంగా 3.50లక్షల వరకు పెరిగాయి. రెండ్రోజుల కిందట వరకు తొలి సిలెండర్ బుకింగ్ చేసిన అనంతరం రెండో బుకింగ్ చేసేందుకు కేవలం ఒక్క రోజు వ్యవధి మాత్రమే ఉండటంతో బుకింగ్‌లు పెరగడంతో, ఆయిల్ కంపెనీలు పలు ఆంక్షలు తెచ్చాయి. ఒక్కో సిలిండర్ బుకింగ్‌కు మధ్య గ్యాప్‌ను 14 రోజులకు పెంచాయి. అంటే 14 రోజుల తర్వాతే రెండో సిలిండర్ బుక్ చేసుకోవాలి. ఈ నేపథ్యంలో ప్రజల్లో ఆందోళన తగ్గించే ఉద్దేశంతో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఓ ప్రకటన విడుదల చేసింది. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్‌తో పాటే ఎల్పీజీ నిల్వలు సరిపడేంతగా ఉన్నాయని, సాధారణంగా సరఫరాను సైతం కొనసాగిస్తున్నాయని ప్రకటించింది. అనవసరం బుకింగ్‌లు వద్దని, డిజిటల్ చెల్లింపులకు మొగ్గు చూపాలని సూచనలు చేసింది. ఎల్పీజీ వినియోగదారుల కోసం **హెల్ప్‌లైన్ 1906**ను ఏర్పాటు చేసినట్లు తెలిపింది.



# కరోనా బాధితుల్లో మగవారే ఎక్కువ

**ఇప్పటివరకు నమోదైన కేసుల్లో 71% పురుషులే**

- మహిళలకు రిస్క్ తక్కువ... చిన్న పిల్లలకు రిస్క్ లేనట్లే
- గుండె వ్యాధిగ్రస్తులే కరోనాకు మొదటి శత్రువులు
- పొగతాగే అలవాటున్న వారికి మరింత ప్రమాదం
- చనిపోయిన వారిలో 29.9 శాతం 70 ఏళ్లు పైబడినవారే
- కరోనా అప్‌డేట్స్ ఇచ్చే ‘వరల్డోమీటర్’ నివేదిక వెల్లడి

**సాక్షి, హైదరాబాద్:** కరోనాకు ప్రభావితం అవుతున్న వారిలో అధికంగా పురుషులే ఉంటున్నారు. ఇప్పటివరకు నమోదైన కేసుల్లో 71 శాతం మగవారే ఉన్నట్లు అంతర్జాతీయ కరోనా అప్‌డేట్స్‌ను అందించే ‘వరల్డ్ మీటర్’అనే వెబ్‌సైట్ ఇటీవల నివేదికలో వెల్లడించింది. కరోనాతో మహిళలకు రిస్క్ తక్కువగా ఉన్నట్లు తెలిపింది. పొగతాగే అలవాటుండటం, కాలుష్యానికి అధికంగా ప్రభావితం కావడం తదితర కారణాలతో మగవారిలో శ్వాసకోశ, ఊపిరితిత్తుల సమస్యలు ఏర్పడటం వల్ల కరోనా మరణాల సంఖ్య అధికంగా ఉన్నట్లు తెలిపింది. ఈ వైరస్ అత్యంత వేగంగా వ్యాపిస్తుందని తెలిపింది. చైనా నేషనల్ హెల్త్ కమిషన్ (ఎన్‌హెచ్‌సీ) అంచనాల ప్రకారం, మరణించిన వారిలో 80 శాతం మంది 60 ఏళ్ల పైబడిన వారు. వారిలో 75 శాతం మందికి గుండె సంబంధిత సమస్యలు, డయాబెటీస్ వంటివి ఉన్నాయని తేలింది. అలాగే ప్రపంచంలో ఇప్పటివరకు నమోదైన కేసుల్లో ఎక్కువ మంది కరోనాకు గురయ్యేది పురుషులేనని నివేదిక వెల్లడించింది. అంటే 71 శాతం మంది ఈ వైరస్‌కు మగవారు ప్రభావితం అవుతున్నారని తెలిపింది. అయితే కరోనా వైరస్ అన్ని వయస్సుల వారిని ప్రభావితం చేస్తుంది. ప్రధానంగా వృద్ధులు, ఉబ్బసం, డయాబెటీస్, గుండె సమస్యలు ఉన్న వారికి అధికంగా సోకుతుందని నివేదిక తెలిపింది. కాలానుగుణంగా ఫ్లూ, వైరస్‌ల వల్ల ప్రతీ ఏడాది ప్రపంచంలో 6.50 లక్షల మంది వరకు చనిపోతున్నారని తెలిపింది.

**గుండె వ్యాధులున్న వారిపైనే ప్రభావం**

కరోనా బారినపడేవారు అధికంగా ఇతరత్రా అనారోగ్య సమస్యలున్నవారే ఉన్నారని నివేదిక తెలిపింది. గుండె వ్యాధులున్నవారు అధికంగా చనిపోయారు. ఇతరుల వివరాలపై స్పష్టత లేదు.

**70 ఏళ్లకు పైబడిన వారిలోనే మరణాలు అధికం...**

కరోనా వైరస్‌కు చనిపోతున్నవారిలో అధికంగా 70 ఏళ్లకు పైబడినవారే ఉన్నారని నివేదిక తెలిపింది. చైనాతో పాటు ప్రపంచంలో ఇప్పటివరకు కరోనాతో చనిపోయినవారి లెక్కలను విశ్లేషిస్తే, 70 ఏళ్లకు పైబడినవారు 29.9 శాతం ఉన్నారు. పిల్లల్లో చాలా తక్కువ కరోనా కేసులు కనిపిస్తున్నాయి. లింగ నిష్పత్తిని లెక్క వేస్తే చైనాలో ధూమపానం మగవారిలో ఎక్కువగా ఉందని నివేదిక తెలిపింది. ధూమపానం శ్వాసకోశ సమస్యల ప్రమాదాన్ని పెంచుతుంది. కాబట్టి కరోనా మరణాల రేటు పురుషుల్లో అధికంగా ఉందని నివేదిక తెలిపింది. కేసుల సంఖ్యను, మరణాల సంఖ్యను లెక్కలోకి తీసుకుంటే... పురుషుల్లో మరణ రేటు 4.7 శాతం, మహిళల్లో 2.8 శాతంగా మరణ రేటు ఉందని తెలిపింది.




**పొగతాగే వారిపై తీవ్ర ప్రభావం**

పొగతాగే వారికి కరోనా సోకే అవకాశం ఎక్కువగా ఉంది. కరోనా ఊపిరితిత్తులకు సంబంధించిన వైరస్. పొగతాగే వారికి ఊపిరితిత్తుల సమస్య ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ఈ వైరస్ ప్రధానంగా పొగతాగే అలవాటున్నవారిపై ఎక్కువగా ప్రభావం చూపుతుంది. కాబట్టి పొగతాగడాన్ని నిలిపివేయాలి.

– నాగ శిరీష, యాంటీ టొబాకో యాక్టివిస్ట్, హైదరాబాద్




## వారికి ఢిల్లీలోనే అంటిందా?

**సాక్షి, హైదరాబాద్:** ఇటీవల ఢిల్లీలో జరిగిన ఓ మత ప్రచార కార్యక్రమం తెలుగు రాష్ట్రాల ప్రజల్లో కలకలం రేపుతోంది. ఢిల్లీలో జరిగిన ఆ మత ప్రచార కార్యక్రమానికి వెళ్లి వచ్చిన వారిలో చాలామందికి ఇప్పుడు కరోనా లక్షణాలు బయటపడుతున్నాయి. ఈ నేపథ్యంలోనే కరోనా కారణంగా ఓ వృద్ధుడు (74) మరణించాడు. అతడు కూడా ఢిల్లీలో జరిగిన మత కార్యక్రమానికి హాజరయ్యాడని తెలియడం నగరవాసుల్లో ఆందోళనకు కారణమవుతోంది. కుత్బుల్లాపూర్‌కు చెందిన ఓ వ్యక్తి కూడా అదే వేడుకకు వెళ్లి వచ్చి కరోనా లక్షణాలతో గాంధీలో చేరాడు. అతని నలుగురు కుటుంబ సభ్యులకు, పాతబస్తీలో ఒకే కుటుంబంలో ఆరుగురికి కరోనా పాజిటివ్ వచ్చింది. వీరంతా ఢిల్లీలో జరిగిన మత కార్యక్రమానికి హాజరైనవారే. అదే కార్యక్రమానికి వెళ్లివచ్చిన నిజామాబాద్‌లోని ఖిల్లా ప్రాంతానికి చెందిన వ్యక్తికీ కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ కావడం ఈ అనుమానాలకు మరింత బలమిచ్చింది. సదరు వేడుకకు వెళ్లిన పలువురు ఏపీ పౌరులకూ కరోనా పాజిటివ్ అని తేలడం గమనార్హం.

- కరోనా బాధితుల్లో అధికశాతం ఢిల్లీలో మతకార్యక్రమానికి వెళ్లినవారే
- వెళ్లిన వారి సంఖ్యపై ఇంకా రాని స్పష్టత
- అంతా రైళ్లోనే తిరుగు ప్రయాణం.. సెల్ఫ్ క్వారంటైన్‌పై అనాసక్తి

### వారంతా పాజిటివే..!

ఢిల్లీలో జరిగిన మత ప్రచార కార్యక్రమానికి ఇండోనేసియా నుంచి వచ్చిన మతబోధకులు హాజరయ్యారు. వారందరిలోనూ అప్పటికే కరోనా లక్షణాలు ఉన్నాయి. అలా ఆ కార్యక్రమానికి వెళ్లిన వారికీ వైరస్ సంక్రమించి ఉంటుందని అనుమానిస్తున్నారు. ఇదే బృందానికి చెందిన కొందరు ఇండోనేసియన్లు తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లో పర్యటించారు. వారందరిలోనూ కరోనా పాజిటివ్ లక్షణాలు ఉండటంతో వారి ద్వారా స్థానికులకూ వ్యాపించింది. ఇండోనేసియాకు చెందిన పదిమంది బృందం కరీంనగర్‌లో పర్యటించడం ఎంత కలకలానికి కారణమైందో తెలిసిందే. అలాగే తమిళనాడులోనూ వీరు పర్యటించడం అక్కడ కూడా కరోనా అలజడికి కారణమైంది.

### రైల్లోనే తెలుగు రాష్ట్రాలకు..

ఢిల్లీలో జరిగిన సదరు కార్యక్రమానికి తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు 1,500 నుంచి 2,000 వరకు హాజరైనట్లు సమాచారం. కార్యక్రమం అనంతరం కొందరు విమానాల్లో, అధికశాతం రైల్లోనే తెలుగు రాష్ట్రాలకు వచ్చారు. ఇప్పటికే వారిలో కొన్ని కుటుంబాలు కరోనా బారినపడ్డాయి. ఆ కుటుంబాలతో సఖ్యతగా ఉన్న వారు కూడా ఇప్పుడు తమలో ఏ క్షణాన వ్యాధి లక్షణాలు బయటపడతాయోనని భయపడుతున్నారు. మరోవైపు రైలు ప్రయాణం చేసిన కోవిడ్ బాధితుల ద్వారా ఆ వ్యాధి వారికి తెలియకుండానే ఎంతమందికి వ్యాపించి ఉంటుందో అన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. ఢిల్లీకి వెళ్లి వచ్చినవారి లెక్క తేలితే గానీ ఈ విషయంలో ఒక స్పష్టతకు రావడం కష్టమంటున్నారు అధికారులు.



### వలస కూలీలకు అండగా..

మిర్చి ఏరటానికి మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా నుంచి వచ్చిన కొందరు వలస కూలీలు లాక్‌డౌన్ నేపథ్యంలో తమ సొంతూళ్లకు కాలినడకన బయల్దేరారు. వారి గురించి తెలుసుకున్న గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతిరాథోడ్ వారితో మాట్లాడి వారు ఆమన్‌గల్‌లోని జెడ్పీ పాఠశాలలో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వలస కూలీలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకుంటామని భరోసా ఇచ్చారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ఐటీ, మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ ఆమెను అభినందించారు.

–మహబూబాబాద్ రూరల్

## ఎవరినీ అనుమతించొద్దు

**చిరాక్‌పల్లి చెక్‌పోస్టును సందర్శించిన మంత్రి హరీశ్‌రావు**

**జహీరాబాద్ టౌన్:** లాక్‌డౌన్ నేపథ్యంలో కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వచ్చే వారిని రాష్ట్రంలోకి ఎట్టి పరిస్థితుల్లో అనుమతించకూడదని మంత్రి హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ సమీపంలోని చిరాక్‌పల్లి వద్ద ఏర్పాటు చేసిన తెలంగాణ, కర్ణాటక సరిహద్దు చెక్‌పోస్టును సందర్శించారు. ఇప్పటివరకు ఎన్ని వాహనాలు రాష్ట్రంలోకి వచ్చాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. వలస కూలీలను గుర్తించి వారికి భోజన వసతి కల్పించాలని పేర్కొన్నారు.

## కరోనాపై పోరుకు విరాళాల వెల్లువ

కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో ప్రభుత్వం చేపడుతున్న సహాయక చర్యల కోసం పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులతో పాటు వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఆపన్న హస్తం అందించేందుకు ముందుకు వస్తున్నాయి. ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళాలను ప్రకటిస్తున్నాయి.



- రాష్ట్ర ఐపీఎస్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో తమ ఒకరోజు వేతనాన్ని సీఎం సహాయనిధికి విరాళంగా అందజేసింది. ఈ మేరకు ఆదివారం డీజీపీ మహేందర్‌రెడ్డి సీఎం కేసీఆర్‌కు చెక్కును అందజేశారు.
- అశ్వారావుపేట ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు తన నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి రూ.3 కోట్లు ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేయనున్నట్లు ప్రకటించారు.
- ముఖ్యమంత్రి సహాయనిధికి తెలంగాణ రిటైర్డ్ కాలేజీ లెక్చరర్స్ అసోసియేషన్ రూ. 1 కోటి విరాళం ప్రకటించింది. తమ పెన్షన్ల నుంచి ‘ఒకరోజు పెన్షన్’ను మినహాయించాలని విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చిత్రా రామచంద్రన్‌కు అసోసియేషన్ సభ్యులు సూచించారు.



- తెలంగాణ విద్యా వలంటీర్ల సంఘం.. రాష్ట్ర వ్యాప్తంగా గల 15,681 మంది వలంటీర్ల ఒక రోజు వేతనం కింద రూ.62,72,400 సీఎం సహాయ నిధికి విరాళంగా ప్రకటించింది. ఈ మేరకు చెక్కును ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావుకు అందచేశారు.

## ప్రధాని సహాయ నిధి పేరుతో నకిలీ ఖాతాలు

**సాక్షి,హైదరాబాద్:** కరోనా ఒకపక్క వణికిస్తోంటే, మరోవైపు సైబర్ నేరగాళ్లు వినూత్న మోసాలకు దిగుతున్నారు. ప్రధానమంత్రి సహాయనిధికి పలువురు పౌరులు స్వచ్ఛందంగా విరాళాలు ఇస్తోన్న సంగతి తెలిసిందే. ఇదే అదనుగా పలువురు నకిలీ ఖాతాలు సృష్టించి, స్వాహా చేస్తున్నారని తెలంగాణ పోలీసులు హెచ్చరిస్తున్నారు. పీఎం సహాయనిధికి విరాళాలిచ్చేవారు అన్ని వివరాలు తనిఖీ చేసుకోవాలని సూచించారు. ‘పీఎం కేర్స్’ పేరిట ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన ఖాతాలో అక్షరాలను మార్చి, అమాయకులను ఏమారుస్తున్నారని పోలీసులు తెలిపారు.




**వినండ్రా బాబూ.. లాక్‌డౌన్ నిబంధనలు ఉల్లంఘించొద్దంటూ ఉప్పల్‌లో ట్రాఫిక్ పోలీసు ప్రచారం..**

# కరోనా కట్టడికి ప్రత్యేక యాప్

**శాఖల మధ్య సమన్వయానికి సాంకేతిక సాయం**




- బాధితుల గుర్తింపు, విదేశాల నుంచి వచ్చిన వారిపై నిఘాకు తోడ్పాటు
- మరో 10 రోజుల్లో పూర్తిస్థాయిలో అందుబాటులోకి యాప్
- స్టార్టప్‌ల ద్వారా వెంటిలేటర్లు, టెస్ట్ కిట్ల తయారీ

**సాక్షి, హైదరాబాద్:** కరోనా ప్రభావాన్ని కట్టడి చేసేందుకు వివిధ ప్రభుత్వ శాఖల భాగస్వామ్యంతో రాష్ట్ర ప్రభుత్వం బహుముఖ వ్యూహాన్ని అమలు చేస్తోంది. విదేశాల నుంచి వచ్చిన వారిని గుర్తించి క్వారంటైన్‌కు తరలించడం, బాధితులకు వైద్య సేవలు, లాక్‌డౌన్ నేపథ్యంలో తలెత్తుతున్న ఇబ్బందుల పరిష్కారంలో ప్రభుత్వం తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ శాఖల నడుమ మెరుగైన సమన్వయం సాధించడంతోపాటు బాధితుల గుర్తింపు, చికిత్స, కరోనాపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ఐటీ సాంకేతికతతో డ్పాటు తీసుకోవాలని నిర్ణయించింది. పలు ఫీచర్లతో కూడిన ప్రత్యేక యాప్‌ను రూపొందించడంపై ఐటీ విభాగం ఇప్పటికే కొంత పురోగతి సాధించింది. పది రోజుల్లో అందుబాటులోకి రానున్న ఈ యాప్ ద్వారా కరోనా బాధితుల గుర్తింపు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన వంటి అనేక చర్యలు సులభతరం కానున్నాయి. లొకేషన్ డేటా ఆధారంగా ఇప్పటివరకు ప్రభావితమైన వారు, వ్యాధి విస్తరణకు అవకాశం ఉన్న ప్రాంతాలు తదితర అంశాలను కూడా ఈ యాప్ ద్వారా తెలుసుకొనే వీలుంటుంది.

### స్వీయ గృహ నిర్బంధంపై నిఘా...

ఐటీశాఖ రూపొందిస్తున్న కొత్త యాప్ ద్వారా విదేశాల నుంచి వచ్చిన వారు స్వీయ గృహనిర్బంధం ఎంత మేరకు పాటిస్తున్నారనే విషయం తెలుసుకొనే అవకాశం ఉంటుంది. వారి వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలగకుండా ఎప్పటికప్పుడు యాప్ ద్వారా వారి కదలికలు తెలుసుకొనేలా వీలుంటుందని ఐటీశాఖ వర్గాలు చెబుతున్నాయి. యాప్‌లోని ఈ–ఫ్రాప్ అనే హైపర్‌లింక్ ద్వారా విదేశాల నుంచి వచ్చిన వారు, వారిలో కరోనా లక్షణాలతోపాటు వారి సాధారణ ఆరోగ్య స్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకొనే వీలుంటుంది. ఇప్పటికే సామాజిక పింఛన్ల పంపిణీలో ఉపయోగిస్తున్న ఐటీ సాంకేతికత ‘రియల్ టైమ్ డిజిటల్ అథెంటికేషన్ ఆఫ్ ఐడెంటిటీ’ని ఈ యాప్‌లో వినియోగిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ యాప్‌ను ప్రయోగాత్మకంగా పరిశీలించామని, మరో 10 రోజుల్లో పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెస్తామని ఐటీశాఖ వర్గాలు వెల్లడించాయి.

### స్టార్టప్‌ల ద్వారా వెంటిలేటర్ల తయారీ...

రాబోయే రోజుల్లో కరోనా మహమ్మారి విజృంభించినా అందుకు తగ్గట్లుగా వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. చికిత్సలో కీలకపాత్ర పోషించే వెంటిలేటర్ల తయారీతోపాటు కరోనా పరీక్ష కిట్ల తయారీపై దృష్టి సారించింది. వెంటిలేటర్లు, కిట్ల తయారీ బాధ్యతను రెండు స్టార్టప్ కంపెనీలకు అప్పగించినట్లు తెలిసింది. తక్కువ ఖర్చుతో తయారయ్యే వెంటిలేటర్లను ఇప్పటికే కాన్పూర్ ఐఐటీ రూపొందించి నమూనాను కూడా తయారు చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా తక్కువ ఖర్చుతో వెంటిలేటర్లు, పరీక్ష కిట్లను తయారు చేసే స్టార్టప్‌లను గుర్తించినట్లు సమాచారం.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.